www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 11-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 223 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 6.47 తదుపరి ఏకాదశి; నక్షత్రం: శతభిషం ఉ. 9.40 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: మ.3.35-5.04; దుర్మహూర్తం: మ.12.21-1.06, మ.2.36-3.21; అమృతఘడియలు: రా.12.28-1.56; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.21; సూర్యాస్తమయం: 5.36 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బీసీలకు కాంగ్రెస్ ఒక్క హామీనీ నెరవేర్చలే



42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
కులగణనను స్వాగతిస్తున్నాం
సర్వేకొచ్చే వారిని హామీలపై నిలదీయాలి
కాంగ్రెస్ ఏడాది వైఫల్యాలపై వారోత్సవాలు
పొంగులేటిది బాంబుల మంత్రిత్వశాఖ: కేటీఆర్

సీఎం అబద్ధాలను ఖండిస్తున్నాం

పథకాలపై సర్కారు గొప్పలు
హామీలపై చర్చకు సిద్ధమేనా?
రాష్ట్రంలో పాలన గాలికి: హరీశ్

10

మిల్లర్ల మాయ

కొనుగోళ్లలో 'దొడ్డు'దారి.. బ్లాక్ మార్కెట్‌కు పంపిన ధాన్యం లోటు భర్తీకి పావులు

మిల్లుల్లో 12 లక్షల టన్నుల ధాన్యం షార్టేజ్
అమ్ముకున్న ధాన్యాన్ని అప్పగించకపోతే 25% జరిమానా విధిస్తామన్న ప్రభుత్వం
అప్పగింతకు డిసెంబరు 31 తుది గడువు
దీంతో రైతుల వద్ద తక్కువకే కొనుగోళ్లు

సన్నాలకూ దక్కని మద్దతు ధర!

మిర్యాలగూడకు 3 వేల ధాన్యం ట్రాక్టర్లు
రూ.2200 మాత్రమే ఇస్తామన్న మిల్లర్లు
నాణ్యత, తేమ సాకులతో ధర తగ్గింపు
రోజంతా రైతుల ధర్నా, రాస్తారోకో



ట్రాక్టర్ అడ్డంగా పెట్టి.. రోడ్డుపై పడుకొని..
నల్లగొండ జిల్లా శెట్టిపాలెంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

సన్న ధాన్యాన్ని సరైన ధరకు కొనడం లేదు! ధాన్యం ఎక్కువ వస్తే.. ధర తగ్గించేస్తున్నారు! క్వింటా ధర రూ.2,200కే పరిమితం చేస్తున్నారు! మిల్లర్ల తీరును నిరసిస్తూ రైతులు ధర్నాలు కూడా చేస్తున్నారు! ఇక, దొడ్డు ధాన్యం కొనుగోలులోనూ దొడ్డ మనసు చూపడం లేదు! పైగా, ప్రభుత్వం నుంచి జరిమానాలు, కేసుల నుంచి తప్పించుకునేందుకు దొడ్డు దారి పట్టారు! గత సీజన్లలో సర్కారుకు ఇవ్వకుండా టెండర్ పెట్టిన ధాన్యానికి బదులు ఇప్పుడు కొత్త ధాన్యం సేకరించి ఇవ్వాలని పావులు కదుపుతున్నారు! వాటిని కూడా తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు! వెరసి, ఇటు సన్న ధాన్యం, అటు దొడ్డు ధాన్యంతో మిల్లర్లు ఇటు సర్కారును, అటు రైతులను మాయ చేస్తున్నారు!! ఇక సీసీఐ కొత్త నిబంధనలు పత్తి రైతుల నెత్తిన పిడుగులా మారాయి. రాష్ట్రంలో కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు కాటన్ అసోసియేషన్ ప్రకటించింది.

13

పత్తి రైతు నెత్తిన పిడుగు

నేటి నుంచి కొనుగోలు కేంద్రాలకు తాళం!
సీసీఐ నిబంధనలపై జిన్నింగ్ మిల్లర్ల కన్నెర్ర
నిరవధిక సమ్మె దిశగా అడుగులు
ఎల్-1, 2, 3 నిబంధనలతో తిప్పలు
అన్ని సెంటర్లలో పంట కొనుగోలు చేయాలి
తెలంగాణ కాటన్ అసోసియేషన్ డిమాండ్

అప్పట్లో హైదరాబాద్ రాష్ట్రానికి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా చేశారు. ఆరు దశాబ్దాల తర్వాత మళ్లీ పాలమూరు వ్యక్తికి సీఎంగా అవకాశం వచ్చింది. దయచేసి పాలమూరు అభివృద్ధికి అడ్డుపడొద్దు. నేను ఏ దేశంలో ఉన్నా.. ఎక్కడున్నా.. పాలమూరు ప్రాజెక్టులపై ప్రతి నెలా సమీక్ష చేస్తున్నా. వీటిని పూర్తి చేయకపోతే చరిత్ర నన్ను క్షమించదు.

\- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



కురుమూర్తి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, దామోదర

పాలమూరుపై కేసీఆర్ నిర్లక్ష్యం

ఈ ప్రాంత అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు
ప్రాజెక్టులు పూర్తి చేయనందుకే ఇప్పటికీ వలసలు
ఇక్కడి ప్రజలకు నిధులివ్వాల్సిన బాధ్యత ఉంది
కొందరు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు
దయచేసి పాలమూరు అభివృద్ధికి అడ్డుపడకండి
కుట్రతో కాళ్లలో కట్టెలు పెడితే.. మట్టి మనుషుల చెమటలో కొట్టుకుపోతారు: సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపడం వల్లే తెలంగాణ ఉద్యమ భాగస్వామిగా, రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెండు సార్లు సీఎంగా పనిచేసే అవకాశం కేసీఆర్‌కు వచ్చిందని.. కానీ, ఆయన ఈ ప్రాంత అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. జూరాల, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు

మిగతా 3వ పేజీలో...

తెలంగాణ బియ్యాన్ని దిగుమతి చేసుకుంటాం

మంత్రి శ్రీధర్‌బాబుతో మలేసియా పారిశ్రామికవేత్తలు
పరిశ్రమలకు రాష్ట్రం అనుకూలం
వాణిజ్య సంబంధాలు బలపడాలి
పెట్టుబడులకు మంత్రి ఆహ్వానం

3

హేమాహామీలు

మహారాష్ట్ర ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకటించిన మహాయుతి, ఎంవీఏ
ఉచిత రేషన్, మహిళా భద్రత
రుణమాఫీలు, ఉద్యోగాల కల్పన
వృద్ధాప్య, మహిళా పింఛన్ల పెంపు
పోటాపోటీగా కూటముల హామీలు
20 లక్షల మంది విద్యార్థులకు.. నెలకు 10 వేల స్టైపెండ్: అమిత్‌షా
రాయితీపై ఏటా 6 గ్యాస్ సిలిండర్లు
18 ఏళ్ల యువతులకు లక్ష సాయం
100 యూనిట్ల ఉచిత విద్యుత్తు
రూ.4 వేల నిరుద్యోగ భృతి: ఖర్గే



ప్రచార సభలో సీఎం శిందే, డిప్యూటీ సీఎంలు ఫడణవీస్, అజిత్

ముంబై, నవంబరు 10: పదిరోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలో.. అధికార కూటమి మహాయుతి, విపక్ష మహా వికాస్ ఆఘాడీ(ఎంవీఏ) ఓటర్లపై వరాల జల్లులు కురిపించాయి. మహాయుతి తరఫున 'సంకల్ప్ పత్ర' పేరుతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఎంవీఏ తరఫున 'మహారాష్ట్రనామ' పేరుతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం ఈ మేరకు తమ మ్యానిఫెస్టోలను ప్రకటించారు. యువత, పేదలు, రైతులు, మహిళాభివృద్ధి, ఉద్యోగాల కల్పనకు ఇరు కూటములు ప్రాధాన్యతనివ్వడం

మిగతా 2వ పేజీలో...

వాడివేడి 'మహా' సమరం

సమస్త బలగాలనూ మోహరించిన కూటములు
హస్తం వ్యూహాత్మక ప్రచారం
పలు రాష్ట్రాల నేతల పర్యటన
రేవంత్ ప్రచారంపై కాంగ్రెస్ అధిష్ఠానం సంతృప్తి
మోదీ సుడిగాలి ప్రచారం
ఆయన వెంట షా, యోగి
వివాదాస్పదమవుతున్న వ్యాఖ్యలు.. ఈసీ సీరియస్

ఎస్సీ, ఎస్టీ, బీసీలపై కాంగ్రెస్ కుట్ర

2

రిజర్వేషన్లు లాక్కోవాలనేది వారి వ్యూహం: ప్రధాని మోదీ

సనాతన ధర్మ ప్రబోధకుడు..
కందాడై కన్నుమూత

టీటీడీ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలందించిన రామానుజాచార్య
అష్టాదశ పురాణాలపై ప్రబోధాలు
వేద సాహిత్యం, ప్రవచనంలో ప్రవీణులు
'ధర్మ సందేహాలు' పేరుతో కార్యక్రమాలు

3



సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా
నేడు బాధ్యతలు

ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం

2


అధ్యాపకులు లేరు..
సౌకర్యాలూ లేవు

ఆ వైద్య కళాశాలలకు ఈసీ ఇవ్వొద్దు
సర్కారుకు ఉన్నత స్థాయి కమిటీ నివేదిక
పీజీ సీట్ల కోసం ఎన్ఎంసీకి పలు ప్రైవేటు మెడికల్ కాలేజీల దరఖాస్తులు
తనిఖీల్లో విస్తుపోయే పరిస్థితులు

14

దక్షిణాదికి దండన!

జనాభాను నియంత్రించినప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా నష్టం



5 రాష్ట్రాల్లో పెరుగుతున్న వృద్ధుల సంఖ్య
20 శాతానికి వృద్ధాప్య డిపెండెన్సీ నిష్పత్తి
ఉత్తరాదితో పోలిస్తే ఆరోగ్య ఖర్చులు అధికం
నియోజకవర్గాల పునర్విభజనతోనూ నష్టం

న్యూఢిల్లీ, నవంబరు 10: జనసంఖ్య విషయంలో భారతదేశం చైనాను దాటేసి అగ్రస్థానానికి చేరుకుంది! అయినా.. ఎక్కువ మంది పిల్లలను కనాలంటూ ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం స్టాలిన్ పిలుపునివ్వడం సంచలనం సృష్టించింది!! నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదితో పోలిస్తే అధిక జనాభా ఉండే ఉత్తరాది రాష్ట్రాల ఎంపీ సీట్లు పెరుగుతాయన్న ఆగ్రహం స్టాలిన్‌దైతే.. యువ జనాభా తగ్గిపోవడం వల్ల కలిగే నష్టాలపై ఆందోళన చంద్రబాబుది. మొదట్నుంచీ జనాభా నియంత్రణ విషయంలో ముందంజలో ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో.. వృద్ధుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ), ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ (ఐఐపీఎస్) ఇటీవల విడుదల చేసిన 'ఇండియా 2023 ఏజింగ్ రిపోర్ట్ ప్రకారం.. 2021లో దేశ జనాభాలో 10.1 శాతంగా ఉన్న వృద్ధుల (60ఏళ్లు దాటినవారి) సంఖ్య 2036 నాటికి 15 శాతానికి, 2050 నాటికి 20 శాతానికి

మిగతా 2వ పేజీలో...

చుట్టూ సైబర్ దొంగలు..
ఆదమరిస్తే అంతే!

పార్ట్ టైం ఉద్యోగాల నుంచి హనీ ట్రాప్ దాకా ఎన్నెన్నో మార్గాల్లో వల
విద్యార్థుల్లో అవగాహనకు పలు సూచనలతో యూజీసీ హ్యాండ్ బుక్

14

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ఐక్యత దెబ్బతీసేందుకు
కాంగ్రెస్ కుట్ర

» ఆపై రిజర్వేషన్లు లాక్కోవాలని వ్యూహం: ప్రధాని మోదీ



గుమ్లా (ఝార్ఖండ్), ముంబై, నవంబరు 10: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను విడగొట్టి వారి రిజర్వేషన్లను లాక్కోవాలని కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు కలిసుంటే పార్టీ మనుగడ కష్టమని కాంగ్రెస్‌కు తెలుసని, అందుకు వారిని విడగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కూడా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ఐక్యతకు కాంగ్రెస్ వ్యతిరేకంగానే ఉందని, వారి మధ్య ఐక్యత లేనంతవరకూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేసి దేశాన్ని దోచుకుందని ఆరోపించారు. ఈ మేరకు ఝార్ఖండ్‌లో పలుచోట్ల ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మాట్లాడారు. ఝార్ఖండ్‌లో కులాల మధ్య చిచ్చుపెట్టాలని కాంగ్రెస్- జేఎంఎం కూటమి యత్నిస్తోందని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్- జేఎంఎం కుట్రల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అధికారం చేజిక్కించుకోవడం కోసం వారు ఎంతవరకైనా వెళ్తారని అన్నారు.

రాజ్యాంగం రెడ్‌బుక్‌ని నక్సలిజంతో పోల్చుతారా?

» 2017లో ప్రధాని అదే రెడ్‌బుక్‌ను అప్పటి రాష్ట్రపతికి ఇవ్వలేదా: ఖర్గే




ముంబయి, నవంబరు 10 : రాజ్యాంగం రెడ్‌బుక్‌ని అర్బన్ నక్సలిజంతో పోలుస్తారా... అంటూ ప్రధాని మోదీ, బీజేపీలను కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రశ్నించారు. అటువంటి ప్రతినే 2017లో ప్రధాని మోదీ అప్పటి రాష్ట్రపతి కోవింద్‌కి ఇచ్చారని గుర్తుచేశారు. అందుకు సంబంధించిన ఫొటోని ఖర్గే విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. నవంబరు 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మహా వికాస్ అఘాడీ(ఎంవీయే) మేనిఫెస్టో ఆదివారం విడుదల చేసిన ఆయన అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ... ఈ వ్యాఖ్యలు చేశారు. వివిధ సామాజిక వర్గాల స్థితిగతులను తెలుసుకుని వెనుకబడిన వర్గాల వారికి లబ్ధి చేకూర్చేందుకే కాంగ్రెస్ కులగణన చేయాలని డిమాండ్ చేస్తుందే తప్ప ప్రజలను విభజించేందుకు కాదన్నారు. అలాగే రెడ్‌బుక్ రాజ్యాంగ ప్రతిని చూపిస్తూ ప్రధాని మోదీ, బీజేపీ చెబుతున్నట్లు అది ఖాళీ పుస్తకం కాదన్నారు. ప్రధానిని మళ్లీ ప్రాథమిక పాఠశాలలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. కాగా రెడ్‌బుక్ చేతబూని రాహుల్‌గాంధీ అర్బన్ నక్సల్స్, అరాచక శక్తుల మద్దతు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవల ఆరోపించారు.

కర్ణాటకలో ముగ్గురు మంత్రులకు కాంగ్రెస్ నోటీసులు!

బెంగళూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంత్రులపై వరుస వివాదాలు, అవినీతి ఆరోపణలు వస్తుండడంపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ముగ్గురు మంత్రులకు నోటీసులు జారీ చేసి, వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములు.. వక్ఫ్ బోర్డుకు చెందినవంటూ నోటీసులు ఇవ్వడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. దీనిపై బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడం, విజయపురలో నిరవధిక నిరసనకు దిగడంతో కాంగ్రెస్ అప్రమత్తమైంది. వక్ఫ్ వివాదానికి మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ కారణమని బీజేపీ మండిపడుతోంది. ఇక అబ్కారీ శాఖలో ఏటా రూ.వందల కోట్లు లంచాలు అధికారుల ద్వారానే వసూలు చేయిస్తున్నట్టు మంత్రి ఆర్‌బీ తిమ్మాపూర్‌పై వారం రోజులుగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తిమ్మాపురకు నోటీసులు అందినట్టు సమాచారం. ఇక బెళగావి జిల్లా తహసీల్దార్ కార్యాలయంలోనే రుద్రణ్ణ యడణ్ణవర్ ఆత్మహత్య చేసుకున్న కేసులో మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ పీఏ సోమును కీలక నిందితుడిగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదవడంతో అతను పరారీలో ఉన్నాడు. ఈ ముగ్గురు మంత్రులపై ఆరోపణలు రావడంపై అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది.

వాడివేడిగా మహా సమరం!

» సమస్త బలగాలను మోహరించిన మహాయుతి, ఎంవీఏ కూటములు
» వ్యూహాత్మకంగా కాంగ్రెస్ ప్రచారం
» పలు రాష్ట్రాల నేతలు రంగంలోకి
» బీజేపీ వెనుకబాటుతో మోదీ సుడిగాలి ప్రచారం.. ఆయన వెంట షా, ఆదిత్యనాథ్




మహాయుతి మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న అమిత్ షా; ఎంవీయే కూటమి మ్యానిఫెస్టో విడుదల కార్యక్రమంలో ఖర్గే

న్యూఢిల్లీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో మరో పది రోజుల్లో ఎన్నికలు జరగనుండగా అధికార మహాయుతి కూటమి, ప్రతిపక్ష మహారాష్ట్ర వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి సమస్త బలగాలను మోహరించి గెలుపుకోసం శ్రమిస్తున్నాయి. ఎంవీఏలో శివసేన(ఠాక్రే), ఎన్సీపీ (పవార్), కాంగ్రెస్ పార్టీలున్నాయి. ఆ కూటమి తరఫున శరద్ పవార్, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేతోపాటు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ ఉధృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇటీవలి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం త్రుటిలో తప్పిపోవటంతో మహారాష్ట్రను ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోవద్దని కాంగ్రెస్ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటోంది. దీంట్లో భాగంగానే తమ పార్టీ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకల నుంచి సీఎంలు, డిప్యూటీ సీఎంను రప్పించి.. ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ గ్యారెంటీల అమలు గురించి ప్రజలకు చెప్పిస్తోంది. కాంగ్రెస్ రాష్ట్రాల్లో హామీలను అమలు చేయటంలేదన్న ప్రధాని మోదీ తదితర బీజేపీనేతల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ ఈ వ్యూహరచన చేసింది. కాగా, ప్రచారపర్వంలో ఎంవీఏకు దీటుగా మహాయుతి నేతలు నితిన్ గడ్కరీ, దేవేంద్ర ఫడణవీస్, ఏక్‌నాథ్ షిండే ప్రచారం చేయలేకపోతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహాయుతిలో బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్‌పవార్) పార్టీలున్నాయి. రాష్ట్రంలో బీజేపీకి పెద్ద దిక్కైన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ విదర్భ ప్రాంతంలో తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తుండగా, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్.. తన నియోజకవర్గం నాగ్‌పూర్ సౌత్ వెస్ట్‌లో విజయం కోసం చెమటోడుస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ తరఫున ప్రచారం చేసే గట్టి స్థానిక నేతలెవరూ లేని పరిస్థితి నెలకొనడంతో ప్రధాని మోదీ శుక్రవారం నుంచి స్వయంగా రంగంలోకి దిగారు. ఆయనతోపాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉత్తర మహారాష్ట్రలోని ధులే సభతో ప్రచారానికి శ్రీకారంచుట్టిన మోదీ.. సుడిగాలిలా పలు బహిరంగ సభలు, రోడ్ షోలలో పాల్గొనడంతో మహాయుతికి ఊపు వచ్చింది. ఇప్పటి వరకూ నాగ్‌పూర్, నాసిక్, నాందేడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన మోదీ.. ఆర్టికల్ 370 రద్దును కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని, సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న ఆ పార్టీ గతంలో అంబేడ్కర్‌ను అవమానించిందన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సైతం కాంగ్రెస్ అవమానించిందన్నారు. మరఠ్వాడాలో రైతుల సమస్యలకు గత కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలే కారణమన్నారు. మరోవైపు 'విడిపోతే హతమవుతాం' అంటూ హిందువులను ఉద్దేశించి యోగి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి ఆశించిన ఫలితాలు సాధించకపోవటానికి కారణం వోట్ జిహాద్ అంటూ ఫడణవీస్ చేసిన వ్యాఖ్యలపైన ఎన్నికల సంఘం సీరియస్ అయ్యింది. మరోసారి ఆ విధంగా మాట్లాడితే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించింది. లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింలు ఎంవీఏ కూటమికి ఓట్లు వేశారన్న సంగతిని చెప్పటానికి ఫడణవీస్ వోట్ జిహాద్ అనే పదం వాడారు. ముస్లింలకు 10% రిజర్వేషన్ కల్పిస్తే ఎంవీఏకు మద్దతిస్తామంటూ ఉలేమా కౌన్సిల్ చేసిన ప్రతిపాదననూ బీజేపీ వివాదాస్పద అంశంగా మారుస్తోంది. దీనిపై కాంగ్రెస్ రాష్ట్రఅధ్యక్షుడు నానా పటోలే స్పందిస్తూ.. ఇది పచ్చి అబద్ధమని, తాము ఆ డిమాండ్‌కు అంగీకరించలేదన్నారు. ఇక కాంగ్రెస్ గ్యారెంటీల పేరుతో ప్రజలకు ఇస్తున్న హామీలను ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయడంలేదని మోదీ చెప్పగానే.. తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ సీఎంలు రేవంత్‌రెడ్డి, సుఖ్వీందర్‌సింగ్ సుక్కు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లను మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలోకి కాంగ్రెస్ తెచ్చింది. హామీలన్నీ నెరవేరుస్తున్నామని, కావాలంటే తమ రాష్ట్రాలకు వచ్చి చూడాలని వీరుముంబైలో విలేకర్ల సమావేశంలో మోదీకి సవాల్ విసిరారు.

రేవంత్‌కు జాతీయస్థాయిలో మంచి భవిష్యత్తు ఉంది!

మహారాష్ట్రలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన ప్రచారంపై కాంగ్రెస్ నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. రేవంత్ చక్కటి హిందీలో మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడైనా పార్టీకి ప్రచారం చేయగలరు. జాతీయ స్థాయిలో టీవీ చర్చల్లో పాల్గొనగలనని ఆయన ఇప్పటికే నిరూపించుకున్నారు. ప్రత్యర్థుల బూటకపు ప్రచారాన్ని తిప్పిగొట్టడంలో రేవంత్‌కు సాటి లేదు. అందుకే ఆయనను మహారాష్ట్ర స్టార్ క్యాంపెనయిర్ల జాబితాలో చేర్చాం. జాతీయ స్థాయిలో మంచి భవిష్యత్తున్న నేత రేవంత్ అని ఏఐసీసీ నాయకుడు ఒకరు పేర్కొన్నారు.



నేడే సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణస్వీకారం

దళితులు, ముస్లింలు కీలకం

లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలోని 48 స్థానాల్లో ఎంవీఏ కూటమి 31స్థానాల్లో విజయం సాధించింది. ఈ గెలుపునకు ప్రధానంగా సహకరించింది ముస్లిం, దళిత ఓటుబ్యాంకు మద్దతేనన్న విశ్లేషణలువచ్చాయి. గిరిజనులు, మహిళలు, రైతులు, గ్రామీణ యువత, కొన్ని ప్రాంతాల్లో మరాఠాలూ భారీ ఎత్తున ఎంవీఏకు మద్దతిచ్చినట్లు వెల్లడైంది. ఈ కూటమి ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ ఓటుబ్యాంకుపై ఆశలు పెట్టుకుంది. మరాఠా రిజర్వేషన్ల ఉద్యమం నడుపుతున్న మనోజ్ జారాంగే పాటిల్..మహాయుతిని ఓడించటమే లక్ష్యంగా తాము పని చేస్తామని తొలుత ప్రకటించినా తర్వాత ఆ వైఖరిని సడలించుకున్నారు. ఎవరికీ మద్దతివ్వటంలేదని, ఎన్నికల బరిలో ఉన్న తమ అభ్యర్థులను ఉపసంహరించుకున్నారు. దీని వల్ల ఎంవీఏకు మేలు జరిగే అవకాశం ఉంది. 30 నియోజకవర్గాల్లో ముస్లింల జనాభా 10-40% వరకు ఉంది. పలు ముస్లిం సంస్థలు ఎంవీఏను బలపరుస్తున్నాయి. పలువురు ముస్లిం సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛందసంస్థలు 'మహారాష్ట్ర డెమోక్రటిక్ ఫ్రంట్'గా ఏర్పాటై ఎంవీఏ గెలుపు కోసం ప్రచారం చేస్తున్నాయి.

హేమాహామీలు

(మొదటి పేజీ తరువాయి)

గమనార్హం.! నైపుణ్య గణన నిర్వహించి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని అమిత్ షా.. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధానికి బాలికలకు ఉచితంగా టీకాల కార్యక్రమాన్ని ఖర్గే ప్రకటించారు. మహారాష్ట్రలో మతమార్పిడులను నిరోధించేలా కఠిన చట్టాలను తెస్తామని షా.. కులగణన నిర్వహించి తీరుతామని ఖర్గే ఉద్ఘాటించారు. కాగా.. ఈ నెల 20న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. 23న ఫలితాలు విడుదలవుతాయి.

మహాయుతి హామీలివే..

- వృద్ధాప్య పింఛన్లు రూ.2,100కు పెంపు
- 'లడ్కీ బెహన్ స్కీమ్' కింద ప్రతి నెల ఇస్తున్న రూ.1500ను రూ.2100కు పెంపు
- 2027నాటికి రాష్ట్రంలో 50లక్షల మంది మహిళలను లక్షాధికారులను చేయడం
- స్కిల్ సెన్సస్ నిర్వహించి, పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా యువతకు శిక్షణ
- యువతకు 25 లక్షల కొత్త ఉద్యోగాల కల్పన
- 20 లక్షల మంది విద్యార్థులకు నెలకు రూ.10 వేల చొప్పున స్టైపండ్
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కృత్రిమ మేధ(ఏఐ) శిక్షణ
- వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఆర్థిక సాయం
- 45వేల గ్రామాలకు కొత్త రోడ్ల నిర్మాణం.. ప్రజలకు ఆరోగ్య బీమా
- వ్యవసాయ రుణాల మాఫీ, ఆహార భద్రతకు హామీ, నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణ. ఎరువులపై ఎస్‌జీఎస్టీ తిరిగి చెల్లింపు.
- పునరుత్పాదక ఇంధనంపై దృష్టిసారిస్తూ విద్యుత్తు బిల్లులను 30% మేర తగ్గించేందుకు చర్యలు
- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 'విజన్ మహారాష్ట్ర 2028' విడుదల
- 50 లక్షల మంది మహిళలను 2027లోగా లక్షాధికారులను చేయడం
- మహారాష్ట్రను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం

ఎంవీఏ హామీలు..

- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధానికి 9-16 సంవత్సరాల వయసు గల బాలికలకు ఉచితంగా టీకాల పంపిణీ
- రాష్ట్రంలో కులగణన
- మహిళా ఉద్యోగులకు రుతుస్రావ సమయంలో రెండు ఐచ్ఛిక సెలవులు
- స్వయం సహాయక బృందాల(ఎస్‌హెచ్‌జీ) సాధికారతకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ
- మహిళలకు ఏటా రూ.500కే ఆరు గ్యాస్ సిలిండర్లు
- మహిళా భద్రతకు 'నిర్భయ్ మహారాష్ట్ర' పాలసీ
- 18వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న బాలికలకు రూ.లక్ష ఆర్థిక సాయం
- రైతులకు రూ.3 లక్షల వరకు రుణ మాఫీ. సక్రమంగా రుణాలను తిరిగి చెల్లించేవారికి రూ.50 వేల ప్రోత్సాహకం
- యువజన సంక్షేమానికి యూత్ కమిషన్ ఏర్పాటు. డిప్లొమా, డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి
- 2.5 లక్షల ప్రభుత్వ కొలువుల భర్తీ
- ఎంఎస్ఎంఈలకు చేయూతనిచ్చేందుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ
- ప్రతినెలా 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు. నెలకు 300 లోపు యూనిట్లు వాడేవారికి వర్తింపు.

51వ సీజేఐగా జస్టిస్ ఖన్నా నేడు బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ, నవంబరు 10: సుప్రీంకోర్టు 51వ సీజేగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ఆయనతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. 1960 మే 14న జన్మించిన ఆయన ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయవాద విద్యను అభ్యసించారు. 2019 జనవరి నుంచి సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్న ఆయన ఆర్టికల్ 370 రద్దుకు సమర్థన, ఎన్నికల బాండ్ల పథకం రద్దు, ఈవీఎంలపై పిటిషన్ కొట్టివేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు సహా అనేక చారిత్రక తీర్పులిచ్చిన ధర్మాసనాలలో భాగంగా ఉన్నారు. ఇప్పటి వరకు సీజేఐగా ఉన్న జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదివారం పదవీ విరమణ చేయడంతో సుప్రీంకోర్టులో అంత్యత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఖన్నా ఆ బాధ్యతలు చేపట్టనున్నారు.

కశ్మీర్‌లో ఎదురు కాల్పులు..
ఆర్మీ అధికారి వీరమరణం



రాకేష్ కుమార్

శ్రీనగర్, నవంబరు 10: జమ్మూ-కశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ ఆర్మీ అధికారి ప్రాణాలు కోల్పోగా, ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. అడవిలో ఉగ్రవాదుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతుండగా ఉదయం 11 గంటల ప్రాంతంలో ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 16 కార్ప్స్‌కు చెందిన జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ నాయబ్ సుబేదార్ రాకేష్ కుమార్ మరణించారు. గురువారం సాయంత్రం నజీర్ అహ్మద్, కుల్దీప్ కుమార్ అనే విలేజ్ డిఫెన్స్ గార్డులను ఉగ్రవాదులు కిడ్నాప్ చేసి, హత్య చేశారు. దాంతో ఉగ్రవాదుల కోసం కుంట్వారా, కేశ్వాన్ అడవుల్లో ఆర్మీ, పోలీసు విభాగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. శనివారం నుంచి కిష్త్వార్‌లోని బార్త్ రిడ్జ్ వద్ద సంయుక్త ఆపరేషన్ మొదలయింది. ఆదివారం అడవిలో ఉగ్రవాదులు, జవాన్లు ఎదురుపడడంతో కాల్పులు చోటుచేసుకున్నాయి.

మాస్కోపై 34 డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి

మాస్కో, నవంబరు 10: రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. ఆదివారం 70 డ్రోన్లను ప్రయోగించి దాడికి యత్నించింది. రాజధాని మాస్కోను లక్ష్యంగా చేసుకొని 34 డ్రోన్లతో దాడి చేసిందని, యుద్ధం మొదలైనప్పటి నుంచి మాస్కోపై జరిగిన అతిపెద్ద డ్రోన్ దాడి అని రష్యా సైన్యం ప్రకటించింది. అయితే ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేశామని, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు చెప్పారు. అలాగే మాస్కోకు నైరుతి దిశలో గల మూడు ఎయిర్‌పోర్టులే లక్ష్యంగా ఉక్రెయిన్ ప్రయోగించిన మరో 36 డ్రోన్లను రష్యా గగనతల వ్యవస్థలు అత్యంత సమర్థంగా అడ్డుకున్నాయని సైన్యం పేర్కొంది.

దక్షిణాదికి దండన!

(మొదటి పేజీ తరువాయి)

పెరగనుంది. అంటే ఇప్పటితో పోలిస్తే అప్పటికి దేశ జనాభాలో యువకుల సంఖ్య తగ్గి వృద్ధుల సంఖ్య ఎక్కువయిపోతుందన్న మాట. విద్య, వైద్యం వంటి విషయాల్లో దేశంలోనే పురోగామి రాష్ట్రంగా పేరొందిన కేరళలో 2021 నాటికే వృద్ధుల జనాభా 16.5 శాతానికి చేరింది. 2036 నాటికి వారి సంఖ్య 22.8 శాతానికి చేరుతుందని యూఎన్ఎఫ్‌పీఏ అంచనా. ఏపీలో ఈ రేటు 19 శాతంగా ఉండగా.. తమిళనాట 20.8 శాతంగా ఉంది. అదే 2021 సంవత్సరానికి బిహార్ జనాభాలో వృద్ధుల సంఖ్య 7.7 శాతమే! యువ జనాభా సంఖ్య అధికంగా ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను ఎల్లప్పుడూ పొందుతూ ఉండాలంటే.. అందుకు సంపూర్ణ సంతాన సాఫల్య రేటు (టీఎఫ్ఆర్- ఒక మహిళ సగటున కనే పిల్లల సంఖ్య) కీలకం. 1950లో భారతదేశ సంపూర్ణ సంతాన సాఫల్య రేటు సగటు 6.1గా ఉండేది. జనాభా నియంత్రణకు చేపట్టిన చర్యల కారణంగా 2015-16 నాటికి 2.2కు.. ప్రపంచబ్యాంకు డేటా ప్రకారం 2022 నాటికి 2.01కి పడిపోయింది. ఇది జాతీయ సగటు. వాస్తవానికి ఇది 2.1గా ఉండాలి. దేశంలో.. బిహార్ (2.98), మేఘాలయ (2.91), ఉత్తరప్రదేశ్ (2.35), ఝార్ఖండ్ (2.26), మణిపూర్ (2.17) రాష్ట్రాల్లో మాత్రమే ఈ రేటు జాతీయ సగటు కన్నా ఎక్కువగా ఉంది. భారత రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం గణాంకాల ప్రకారం.. తమిళనాట ఈ రేటు 1.4గా ఉండగా.. ఏపీ, తెలంగాణ, కేరళలో 1.5గా ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం దక్షిణాది రాష్ట్రాలన్నింటి టీఎఫ్ఆర్ 1.8 కన్నా తక్కువగా ఉంది. ఏపీ, కర్ణాటకలో 1.7 కన్నా తక్కువగా ఉంది. డెమొగ్రఫీ డివిడెండ్‌ను పొందడానికి యువ జనాభా ఎక్కువగా ఉండడమే కాదు.. వృద్ధుల సంఖ్యే కాదు.. వృద్ధాప్య డిపెండెన్సీ నిష్పత్తి (ఓఏడీఆర్) తక్కువగా ఉండడమూ ముఖ్యమే. ఓఏడీఆర్ అంటే.. ప్రతి 100 మంది జనాభాలో పనిచేసే వయసులో ఉన్న (18 నుంచి 59 ఏళ్ల) జనాభా, వృద్ధుల నిష్పత్తి. ఆ నిష్పత్తి 15 దాటితే ప్రమాదం. కానీ, యూఎన్ఎఫ్‌పీఏ 2023 నివేదిక ప్రకారం ఈ నిష్పత్తి దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు 20% దాకా ఉంది. దీంతో.. జనాభాను సమర్థంగా నియంత్రించి ఎంతో వేగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు.. ఇప్పుడు తగ్గుతున్న యువకులు, పెరుగుతున్న వృద్ధుల సంఖ్యతో కలత చెందుతున్నాయి. వృద్ధుల ఆరోగ్య ఖర్చులు గణనీయంగా పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. 'ద హిందు' వార్తాపత్రికలో ఇటీవల వచ్చిన ఒక కథనం ప్రకారం.. 2017-18లో దేశవ్యాప్తంగా వృద్ధులకు సంబంధించి హృద్రోగాల చికిత్సకు పెట్టిన మొత్తం ఖర్చులో దక్షిణాది రాష్ట్రాల వ్యయం 32% (జనాభాలో ఈ రాష్ట్రాల వాటా కేవలం 20%)గా ఉండగా.. ఉత్తరాదిన హిందీ మాట్లాడే 8రాష్ట్రాల (దేశ జనాభాలో సగం ఈ రాష్ట్రాల్లోనే ఉన్నారు) వ్యయం కేవలం 24 శాతం మాత్రమే కావడం గమనార్హం.

సీట్లూ తగ్గుతాయ్!

దేశ ప్రయోజనాల నిమిత్తం జనాభా నియంత్రణలో చురుగ్గా వ్యవహరించిన పాపానికి ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా కూడా మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పార్లమెంటు సీట్ల సంఖ్య పెంపుపై ఉన్న స్తంభన.. 2026 నాటికి ముగుస్తుంది. ఆ తర్వాత.. తాజా జనగణన ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాల్సి ఉంటుంది. దీనివల్ల సహజంగానే జనాభా అధికంగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు ఎంపీ సీట్లు భారీగా పెరుగుతాయి. ఉదాహరణకు.. నాలుగు ప్రధాన రాష్ట్రాలైన యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎంపీ సీట్ల సంఖ్య ప్రస్తుతం ఉన్న 174 నుంచి 284కు పెరుగుతుందని అంచనా. అదే సమయంలో దక్షిణాదిన కొన్ని రాష్ట్రాలకు ఉన్న సీట్లే పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా దేశ రాజకీయాల్లో, విధానపరమైన నిర్ణయాలను ప్రభావితం చేయడంలో.. దక్షిణాది రాష్ట్రాల మాటకు విలువ లేకుండా పోయే ముప్పుంది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

గొత్తికోయలపై నివేదిక ఇవ్వండి!

కేంద్రం, ఏపీ సహా నాలుగు రాష్ట్రాలను కోరిన జాతీయ ఎస్టీ కమిషన్

న్యూఢిల్లీ, నవంబరు 10: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు హింస నేపథ్యంలో ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిపోయిన గొత్తికోయ గిరిజనుల పరిస్థితిపై సవివర నివేదిక ఇవ్వాలని కేంద్ర హోంశాఖతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలను జాతీయ ఎస్టీ కమిషన్ కోరింది. దీనిపై చర్చించేందుకు డిసెంబరు 9న నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని హోంశాఖ కార్యదర్శి, ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను అభ్యర్థించింది. గొత్తికోయలకు అండగా నిలిచేలా తగిన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని లేఖలో సిఫారసు చేసింది. వామపక్ష తీవ్రవాదం కారణంగా ఛత్తీస్‌గఢ్ నుంచి దాదాపు 50 వేల మంది గొత్తికోయలు వలస వెళ్లినట్లు ఒక అంచనా. వారంతా ఇప్పుడు ఏపీ, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర అటవీ ప్రాంతాల్లోని 248 చోట్ల నివసిస్తున్నారు.

కెనడా పోలీసుల అదుపులో ఖలిస్థాన్ ఉగ్రవాది డల్లా

న్యూఢిల్లీ, నవంబరు 10: ఖలిస్థాన్ ఉగ్రవాది అర్ష్‌దీప్ డల్లాను కెనడాలోని హాల్టన్ రీజనల్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అతడు హర్దీప్ సింగ్ నిజ్జర్ అనుచరుడిగా గుర్తింపు పొందాడు. డల్లాకు పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ, లష్కర్ ఏ తోయిబాతోను సంబంధాలు ఉన్నట్టు గతంలోనే ఢిల్లీ పోలీసులు ప్రకటించారు. ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్, ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. మరోవైపు, డల్లాకు అనుచరులుగా వ్యవహరిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఆదివారం పంజాబ్ పోలీసులు తెలిపారు. గత నెలలో ఫరీద్‌కోట్‌లో గురుప్రీత్ సింగ్ హరి నవ్‌ను, మధ్యప్రదేశ్‌లో మరో వ్యక్తిని హత్య చేసిన ఘటనలో ఆదిత్య కపూర్ అలియాస్ మఖాన్, రవీందర్ సింగ్‌ను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఇదిలా ఉండగా, కెనడాలో హిందూ ఆలయాలపై దాడులకు నిరసనగా ఆదివారం ఢిల్లీలోని కెనడా రాయబార కార్యాలయం వద్ద వందలాది మంది హిందువులు, సిక్కులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. హిందూ-సిక్కు గ్లోబల్ ఫోరం ఆధ్వర్యంలో ఈ ఆందోళన కార్యక్రమం జరిగింది.

బంగ్లాదేశ్ సర్కారుకు మరిన్ని అధికారాలు!

ఢాకా/న్యూఢిల్లీ, నవంబరు 10: బంగ్లాదేశ్‌లో నోబెల్ బహుమతి గ్రహీత మొహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం మరిన్ని అధికారాలను దఖలు పరచుకుంది. ఈ మేరకు మధ్యంతర ప్రభుత్వ ఆర్డినెన్స్-2024కు తాత్కాలిక(ప్రొవిజనల్) ఆమోదం పొందింది. కొత్త పార్లమెంటు ఏర్పాటై ప్రధానమంత్రి నియామకం జరిగే వరకు తాత్కాలిక ప్రభుత్వం తీసుకునే చర్యలన్నీ తాజా ఆర్డినెన్స్ వల్ల చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి. బంగ్లాదేశ్ ప్రభుత్వ తాజా చర్య నియంతృత్వమేనని భారతదేశంలోని ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొంటున్నాయి.. కాగా, యూనస్‌తో పాటు ఆయన కేబినెట్ సహచరులు మొత్తం 62 మందిపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. అవామీ లీగ్ పార్టీ నాయకుడు అన్వరుజ్జమాన్ చౌదరి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. హసీనా ప్రభుత్వాన్ని కూల్చేసిన తర్వాత వీరంతా దేశంలో మారణహోమం సృష్టించారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

స్వింగ్‌లో ట్రంప్ క్లీన్ స్వీప్

మొత్తం 7 స్వింగ్ రాష్ట్రాలు ట్రంప్‌కే జై



వాషింగ్టన్, నవంబరు 10: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మొత్తం 7 స్వింగ్ రాష్ట్రాల్లో విజయం సాధించి ట్రంప్ క్లీన్ స్వీప్ చేశారు. తాజాగా ఆరిజోనాలో విజయం సాధించి మరో 11 ఓట్లను తన ఖాతాలో వేసుకున్నారు. రిపబ్లికన్‌ల తరఫున బరిలో నిలిచిన డొనాల్డ్ ట్రంప్‌కు మొత్తం 312 ఎలక్టోరల్ ఓట్లు రాగా డెమోక్రాట్ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌కు 226 ఓట్లు వచ్చాయి. కాగా, తన తాజా కార్యవర్గంలోకి నిక్కీ హేలీ, మైక్ పాంపియోలను తీసుకోవడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. దీనికి సంబంధించి సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెట్టిన ట్రంప్ గతంలో వారు దేశానికి చేసిన సేవలకు ధన్యవాదాలు తెలిపారు. ఐక్యరాజ్యసమితిలో మాజీ రాయబారిగా పనిచేసిన నిక్కీ హేలీ.. ట్రంప్ తాజా నిర్ణయంపై స్పందించారు. గతంలో ట్రంప్‌తో కలిసి పనిచేయడం తనకు ఆనందాన్నిచ్చిందని, రాబోయే నాలుగేళ్లలో అమెరికాను మరింత పటిష్ఠం చేయాలని ఆమె ఆకాంక్షించారు. భారత సంతతికి చెందిన నిక్కీ హెలీ గతంలో సౌత్ కరోలినా గవర్నర్‌గా పనిచేశారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌తో పాటు మాజీ రాయబారి రిక్ గ్రెనెల్, ఫ్లోరిడా సెనేటర్ మార్కో రుబియో, రాబర్ట్ ఎఫ్.కెన్నెడీలకు ట్రంప్ కార్యవర్గంలో కీలక పదవులు దక్కే అవకాశం ఉంది.

కమలా హారిస్‌కు అప్పులు మిగిలాయ్!

అమెరికా రాజకీయాల్లో ఆసక్తికర సన్నివేశం ఆవిష్కృతమయింది. అప్పుల్లో ఉన్న తన ప్రత్యర్థికి ఆర్థికంగా సాయపడాలంటూ అధ్యక్షునిగా ఎన్నికయిన ట్రంప్ (రిపబ్లికన్ పార్టీ) తన మద్దతుదారులను కోరడం ప్రాధాన్యం సంతరించుకొంది. డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌కు ఒక బిలియన్ డాలర్లు (సుమారు రూ.8,500 కోట్లు) ఎన్నికల విరాళాలుగా వచ్చాయి. కానీ చివరకు ఆమెకు 20 మిలియన్ డాలర్ల (సుమారు రూ.170 కోట్లు) అప్పులు విగిలాయి. దీనిపై ట్రంప్ శనివారం ఎక్స్ ద్వారా స్పందిస్తూ "అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాట్లు రికార్డు స్థాయిలో విరాళాలు సేకరించారు. ప్రస్తుతం వారి దగ్గర డాలర్లు లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. ఐక్యత దృష్ట్యా ఇలాంటి కష్ట సమయంలో వారిని ఆదుకోవాలి" అని కోరారు. అప్పుల కారణంగా ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగులు, వివిధ వస్తువులు సరఫరా చేసిన వారికి చెల్లింపులు జరపలేని పరిస్థితి డెమోక్రటిక్ పార్టీకి ఎదురయింది.

హౌతీలపై అమెరికా దాడులు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం తర్వాత తొలిసారిగా యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారుల ఆయుధ డిపోలే లక్ష్యంగా అగ్రరాజ్యం యుద్ధవిమానాలు బాంబుల వర్షం కురిపించాయి. ఈ దాడుల్లో హౌతీలకు భారీ నష్టం వాటిల్లింది. కనీసం మూడు చోట్ల అత్యాధునిక ఆయుధ డిపోలు పూర్తిగా ధ్వంసమయ్యాయని అమెరికా అధికారులు తెలిపారు. మరోవైపు, గాజా, లెబనాన్‌లో ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. జబాలియాలోని శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 33 మంది చనిపోయారు. లెబనాన్‌లోని అల్మాత్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 23 మంది చనిపోయారు.

పేజర్ వ్యూహానికి నేనే అనుమతించా

» తొలిసారి అంగీకరించిన నెతన్యాహు

టెల్ అవీవ్, నవంబరు10: లెబనాన్‌లో హెజ్‌బొల్లా మిలిటెంట్లతో పోరులో భాగంగా సెప్టెంబర్ 17న పేజర్ల పేలుళ్ల వ్యూహానికి తానే అనుమతి ఇచ్చానని ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు అంగీకరించారు. ఈ విషయాన్ని నెతన్యాహు అధికార ప్రతినిధి ఒమెర్ దోస్త్రి ప్రకటించారు. నాటి పేజర్ పేలుళ్లలో నలభై మంది హెజ్‌బొల్లా మిలిటెంట్లు చనిపోయారు. మూడు వేల మంది గాయపడ్డారు. వాస్తవానికి నాడు జరిగిన పేజర్ల పేలుళ్ల ఘటనతో ఇజ్రాయెల్ వ్యూహాత్మకంగా హెజ్‌బొల్లాపై ఆధిపత్యం సాధించింది. ఇజ్రాయెల్ ట్రాక్ చేస్తుండటంతో దొరకకుండా ఉండేందుకు కేవలం పేజర్లు మాత్రమే వాడాలని నాటి హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లా సూచించడంతో హెజ్‌బొల్లా కేడర్ అంతా పేజర్లు వాడటం మొదలు పెట్టింది. దీంతో హమా‌స్‌కు మద్దతుగా తమపై దీటుగా పోరాడుతున్న హెజ్‌బొల్లాలను దెబ్బతీసేందుకు పేజర్ పేలుళ్ల వ్యూహాన్ని ఇజ్రాయెల్ ఇంటలిజెన్స్ సంస్థ మొసాద్ అమలు చేసింది. కాగా, పేజర్ పేలుళ్ల ఘటనపై లెబనాన్ ఈ నెల 6న ఐక్యరాజ్యసమితిలో ఫిర్యాదు చేసింది.

హమాస్‌కు ఖతార్ షాక్

టెల్ అవీవ్, నవంబరు10: హమాస్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంపై ఇరు పక్షాలు అంగీకరించకపోవడంతో మధ్యవర్తిత్వం నుంచి వైదొలుగుతున్నట్లు ఖతార్ ప్రకటించింది. అమెరికా తాజా సూచన మేరకు దోహాలో కార్యకలాపాలు ముగించాలని ఖతార్ హమాస్‌కు సూచించినట్లు సమాచారం. 2012లో అమెరికా సూచనమేరకే దోహాలో హమాస్ కార్యకలాపాలకు ఖతార్ అంగీకారం తెలిపింది. అయితే హమాస్‌ను వెళ్లిపొమ్మన్నట్లు వస్తున్న కథనాలను ఖతార్ అధికార వర్గాలు తోసిపుచ్చాయి. మరోవైపు, గాజా, లెబనాన్‌లో కాల్పుల విరమణ కోసం యూఏఈ, కువైట్ పిలుపునిచ్చాయి.

2 నెలల ముచ్చటే!

- జనవరిలో ప్రధాన కేంద్రాలుగా మినీ అంగన్‌వాడీలు
- ఏప్రిల్, మేలో మాత్రమే సిబ్బందికి పెంచిన జీతాలు
- సాంకేతిక సమస్యతో జూన్ నుంచి పాత వేతనాలే..


మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న మినీ అంగన్‌వాడీ ఉపాధ్యాయులు (ఫైల్)

జగిత్యాల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు మినీ అంగన్‌వాడీ కేంద్రాలను పది నెలల క్రితం ప్రధాన అంగన్‌వాడీలుగా చేసినా సిబ్బందికి పాత వేతనమే ఇస్తున్నారు. జనాభా, లబ్ధిదారులు తదితర 13 అంశాలను ప్రామాణికంగా తీసుకుని జనవరిలో ప్రభుత్వం వీటిని అప్‌గ్రేడ్ చేసింది. పెంచిన వేతనంతో పాటు ఇతర సౌకర్యాలను ఏప్రిల్ నుంచి వర్తింపజేస్తామని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో సుమారు 35,700 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 31,711 ప్రధాన, 3,989 మినీ అంగన్‌వాడీలు. గ్రామాల్లో 3,160, పట్టణాల్లో 42, గిరిజన ప్రాంతాల్లో 787 ఉన్నాయి. ప్రధాన అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు నెలకు రూ.13,500, మినీ అంగన్‌వాడీల వారికి రూ.7,500 చెల్లించేవారు. అప్‌గ్రేడ్ చేయడంతో అందరికీ సమాన వేతనం లభించే అవకాశం ఏర్పడింది. ఏప్రిల్, మే నెలలో రూ.13,500 ఇచ్చినా, జూన్ నుంచి మళ్లీ రూ.7,500 మాత్రమే జమ చేస్తున్నారు. ట్రెజరీలో సాంకేతిక సమస్యనే దీనికి కారణమని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇదేమిటంటూ పలువురు మినీ అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ఇటీవల రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, కమిషనర్ శ్రీదేవిని కలిసి వినతిపత్రాలు అందించి గోడు వెళ్లబోసుకున్నారు. కాగా, ప్రధాన కేంద్రంలో ఒక ఉపాధ్యాయిని, ఒక సహాయకురాలు విధులు నిర్వహిస్తుండగా.. అప్‌గ్రేడ్ అయిన మినీ కేంద్రాల్లో ఒక్క ఉపాధ్యాయిని మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరి పనిని ఒకరే చేయాల్సి రావడంతో సేవల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు అంగన్‌వాడీ కేంద్రాల స్థాయి పెరగడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ పెరుగుతుంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు ఆశించారు. అదనంగా సహాయకురాలి పోస్టు అనివార్యమవుతోంది. ప్రభుత్వం అంగీకరిస్తే కొత్తగా నియామకం జరిగే అవకాశం ఉందని భావించినా, ఆ దిశగా అడుగులు పడకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న అప్‌గ్రేడ్ పూర్తయినప్పటికీ పాత వేతనమే అందుతోందని సమస్యను పరిష్కరించాలని జగిత్యాల జిల్లా రాయికల్ గ్రామానికి చెందిన బైరి ఉమారాణి కోరుతున్నారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ కాకపోవడంతో పాత వేతనం అందుతోందని.. రాష్ట్రవ్యాప్తంగా ఇదే మాదిరిగా ఉందని సాధ్యమైనంత త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని జగిత్యాల జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి బోనగిరి నరేశ్ తెలిపారు.

తెలంగాణ బియ్యాన్ని దిగుమతి చేసుకుంటాం

మంత్రి శ్రీధర్‌బాబుతో మలేసియా పారిశ్రామికవేత్తలు

పెట్టుబడులు పెట్టేందుకు రావాలని ఆహ్వానం: దుద్దిళ్ల

హైదరాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉత్పత్తి అయ్యే బియ్యాన్ని దిగుమతి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని మలేషియా దిగుమతిదారులు, పారిశ్రామికవేత్తలు పేర్కొన్నారు. మలేషియా పర్యటనలో ఉన్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు.. ఆదివారం కౌలలంపూర్‌లో అక్కడి పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన మలేషియా బిజినెస్ మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పండుతున్న వరి ధాన్యం రకాల గురించి తెలంగాణ వ్యవసాయ వర్సిటీ ఉప కులపతి అల్దాస్ జానయ్య ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు దిగుమతిదారులు మాట్లాడుతూ తెలంగాణలో వచ్చే బియ్యాన్ని తాము తీసుకుంటామని చెప్పగా.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. కాగా, తెలంగాణలో తాము తీసుకువచ్చిన సులభతర వాణిజ్య విధానాల వల్ల పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఏర్పడిందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. మలేషియా తెలంగాణా దశాబ్ది ఉత్సవాలకు హాజరైన ఆయన ఆదివారం కౌలాలంపూర్‌లో పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మలేషియా-భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడాలని తాము కోరుకుంటున్నట్టు వివరించారు.

రాజకీయాల్లో పాతికేళ్లు.. నమ్మశక్యంగా లేదు

'అనుకోకుండా.. అనూహ్య పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వచ్చాను..నాన్న స్ఫూర్తితో ప్రజా సేవలో నిమగ్నమయ్యాను.. రాజకీయాల్లోకి వచ్చి నవంబరు10తో 25 ఏళ్లు పూర్తయ్యాయంటే.. నమ్మశక్యంగా లేదు. నేటితో సరిగ్గా పాతికేళ్ల అవుతుందన్న విషయాన్ని ఇక్కడి మిత్రులు చెప్పేదాకా నాకు గుర్తు లేదు' అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రెండున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో పార్టీ తనకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించిందని, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గేకు ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు.

పాలమూరుపై కేసీఆర్ నిర్లక్ష్యం




కురుమూర్తి ఆలయం వద్ద సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి కాకపోవడం వల్ల వలసలు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలో పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి ఆలయంలో జరుగుతున్న బ్రహోత్సవాలకు ఆదివారం ఆయన హాజరయ్యారు. అక్కడ రూ.110 కోట్ల వ్యయంతో 3.7 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఎలివేటెడ్ ఘాట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రేవంత్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ చూసినా పాలమూరు కూలీల చెమటతో కట్టిన ప్రాజెక్టులే ఉంటాయన్నారు. ఈ ప్రాంత బిడ్డను సీఎంను చేసిన ప్రజల కోసం కచ్చితంగా నిధులు మంజూరు చేసి.. ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఆలయాలతోపాటు నాడు నెహ్రూ చెప్పినట్లు ఆధునిక దేవాలయాలైన సాగునీటి ప్రాజెక్టులకూ నిధుల ప్రవాహం కొనసాగిస్తామని తెలిపారు. కృష్ణమ్మ తలాపున పారుతున్నా మక్తల్, నారాయణపేట, కొడంగల్ ప్రజలకు చుక్క నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించామని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. చిల్లరమల్లర రాజకీయాల కోసం అపర భగీరథ ప్రయత్నానికి వ్యతిరేకంగా కుట్రలు చేయొద్దని, కాళ్లలో కట్టెలు పెడితే.. మట్టి మనుషుల చెమటలో కొట్టుకుపోతారని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి హెచ్చరించారు. తనపై రాజకీయంగా కోపం ఉంటే.. మరో రకంగా తీర్చుకోవాలేగానీ.. అభివృద్ధికి అడ్డుపడొద్దని కోరారు. కేసీఆర్ హయాంలో వారి ప్రాంతాలను అభివృద్ధి చేసుకున్నప్పుడు తాము ఏడవలేదని, బాధ అనిపించినా.. ఓర్చుకున్నామన్నారు. ఇప్పుడు తమకు అవకాశం వచ్చిందని, నిధులు మంజూరు చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అయితే, పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేస్తుంటే కొంతమంది దుర్మార్గులు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు. పాలమూరు ఆత్మగౌరవాన్ని అణచాలని చూస్తే యువత తిరగబడుతుందని స్పష్టం చేశారు. అంతకు ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసేందుకు సీఎం ఆధ్వర్యంలో అందరం కలిసికట్టుగా పని చేస్తున్నామని తెలిపారు. కురుమూర్తి స్వామి ఆలయం వద్ద ఎలివేటెడ్ ఘాట్‌రోడ్డుకు రూ.110 కోట్లను కేవలం నెల రోజుల్లోపే మంజూరు చేశామని, వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి రోడ్డును పూర్తి చేస్తామని అన్నారు. సీఎం వెంట మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి ఉన్నారు.

భక్తజనసంద్రం.. యాదగిరిక్షేత్రం

- 40వేల మంది భక్తుల రాక...రద్దీగా క్యూలైన్లు
- స్వామి సన్నిధిలో వెంకయ్యనాయుడు సతీమణి


వెంకయ్యనాయుడు సతీమణి ఉషకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ క్షేత్రం ఆదివారం భక్తజనసంద్రమైంది. వారాంతపు సెలవు రోజు, కార్తీకమాసం కావడంతో ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల సుమారు 40వేల మంది భక్తులు తరలివచ్చారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉష ఆదివారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కాగా, కార్తీక మాసం కావడంతో వైకుంఠ ద్వారం వద్ద అధిక సంఖ్యలో మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వ్రత మండపంలో 857 జంటలు సత్యదేవుని వ్రతాలు చేశారు. తీవ్ర రద్దీ నేపథ్యంలో... వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ధర్మదర్శనాలకు 2 గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.58.89 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

కేసుల విచారణలో అనవసర వాయిదాలు వద్దు

- న్యాయవాదులకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే సూచన



కరీంనగర్ లీగల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో కేసుల సంఖ్య పెరుగుతోందని, వాటిని త్వరగా పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకారం అందించాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాదే కోరారు. కేసుల విచారణలో అనవసర వాయిదాలను అడగకూడదని సూచించారు. కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో ఆదివారం నూతనంగా నిర్మించనున్న భవనాల సముదాయానికి ఆయన శంకుస్థాపన చేశారు. సీతారాంపూర్ రోడ్డులో 20 జడ్జీల నివాస భవనాలకు ఇతర న్యాయమూర్తులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో నూతనంగా వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. కుటుంబ, సివిల్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. హైకోర్టు జడ్జిలు జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ బి. వినోద్ కుమార్, జస్టిస్ వి జయసేన్ రెడ్డి, జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్, జస్టిస్ ఇ.వి. వేణుగోపాల్, జస్టిస్ పుల్లకార్తీక్, జస్టిస్ శ్రీనివాసరావు, జిల్లా జడ్జి బి. ప్రతిమ పాల్గొన్నారు.

పలు జిల్లాల్లో పెరగనున్న చలి తీవ్రత

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాగల మూడు రోజులపాటు రాత్రిపూట ఉష్ణోగ్రతలు 13-17డిగ్రీల మధ్య నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో చలి తీవ్రత పెరుగుతుందని హెచ్చరించింది. ముఖ్యంగా ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్, వికారాబాద్ జిల్లాల్లో రాత్రివేళ 13-15 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. మిగతా జిల్లాల్లోనూ 17 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలుంటాయని పేర్కొంది. ఇక గరిష్ఠ ఉష్ణోగ్రతలు 29-34 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

'తెలంగాణ స్పైస్ కిచెన్'లో సిలిండర్ పేలుడు

ఓ మహిళ, ఇద్దరు చిన్నారులకు గాయాలు, గుడిసెలు ధ్వంసం

బంజారాహిల్స్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 1 లోని తెలంగాణ స్పైస్ కిచెన్ రెస్టారెంట్‌లో ఆదివారం ఉదయం నాలుగున్నర గంటల సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ పేలుడు ధాటికి రెస్టారెంట్ వెనుక ఉన్న ఓ రేకుల షెడ్డు, ప్రహరీ గోడ కూలాయి. అయితే, ఇటుకలు, బండరాళ్లు 200 మీటర్ల ఎత్తు ఎగిరి.. రెస్టారెంట్‌ను ఆనుకొని దిగువన ఉన్న దుర్గాభవానీనగర్ బస్తీలోని గుడిసెలపై పడ్డాయి. దీంతో నాలుగు గుడిసెలు పూర్తిగా, మూడు పాక్షికంగా దెబ్బతినగా ఓ మహిళ, మరో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. పేలుడు శబ్దానికి బస్తీ వాసులు ఉలిక్కిపడి నిద్రలేచి రోడ్డుపై పరుగులు తీశారు. రెస్టారెంట్‌లో వంట కోసం ఉంచి ఓ గ్యాస్ సిలిండర్ నుంచి లీకైన గ్యాస్ బయటికి వెళ్లే దారి లేక ఒత్తిడి పెరిగి పేలుడు సంభవించిందని పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. తెల్లవారుజామున పేలుడు సంభవించడంతో నష్టం తగ్గిందని అంటున్నారు. ప్రమాదం గురించి తెలుసుకున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బాధితులను స్వయంగా పరామర్శించారు.

వరికోత మిషన్ తగిలి మహిళా రైతు మృతి

పాల్వంచ, నవంబరు 10: తాను రేయింబవళ్లు కష్టపడి సాగు చేసిన పొలంలో డ్రైవర్ అజాగ్రత్త కారణంగా వరికోత మిషన్ తగిలి ఓ మహిళా రైతు ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన ఆదివారం భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలంలో జరిగింది. సోములగూడెం గ్రామానికి చెందిన పెద్దినేటి అనసూర్య(53) భర్త అస్వస్థత కారణంగా తానే వ్యవసాయం చేస్తోంది. తమకున్న అర ఎకరం పొలంలో వరి సాగు చేయగా కోతకు రావడంతో కూలీలు అందుబాటులో లేక మిషన్‌తో వరి కోయించాలని మిషన్ తెప్పించింది. ఈ క్రమంలో వరి కోస్తుండగా డ్రైవర్ సారయ్య అజాగ్రత్త కారణంగా మిషన్ ఢీ కొట్టింది. అనసూర్య కాలుకు తీవ్ర గాయమై తీవ్ర రక్తస్రావమైంది. చుట్టుపక్కలవారు ఆమెను కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి చిన్న కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు మిషన్ డ్రైవర్ సారయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాల్వంచ రూరల్ ఎస్ఐ సురేశ్ తెలిపారు.

సనాతన ధర్మ ప్రబోధకుడు కందాడై కన్నుమూత

- టీటీడీ సంస్కృత కళాశాల అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా సేవలు
- అష్టాదశ పురాణాలపై ప్రబోధాలు
- వేద సాహిత్య రచనలో ప్రావీణ్యుడు
- నాగోల్‌లో ముగిసిన అంత్యక్రియలు


రామానుజాచార్య(ఫైల్)

హైదరాబాద్ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంస్కృతంలో పోగుపడిన భారతీయ సనాతన ధర్మ శాస్త్ర విజ్ఞానాన్ని పిడికిట పట్టి.. తెలుగు వారి లోగిళ్ల ముందు రాశిగా పోసిన వ్యాకరణ పండితుడు డాక్టర్ కందాడై రామానుజాచార్య(81) ఇకలేరు. ధర్మ అధ్యయనం, ధర్మ ప్రబోధమే ఊపిరిగా తుది వరకు జీవించిన ఆయన.. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందు తూ.. ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సుమతి, కుమారుడు వనమాలి, కుమార్తె హరిప్రియ ఉన్నారు. మరో కుమారుడు మురళి ఏడాది క్రితం గుండెపోటుతో కన్నుమూశారు. రామానుజాచార్య స్వస్థలం ఉమ్మడి నల్లగొండ జిల్లా చీదేళ్ల. తన పదో ఏట హైదరాబాద్, సీతారాంబాగ్‌లోని వేదాంతవర్ధిని సంస్కృత పాఠశాలలో వేదాభ్యాసాన్ని ప్రారంభించారు. కోయిల్ కందాడై శఠకోప రామానుజాచార్య శిష్యరికంలో వ్యాకరణ విద్యను అభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ(సంస్కృతం) పూర్తిచేశారు. అలంకార మణిహారం అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను.. పీహెచ్‌డీలో బంగారు పతకాన్ని అందుకున్నారు. టీటీడీ అనుబంధంగా ఉన్న.. శ్రీ వెంకటేశ్వర వేదాంతవర్ధిని సంస్కృత కళాశాలలో అధ్యాపకుడిగా, ప్రధానాచార్యుడిగా, ప్రత్యేక అధికారిగా 2004 వరకు సేవలందించారు. టీటీడీ ధర్మప్రచార మండలి సభ్యుడిగా కొంతకాలం కొనసాగారు. అష్టాదశ పురాణాలపై మూలగ్రంథం ఆధారంగా ప్రవచనాలు ఇవ్వగలిగిన కొద్దిమంది ధర్మప్రచారకర్తలలో కందాడై ఒకరు.

వేద సాహిత్య సేవ

రామాయణ, మహాభారత, భాగవతాలు, పురాణ, ఇతిహాసాలపై కందాడై కొన్ని వందల ప్రవచనాలిచ్చారు. పలు టెలివిజన్, వార్తా పత్రికల్లో 'ధర్మ సందేహాలు' పేరుతో వేల మంది అనుమానాలకు సశాస్త్రీయ వివరణతో సమాధానాలిచ్చారు. ఎన్నో సనాతన ధర్మశాస్త్ర గ్రంథాలను సంస్కృతం నుంచి తెలుగులోకి తనదైన వ్యాఖ్యానంతో అనువదించారు. వాటిల్లో భాగవతం, పద్మపురాణం, నారద పురాణం, కూర్మ పురాణం, స్కాంద పురాణం, హరివంశ మహాపురాణం, పరాశర స్మృతి, తెలుగు మాసాల వైశిష్ట్యాన్ని తెలిపే రచనలు ప్రచురితమయ్యాయి. ఏకాదశి వైభవంలోని పన్నెండు వేల శ్లోకాలను తెలుగులోకి అనువదించారు. కందాడై రామానుజాచార్య భౌతిక కాయాన్ని.. మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచార్య, ఆధ్యాత్మిక వేత్తలు అహోబిల రామానుజ జీయరు, రామచంద్ర జీయరు, దేవనాథ జీయరు, శ్రీవైష్ణవ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కండ్లకుంట యాదగిరాచార్యులు తదితరులు సందర్శించి, నివాళులు అర్పించారు. చిన్న జీయరు స్వామి శేష వస్త్రం పంపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ధర్మ ప్రచారకుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచార్యులు సంతాపం ప్రకటించారు. రామానుజాచార్య అంత్యక్రియలు ఆదివారం నాగోల్‌లోని శ్మశానవాటికలో ముగిశాయి.

అమరావతి అభివృద్ధికి ముందడుగు!

- మౌలిక సదుపాయాల కల్పన సాకారం
- రూ.15,000 కోట్ల రుణ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం తాజా ఆమోదం
- నిధులపై ఢిల్లీలో నేడు త్రైపాక్షిక చర్చ

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి అభివృద్ధికి ముందడుగు పడింది. రాజధాని నిర్మాణంలో కీలకమైన అమరావతి నగర సుస్థిరాభివృద్ధి, నిర్మాణాల కోసం ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) నుంచి తీసుకుంటున్న రూ.15,000 కోట్ల రుణ వినియోగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనిలో భాగంగా రుణ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు నిధుల ప్రతిపాదనపై సోమవారం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ సమక్షంలో రాష్ట్రానికి, బ్యాంకుల ప్రతినిధులకు మధ్య త్రైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఈ చర్చలకు రాష్ట్రం నుంచి సీఆర్‌డీఏ కమిషనర్ కె. భాస్కర్, ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి, ఆర్థిక శాఖ నుంచి డి. సురేంద్ర హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ఈ రూ.15,000 కోట్ల రుణానికి సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలు ఖరారుకానున్నాయి. ఈ నిధులలో 800 బిలియన్ డాలర్లను ప్రపంచ బ్యాంకు, 800 బిలియన్ డాలర్లను ఏడీబీ సమకూర్చనున్నాయి. చర్చల అనంతరం విడతల వారీగా నిధులు రాష్ట్రానికి అందనున్నాయి. ఈ నిధుల నిర్వహణ కోసం ప్రత్యేక బడ్జెట్ హెడ్ ఏర్పాటు చేస్తారు. ఏపీసీఆర్‌డీఏ సమర్పించే బిల్లులకు ఈ హెడ్ ద్వారాను సీఎఫ్ఎంఎస్ నుంచి నిధులు చెల్లిస్తారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీల నుంచి నిధులు సమకూర్చుకునేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు ప్రభుత్వం అధికారం కల్పించింది.

ఏయే పనులు చేపడతారంటే..

ప్రపంచ బ్యాంకు, ఏడీబీల నుంచి అందే నిధుల సాయంతో అమరావతిలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన వసతులు, హరిత నిర్మాణాలు, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండే ప్రాజెక్టులను చేపడతారు. అదేవిధంగా ట్రంకు రోడ్ల నిర్మాణం, వరద నీటి నిర్వహణ పనులు చేపట్టనున్నారు.

కులగణనలో వ్యక్తిగత గోప్యత అవసరం: కూనంనేని

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కులగణనలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్న సమాచారంతో వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే అవకాశం ఉందని దీనిపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సర్వేలో సెల్ నెంబర్లు, బ్యాంకు ఖాతా, ఆధార్ నెంబర్ల వివరాలను సేకరిస్తున్నారని, ఈ విషయంలో వ్యక్తిగత గోప్యత అత్యంత అవసరమని సూచించారు. ఇటీవల సైబర్ నేరాలు హెచ్చుమీరి కోట్ల రూపాయలు గల్లంతవుతున్నాయని, ఈ నేపథ్యంలో ప్రజల ఆధార్, బ్యాంకు ఖాతాలు, సెల్ నెంబర్ల వివరాలు సైబర్ నేరగాళ్లకు చిక్కితే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అందుకు అవకాశం లేకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

కాటేసిన కరెంట్ తీగలు!

- భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం
- రెండున్నర నెలల కిందే వివాహం
- నల్లగొండ జిల్లా కనగల్‌లో విషాదం


మనీషా (ఫైల్)

కనగల్, నవంబరు 10: పొలం నుంచి గడ్డి కట్టలు తెచ్చేందుకు ట్రాక్టర్‌పై బయలుదేరిన నవదంపతులు ఊహించని ప్రమాదానికి గురయ్యారు. ట్రాక్టర్ ట్రాలీకి అమర్చిన ఇనుప పైపులకు మార్గమధ్యలో కరెంటు తీగలు తగలడంతో.. విద్యుదాఘాతం బారిన పడ్డారు. ఈ ఘటనలో భార్య మృతి చెందగా, భర్త కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఆదివారం నల్లగొండ జిల్లా కనగల్ మండలం కుమ్మరిగూడెంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కుమ్మరిగూడేనికి చెందిన మాచర్ల అంజిబాబుకు గుర్రంపోడు మండలం నడికుడకు చెందిన మనీషా(18)తో రెండున్నర నెలల కింద వివాహం జరిగింది. ఆదివారం అంజిబాబు మనీషాతో కలసి పొలంలోని వరి గడ్డికట్టలను తెచ్చేందుకు ట్రాక్టర్‌లో ఇంటి నుంచి బయల్దేరాడు. మార్గంమధ్యలో 11 కేవీ విద్యుత్తు తీగలు కిందికి జారి ఉండగా.. గమనించని అంజిబాబు వాటి కిందుగా వెళ్లడంతో ట్రాక్టర్ ట్రాలీకి అమర్చిన ఓ ఇనుప పైపు తీగలకు తగిలింది. దీంతో విద్యుత్తు సరఫరా కావడంతో ట్రాక్టర్ నడుపుతున్న అంజిబాబు, అతడి పక్కనే కూర్చొన్న మనీషా తీవ్రంగా గాయపడ్డారు. ట్రాక్టర్ ముందు టైర్లు కాలిపోయాయి. పరిసర ప్రాంతాల రైతులు 108 అంబులెన్సులో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిని పరిశీలించిన వైద్యులు మనీషా మృతి చెందిందని.. అంజిబాబు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

ఇద్దరు పిల్లలతో సహా చెరువులో దూకి తండ్రి ఆత్మహత్య

తమ్ముడి బెదిరింపులతో మనస్తాపం చెంది అఘాయిత్యం


సత్యం, అన్వేష్, హాసిని(ఫైల్)


సిద్దిపేట క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తానిచ్చిన డబ్బును తిరిగివ్వమంటే చెప్పుతో కొట్టడమే కాక, అదే డబ్బు సుపారీగా ఇచ్చి చంపించేస్తానని తమ్ముడు బెదిరించడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ అన్న అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అభంశుభం తెలియని తన ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేటలో ఆదివారం వెలుగు చూసిన ఈ ఘటనలో తేలు సత్యం(48), అతని కొడుకు అన్వేష్ నందన్(7), కూతురు త్రివన్న హాసిని (5) బలవన్మరణం పొందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేటకు చెందిన సత్యం, స్వరూప దంపతులకు ఓ కొడుకు, కూతురు ఉన్నారు. అనారోగ్యం వల్ల స్వరూప 2014లో మరణించగా సత్యం.. శిరీషను రెండో వివాహం చేసుకున్నాడు. సత్యం, శిరీష దంపతులకు అన్వేష్, హాసిని సంతానం. సత్యం తన ఇంటిని మొదటి భార్య పిల్లలకు రాసివ్వగా వారు ఆ ఇంట్లో ఉంటున్నారు. సత్యం, శిరీష దంపతులు మరొకరి ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. అలాగే సత్యం చదివించడంతో అతని సోదరుడు తేలు శ్రీనివాస్ ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఇటీవల సత్యం ఆరోగ్యం క్షీణించడంతో 20 రోజుల క్రితం శ్రీనివాస్ దగ్గరకు వెళ్లి.. తానిచ్చిన రూ.5.50లక్షలను తిరిగివ్వాలని, తనకు ఆస్తి రాసివ్వాలని అడిగాడు. ఈ క్రమంలో అన్నదమ్ముల మధ్య మాటామాట పెరగ్గా శ్రీనివాస్ తన అన్నని చెప్పుతో కొట్టాడు. రెండ్రోజుల క్రితం సత్యం అతన్ని మళ్లీ కలవగా.. "నీకు డబ్బు ఇవ్వడం కాదు కదా.. అదే డబ్బు ఎవరికైనా ఇచ్చి నిన్నే చంపిస్తానని" బెదిరించాడు. సోదరుడి తీరుతో తీవ్ర మనోవేదనకు గురైన సత్యం తన ఇద్దరు పిల్లలను తీసుకుని శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం స్థానిక చింతల్ చెరువు కట్టపై సత్యం ద్విచక్రవాహనం కనిపించడంతో విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. చెరువులో గాలించిన గజ ఈతగాళ్లు.. సత్యంతోపాటు ఇద్దరు చిన్నారుల మృతదేహాలను వెలికితీశారు. సత్యం ద్విచక్రవాహనంలో సూసైడ్ నోట్‌తోపాటు ఆత్మహత్యకు ముందు రికార్డు చేసిన సెల్ఫీ వీడియో ఉన్న అతని మొబైల్‌ను పోలీసులు గుర్తించారు. తన ఆత్మహత్యకు శ్రీనివాస్ కారణమని సత్యం ఆ వీడియోలో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాయకుండా సలపరిస్తున్నదే ఎక్కువ!

ఎండిన మానేరు లోంచి ఓ కథల 'ఊటబాయి' పుట్టింది. నెర్రెలు బారిన మానేరు నేల లోంచి ఓ 'సంచారి' తీతువు పిట్టయి 'ఊరికి ఉప్పులం' పుట్టిందని సైరన్ మోగించాడు. దశాబ్దాల ఆధిపత్యపు 'దాడి'ని నిరసిస్తూ ఒక 'లాంగ్ మార్చ్' మొదలైంది. ఉపాధ్యాయ ఉద్యమాలతో సాహిత్యంతో 'జిగిరి' దోస్తీయి నడిచిన ఒక వర్తమాన సాహిత్య వాగ్దానం పెద్దింటి అశోక్ కుమార్. ప్రపంచీకరణ మార్పులను కథావస్తువులుగా తీసుకుని, రైతుకూలీల జీవితాలకంటే మరింత దిగువకు చూపును తెచ్చి అట్టడుగు జీవితాలను సాహిత్యీకరించిన అక్షరం ఆయనది. పల్లె జీవనాడిని పట్టుకుని, ప్రజల బాషను, పొక్కగాని పాముల్లా తొక్కులాడుతున్న పాత్రలను ఒక బాధ్యతగా నవలలుగా చెక్కుతున్న శిల్పకారుడాయన.

ఇంటర్వ్యూ ■ మీసాల ఉదయ్ కుమార్
94928 44817

– పెద్దింటి అశోక్ కుమార్



నవలా శిల్పం

ఒక రచన ముందు కథలా మొదలై తర్వాత నవలగా మారిన సందర్భాలేమైనా ఉన్నాయా?

'ఎడారి మంటలు' నవలను ముందుగా కథగా రాయాలనుకున్నాను. మా ఊరి నుంచి వలస వెళ్లి గల్ఫ్ ఎడారిలో గొర్రెల కాపరిగా చిక్కుకున్న యువకుడి కథ అది. కథ మొదలుపెట్టాక విస్తారమైన ఆ జీవితాన్ని కథలో చెప్పలేననిపించి నవలగా రాశాను. కథ అంటే జీవితంలో ఒక చిన్న సంఘటన. కానీ నవల అంటే విస్తారమైన జీవితం.

పదకొండు భాషల్లోకి అనువాదమైన 'జిగిరి' నవలకి ప్రేరణ ఏమిటి? ప్రపంచీకరణతో మారుతున్న జీవితాలను చూపెట్టడానికి గుడ్డేలుగు (ఎలుగుబంటి)ని ఆడించే పాత్రను ఎందుకు ఎన్నుకోవాలనిపించింది?

తరానికి తరానికి మధ్య ఆలోచనలు, మానవత్వపు లక్షణాలు ఎలా మారుతున్నాయి అన్న ఆలోచనే 'జిగిరి' నవలకు ప్రేరణ. క్రూరమృగాలు మనుషులతో స్నేహం చేసి మానవత్వాన్ని నేర్చుకుంటాయి. కానీ మానవత్వంతో బతకాల్సిన మనిషి అవకాశాలకు అనుగుణంగా మృగంలా మారిపోతాడు. మనిషిలా మారిన మృగానికీ మృగంలా మారిన మనిషికీ మధ్య ఘర్షణను చెప్పాలనుకుని గుడ్డేలుగులను ఆడించే వాళ్ల జీవితాన్ని ఎన్నుకున్నాను.

నవలకు ప్లాట్ ముందే అనుకుంటారా? మొదలుపెట్టాక నవలను అంతిమ రూపానికి తెచ్చే పని ఎలా ఉంటుంది?

నవలకైనా కథకైనా ప్లాట్‌ను ముందే అనుకుంటాను. మనసును మెలిపెట్టే అంశాలనే వస్తువుగా ఎన్నుకుంటాను. గుండెలో మసిలి మసిలిన తర్వాతనే కొంత పరిశోధన చేసి నోట్స్ రాసుకుని నవల రాస్తాను. నవలని రెండు మూడు డ్రాఫ్టుల్లో పూర్తి చేస్తాను. ఈ క్రమంలో పరిశోధనలో కొత్త అంశాలు తెలిసినా, లేక పాత్రల స్వభావం మారినా దాని ముగింపు మారుతుంది. అప్పుడు మరొక డ్రాఫ్ట్ రాయాల్సి వస్తుంది. ముఖ్యంగా నవల రాయడం మొదలుపెట్టాక కొన్ని పాత్రలు నా చేతుల్లో ఉండవు.

> నవలకైనా కథకైనా ప్లాట్ ముందే అనుకుంటాను. మనసును మెలిపెట్టే అంశాలనే వస్తువుగా ఎన్నుకుంటాను. గుండెలో మసిలి మసిలిన తర్వాతనే కొంత పరిశోధన చేసి నోట్స్ రాసుకుని నవల రాస్తాను.

గంగిరెద్దుల వారి జీవితాల మీద రాసిన 'సంచారి' నవలకు ఎలాంటి పరిశోధన అవసరమైంది? పరిశోధనా క్రమంలో మీకు గుర్తుండిపోయిన జ్ఞాపకం ఏదైనా...?

కులవివక్ష ఇప్పటికీ సమాజంలో బలంగా ఉంది. గంగిరెద్దుల కులానికి చెందిన ఒక వ్యక్తి సంచార జీవితాన్ని కాకుండా భద్రమైన జీవితాన్ని కోరుకుని ఒక ఊరిలో ఓ ఇల్లు కట్టుకోవాలి అనుకుంటే అతను ఎదుర్కొన్న సమస్యలు ఏమిటన్నది ఈ నవల సారాంశం. మా సిరిసిల్ల దగ్గర గంగెద్దుల కొండాపురం అనే ఒక ఊరు ఉంటుంది. అక్కడ ఎక్కువగా వాళ్ళే ఉంటారు. వారం పది రోజులు వాళ్ళ వెంట తిరిగి, వాళ్ళ ఆచార వ్యవహారాలను, ఆహారపు అలవాట్లను పరిశీలించి రాసిన నవల ఇది. నేను అక్కడకు వెళ్ళిన ఒక రోజున– ఒక ఇంట్లో గంగిరెద్దు చనిపోతే మనిషి పోయినంతగా తల్లడిల్లిపోతూ దానికి అంత్యక్రియలు చేశారు. ఇది గుర్తుండిపోయిన జ్ఞాపకం.

తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో రాసిన 'లాంగ్ మార్చ్' నవలను ఒక విద్యార్థి దృక్కోణం నుంచో, ఉద్యోగి దృక్కోణం నుంచో గాక, ఒక రైతు దృక్కోణం లోంచే చెప్పాలని ఎందుకు అనిపించింది?

'లాంగ్ మార్చ్' నవల 2011 మార్చ్‌లో టాంక్‌బండ్ మీద జరిగిన 'మిలియన్ మార్చ్' నేపథ్యంగా తెలంగాణ ఉద్యమ రూపాన్ని చెప్తుంది. నవలలో అన్నీ వాస్తవంగా జరిగిన సంఘటనలే. కొంత నాటకీయత జోడించాను. దీన్ని ముందుగా ఒక విద్యార్థి కోణం లోంచి చెప్పాలనుకున్నాను. కానీ అప్పటికే ఉద్యమంలో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు వివిధ వృత్తుల వారు జేఏసీలుగా ఏర్పడి ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. గ్రామాల్లో రైతులు కూడా తెలంగాణ రావాలని ఎంతో ఆరాట పడుతున్నారు. ఆ విషయమే చెప్పాలనుకుని ఒక రైతు కోణం లోంచి రాసాను.

గల్ఫ్ ఎడారిలో ఒంటరిగా చిక్కుకున్న గొర్లకాపరి జీవితాన్ని 'ఎడారి మంటలు' నవలగా 2000లోనే రాశారు. ఈ నవలకై ఆ కాలంలో ఎలాంటి పరిశోధన చేయాల్సి వచ్చింది?

'ఎడారి మంటలు' నవల రాయకముందే ఎడారి వలస జీవితాల మీద 12 కథలు రాశాను. అవి 'వలస బతుకులు' పేరుతో సంకలనంగా వచ్చాయి. 'ఆజాద్ వీసా మీద వెళ్లి ఎడారిలో చిక్కుకొని గొర్ల కాపరిగా మారిన మా ఊరి వ్యక్తి జీవితాన్ని సజీవంగా చిత్రించాను. అప్పటికి మా ఊర్లో ఇంటింటికీ ఒక వ్యక్తి గల్ఫ్ దేశాల్లో ఉన్నాడు. రోజూ ఎవరో ఒకరు వచ్చేవారు పోయేవారు. వాళ్ళ దగ్గర కూర్చొని మాట్లాడి విషయాలు, ఫోటోలు సేకరించాను. అప్పటికి ఈ వీడియోలు, సెల్ ఫోన్లు లేవు కాబట్టి ఫోటోలూ, క్యాసెట్ల ఆధారంగా ఈ నవలను రాసాను.

గ్రామీణ పర్యావరణం మీద నవల రాయాలన్న ఆలోచన మీకెందుకు వచ్చింది. 'దాడి' నవలలో మూడు తరాల జీవన చిత్రాన్ని అభివృద్ధి కోణం లోంచి చూడాలా, విధ్వంసం కోణం లోంచి చూడాలా?

విధ్వంసమే! మనిషి కూటికోసం నీటికోసం గూటికోసం అడవి మీద చేసిన దాడి ఈ నవల. సబ్ మెర్సిబుల్ పంపులతో వేల ఫీట్ల లోతుల్లోంచి నీటిని తోడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుని దానిని అభివృద్ధి అనుకున్నాం. కానీ దోసెడు మట్టి తీస్తే దోసెడు నీళ్ళూరే నేలలు వట్టిపోతాయని, తాగునీటి కొరత వస్తుందని గ్రహించలేకపోయాం. పెద్ద పెద్ద గుట్టలను ఎక్కే జేసీబీలను, చెట్లు నరికే పరికరాలను కనుగొని అడవులన్నింటినీ నరికి వ్యవసాయ భూములను చేసి అదే అభివృద్ధి అనుకున్నాం. కానీ పిట్ట వాలే చెట్టు లేకుండా చేసి పర్యావరణ విధ్వంసం చేస్తున్నామనుకోలేదు. ఒకప్పుడు ఊరు చిన్నది అడవి పెద్దది. కానీ నేడు అడవి కనుమరుగైపోయి ఊర్లో పశువులు లేకుండాపోయి మొత్తం వ్యవసాయ క్షేత్రంగా మారిపోయింది. ఇదీ ఒక విధ్వంసమే. ఇదంతా అభివృద్ధి చాటున జరుగుతున్న విధ్వంసం. ఇంకో యాభై ఏండ్ల తర్వాత నీడ లేక, నీరు లేక పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్నే 'దాడి' నవల. రేపు ప్రపంచ యుద్ధాలంటూ జరిగితే అవి నీళ్ళ కోసమే అన్న చేదు నిజాన్ని చెప్పిన గ్రామీణ పర్యావరణ నవల.

ఉప్పులం అంటే ముప్పు కదా. ప్రజాకర్షక పథకాలు ఎందుకు అభివృద్ధిలో భాగం కాలేకపోతున్నాయి. 'ఊరికి ఉప్పులం' నవల ముగింపు మరో నవలకు ప్రారంభమా?

అవును. ప్రజాకర్షక పథకాలు మోచేతికి బెల్లంలాంటివి. అప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనం కలిగించినా అవి ఉత్పత్తి కారకాలు కావు. వాటితో లాభం కంటే నష్టమే ఎక్కువ. వాటి వల్ల గ్రామంలో వచ్చిన మార్పులను, అధికార పార్టీలు రాజకీయ నిరుద్యోగుల కోసం పుట్టించిన గ్రామ స్థాయి పదవులు ప్రజల్లో ఎలాంటి విరోధాలను పుట్టించాయి అన్న అంశాన్ని, 2000 సంవత్సరం తరువాత మారిన పల్లె జీవితాలను ఈ నవలలో రాసాను. దీని ముగింపు వద్దే మరో నవల పుడుతుంది. ఆ మెటీరియల్ కూడా ఉంది. ఇలా రాసిన సాహిత్యం కంటే ఇంకా రాయకుండా గుండెలో మసలుతూ, సలపరిస్తున్న సాహిత్యమే ఎక్కువ.

సోమ సుందర్ శత జయంతి సభ

ఆవంత్స సోమసుందర్ శత జయంతి మహా సభ నవంబర్ 17 ఉ.10గంటల నుంచి చల్లా జగన్నాథ శాస్త్రి కళామందిర్, విద్యుత్ నగర్, కాకినాడలో జరుగుతుంది. 'ఆవంత్స సోమసుందర్' గ్రంథావిష్కరణతో ప్రారంభమయ్యే సభలో చందు సుబ్బారావు, మండలి బుద్ధప్రసాద్, రెంటాల శ్రీవేంకటేశ్వర రావు, పన్నాల సుబ్రహ్మణ్య భట్టు, పెనుగొండ లక్ష్మీనారాయణ, వల్లూరు శివప్రసాద్, చిరంజీవినీ కుమారి, ఆలూరి విజయలక్ష్మి, హెచ్ఎస్‌వీకే రంగారావు తదితరులు పాల్గొంటారు.

సోమసుందర్ లిటరీ ట్రస్టు

కథా రచయితల సమాలోచన

తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం, కాకినాడ ఆధ్వర్యంలో 'కథ – ఏమిటి, ఎందుకు, ఎలా' శీర్షికన నవంబర్ 24న జరిగే కథా సదస్సులో పి. చిరంజీవినీ కుమారి, నండూరి రాజగోపాల్, మహ్మద్ ఖదీర్ బాబు, ఆలూరి విజయలక్ష్మి, వాడ్రేవు వీరలక్ష్మి దేవి, దాట్ల దేవదానం రాజు, జి. వెంకట కృష్ణ, చోరగుడి జాన్సన్, అద్దేపల్లి ప్రభు, శిఖామణి, ఎల్.కె. సుధాకర్, కుప్పిలి పద్మ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగిస్తారు. పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ కోసం ఫోన్: 94915 04045.

తూ.గో.జిల్లా రచయితల సంఘం

సామాజిక అంశాలతో కథల పోటీ

అక్షరాల తోవ సంస్థ ఏడవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కథల పోటీలో మూడు ఉత్తమ కథలకు రూ.2వేలు, మూడు మంచి కథలకు రూ.500 నగదు బహుమతులు ఉంటాయి. కథ ఎ4 సైజులో డీటీపీలో ఐదు పేజీలకు మించరాదు. కథలను డిసెంబర్ 10 లోపు పోస్ట్ / కొరియర్ ద్వారా చిరునామా: రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతి లాడ్జి ఎదురుగా, స్టేషన్ రోడ్, ఖమ్మం – 507001కు పంపాలి. వివరాలకు: 98492 77968.

అక్షరాల తోవ

బొమ్మలు: అక్బర్

'జ్ఞానజ్యోతి' పురస్కార ప్రదానం

తెలుగు సాహిత్య రంగంలో కృషి చేస్తున్న పరిశోధక రచయితకు ఆంధ్ర ప్రదేశ్ రచయితల సంఘం ఏటా ఇచ్చే 'జ్ఞానజ్యోతి' పురస్కారాన్ని 2024కి గాను వెలమల సిమ్మన్న స్వీకరిస్తారు. రూ.3వేల నగదు, జ్ఞాపిక, సన్మాన పత్రం, శాలువాలతో నవంబర్ 17 సాయంత్రం విజయవాడ లోని మహాత్మ గాంధీ రోడ్డు లోగల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో రచయితకు సత్కారం ఉంటుంది. చిల్లర భవానీదేవి, పాపినేని శివశంకర్, కె. రమాదేవి తదితరులు పాల్గొంటారు.

చలపాక ప్రకాష్

'అంతరంగ వీక్షణం' ఆవిష్కరణ

గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నవంబరు 17ఉ.10 గంటలకు విజయవాడ బందరురోడ్డులో గల ఠాగూర్ గ్రంథాలయంలో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో కొమ్మవరపు విల్సన్ రావు ముఖాముఖీల సంకలనం 'అంతరంగ వీక్షణం' ఆవిష్కరణ జరుగుతుంది. వర్ల రామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ సభకు జి. లక్ష్మీనరసయ్య అధ్యక్షత వహిస్తారు. విశిష్ట అతిథులు– సుంకర గోపాల్, అన్నవరపు బ్రహ్మయ్య, సత్యాజీ.

కలిమిశ్రీ

ప్రజాజీవితం, కళావిలువల మేళవింపు నా 'భూమిస్వప్నం'

నా మొదటి పుస్తకం

■ నందిని సిధారెడ్డి

ప్రతి కవి ప్రయాణంలో మొదటి పుస్తకం కలల తీపి గుర్తు. రచయితగా నిలబడటానికి దోహదపడే ముఖ్య భూమిక. నా మొదటి కవితా సంపుటి 'భూమి స్వప్నం'. 1987 మార్చిలో వెలుగు చూసింది. 1976–86 మధ్య కాలంలో రచించిన కవితల లోంచి ఎంపిక చేసిన కవితల సంపుటి. ఆ పదేళ్ల కాలం నా నవయౌవన కాలం. ఎప్పుడూ ఉత్సాహం. ఏదో తపన. కవిత్వ మోహం. విరివిగా పోటీపడి రాసేవాళ్లం. పత్రికలు అనేకం. ప్రచురణావకాశాలు అనేకం. కవిగా, రచయితగా గుర్తింపు పొందిన తర్వాతనే పుస్తకం వేసుకోవాలన్న భావన బలంగా ఉండేది. నిరుద్యోగం, ఆర్థిక లేమి ఒక కారణం. ప్రాచుర్యం పొందిన తర్వాత పుస్తకం వస్తేనే సాహిత్య లోకం పట్టించుకుంటుందన్న మా ముందుతరం కవుల అనుభవం మరో కారణం. అట్లా కల, కలగా ఉంటూ, వాయిదా పడుతూ కవితలు సంపుటిగా వస్తేనే తూచటానికి, అంచనా వెయ్యటానికి వీలవుతుందన్న సలహాలు ఎదురయ్యేదాకా తొందరపడలేదు.

చుట్టూ విస్తరిస్తున్న విప్లవ వాతావరణం నా కవిత్వానికి ప్రేరణ. శిల్పం పట్ల శ్రద్ధ వహించాలని అప్పట్లో తరచూ జరిగిన చర్చల సారం నా సృజనకు పూరణ. "మా మౌనం మూగతనం కాదు, గోడకు వేలాడే తుపాకీ కూడా మౌనంగా ఉంటుంది" అంటూ విప్లవోద్యమంలో నా కవితా పాదాల్ని గోడల మీద నినాదాలుగా రాసిన క్రమం గొప్ప ఉద్వేగం.

1986 సంవత్సరం పుస్తకం తేవాలని ప్రయత్నం మొదలు పెట్టాను. అప్పటికి ప్రచురించబడిన కవితలే రెండు వందల పైనున్నాయి. అన్నిటి మీదా సహజ ప్రేమ ఉన్నా నిర్దాక్షిణ్యంగా వడబోస్తే వంద తేలాయి. మరోసారి వస్త్రగాలం పడితే మరో సగం యాభై. అన్నింట్లో మార్గదర్శి శివారెడ్డే. 33 ఎంపిక చేశాం. మొదటి సంపుటి కదా, పేరు బాగుండాలి. అది పెద్ద సమస్య. అప్పటిదాకా నేననుకున్నది 'రుతుపవనం'. శివారెడ్డి తల ఊపలేదు. నెల దాటింది. దీర్ఘకవిత శీర్షిక 'ఆకురాలు అరణ్యం' చెప్పాను. ఆమోదం లేదు. మరో నెల. కొత్త కవిత రాశాను. శీర్షిక 'భూమిస్వప్నం'. శివారెడ్డికీ, దేవిప్రియకు, శీలావీర్రాజుకూ నచ్చింది. టైటిల్ ఫైనల్ అయింది. పుస్తకం పేరు 'భూమిస్వప్నం'.



మొదటి పుస్తకం కదా, ముందుమాట మరో సమస్య. గురువు గారు గనుక సినారెను, విమర్శకుడు గనుక కె.కె. రంగనాథచారినీ కోరాను. త్వరగానే రాసిచ్చారు. 'ఆర్ద్రత + తీవ్రత = సిధారెడ్డి కవిత' అని సినారె రాసింది నచ్చింది. కె.కె.ఆర్ పది పేజీలు రాశాడు. ఎక్కడా కవి పేరు గానీ, కవిత పేరు గానీ, పుస్తకం పేరు గానీ లేకుండా 'నేటి కవి' అని రాశాడు. ఆందోళన చెందాను. ఇబ్బంది పడుతూనే వెళ్ళి చెప్పాను. మార్పు చేస్తానంటే ఇచ్చాను. మార్పులేదు. అదీ తిరిగి ఇవ్వలేకపోయాడు. ఆందోళన పెరిగింది. తర్వాత శివారెడ్డినీ, దేవిప్రియనూ కోరితే రాశారు.



'బందారం కనిపెంచిన మందారం', అంటూ దేవిప్రియ కూర్చిన మాట ఇప్పటికీ ప్రచారంలో ఉంది. బందారం మా ఊరు. 'రాబోయే పదేళ్ల కాలం సిధారెడ్డి ఏమిటో నిర్ణయిస్తుంద'ని శివారెడ్డి భావించాడు. ముందుమాటలు పుస్తకం చివర ప్రచురించాను. "కన్నీళ్లూ కత్తులూ అయి జీవించుమనే అవ్వకూ బాపుకూ" అంకితమిచ్చాను. 'అవ్వ', 'బాపు' అని ధైర్యంగా రాశావన్నాడు సినారె.

తర్వాత ముఖచిత్రం కోసం శీలా వీర్రాజుతో కూర్చున్నాను. తృప్తి పడలేదు. అట్లా వెదుకుతున్నప్పుడు 'ఉదయం' ఆదివారం సంచికలో ప్రచురించిన ఒక ఫొటో నన్ను బాగా ఆకర్షించింది. ఇసుక తిన్నెల మీద ఆచ్ఛాదన లేని బాలుడు నడిచి వెళ్ళే దృశ్యం. అప్పటి ఆదివారం ఉదయం సంపాదకుడు దాట్ల నారాయణ మూర్తి రాజును కలిసి అడిగాను. ప్రేమతో వెదికి ఫొటో ఇచ్చాడు. ఫొటోగ్రాఫర్ పేరు అడిగాను. తెలియదన్నాడు. వీర్రాజు చేతిలో పెట్టాను. ముఖచిత్రం, వెనుక చిత్రం తయారైనాయి. శీలా వీర్రాజు అక్షరాలు శోభ కూర్చాయి. శీలావీ, మిత్రుడు వాసిలి వసంతకుమార్ పూనికతో మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్ నుంచి మంజీరా రచయితల సంఘం, మాధురీ పబ్లికేషన్స్ సంయుక్త ప్రచురణగా 'భూమిస్వప్నం' వెలువడింది. నగర కేంద్ర గ్రంథాలయం చిక్కడపల్లిలో మార్చి 6, 1987న సి. నారాయణ రెడ్డి 'భూమిస్వప్నం'ను ఆవిష్కరించాడు. నా కవిత్వాన్ని ఇష్టపడే డి. వెంకట్రామయ్య కె. శివారెడ్డి, దేవిప్రియ మాట్లాడారు. 'భూమిస్వప్నం' వెలువడిన ఆ సంవత్సరమే ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు, ఆ తర్వాత 1988 సంవత్సరం 'ఇందూరు భారతి' దాశరథి అవార్డు అందుకోవటం ఉత్సాహానికి ఉత్సాహం.

ఆ రోజుల్లో తెలుగు సాహిత్యంలో రెండు ధోరణులు వ్యాప్తిలో ఉండేవి. మా తరాన్ని బలంగా ప్రభావితం చేసిన విప్లవ సాహిత్యం. విప్లవ సాహిత్యంలో శిల్పం లోపించి నినాదాలే చెలామణీ అవుతున్నాయన్న రూపవాదుల ధోరణి. రెంటినీ అన్వయించుకున్నాం. ప్రజాజీవితాన్ని, కళావిలువల్ని మేళవించిన సమన్వయ కవితా సృజన 'భూమిస్వప్నం'. ఇప్పటికీ నేను విశ్వసించేది అదే. ఇష్టమైన వాక్యం– 'కవిత్వం వేడుక కాదు. గాయాల గొంతుక'.



కారా మాస్టారి కథ కాని కథ



'కుట్ర' కథకి ఒక విశిష్టత ఉంది. కాళీపట్నం రామారావు కథా ప్రపంచంలో మొదటి దశ 1948లో 'ప్లాటుఫారమో' అన్న కథతో మొదలై 1955లో రాసిన 'అశిక్ష–అవిద్య' అన్న కథతో ముగుస్తుంది. 1956 నుంచి 1963 వరకు మాస్టారు కథ రాయలేదు. మళ్లీ 1964 నుంచి 1972 వరకు, అనగా 'తీర్పు' కథతో మొదలుపెట్టి 'కుట్ర' కథ వరకు, 16 కథలు రాసేరు. ఇది రెండో దశ. చాలా పరిణతి చెందిన కథలు ఈ దశలో వచ్చాయి. పీడితుల పక్షం తీసుకుంటూ, రాజకీయ సామాజిక ఆర్థిక అంశాలను చర్చించే కథలు ఈ రెండో దశ లోనే ప్రధానంగా వచ్చాయి. 'యజ్ఞం' లాంటి గొప్ప కథ కూడా ఈ దశలోదే. ఈ దశలో వచ్చిన కథల్లో చివరి కథే 'కుట్ర'. కారా మాస్టారు తన దృక్పథాన్ని చాలా స్పష్టంగా సూటిగా ప్రకటించిన కథ ఇది.

అందుకే 'కుట్ర' కథని గురించి ప్రముఖ కథ, నవల విమర్శకులు వల్లంపాటి వెంకట సుబ్బయ్య ఇలా అంటారు– "తాను ఇన్ని కథలు రాసినా తన ప్రాపంచిక దృక్పథం అతి గోప్యంగా ఉండిపోయిందేమో, పాఠకులకు అందలేదేమో అన్న సంశయంతో కాబోలు 'కుట్ర' అన్న కథ కాని కథను రాసి రచన మానేశాడు. 'కుట్ర' కథేనా, అందులో కథాంగాలు ఉండవలసిన చోట, ఉండవలసిన తీరులో ఉన్నాయా అని ఆలోచించి ప్రయోజనం లేదు. 'కుట్ర' కథగా ప్రారంభమై రచయిత మానసిక అలసత్వం వల్లనో, అసమర్థత వల్లనో అలా ఉపన్యాసంలా అయిపోలేదు. ఇప్పుడు ఉన్నదే రచయిత ఎంచుకున్న రూపం. కాబట్టి మనం అందులోని భావజాలానికి, ప్రాపంచిక దృక్పథానికే ప్రాధాన్యత ఇచ్చి ఆలోచించడం మంచిది. అప్పుడు ఆలోచనపరుడుగా కారా ఎదిగిన ఎత్తులు తెలుస్తాయి."

నిబద్ధుడైన కథకుడు కారా. ఈ మాట నేను ఎందుకంటున్నానంటే 1972లో మాస్టారు ఈ 'కుట్ర' కథను రాసేరు. 1970–76 మధ్య విచారణ జరిగి 140 మంది ముద్దాయిలు, 897 మంది సాక్షులు ఉన్న, ప్రపంచంలోనే అతిపెద్ద కేసైన, పార్వతీపురం కుట్ర కేసు ఈ కథకు భూమిక. అక్కడ నుంచి మొదలుపెట్టి– కుట్ర అని అసలు దేనిని అంటారో, కుట్ర ఎక్కడ జరిగిందో జరుగుతున్నదో విశదపరిచే ఎత్తుకు ఎదిగింది ఈ కథ. కారా మాస్టారు 1972 నుంచి 1992 వరకు మరొక్క కథ రాయలేదు. 1972 తర్వాత శ్రీకాకుళ గిరిజన విప్లవోద్యమం సెట్ బ్యాక్‌కి గురైన తర్వాత ఇరవై ఏళ్ల పాటు మాస్టారి నుంచి కథ రాలేదు. మాస్టారు విప్లవోద్యమ కాలంతో ఎంతగా పెన వేసుకుపోయారన్నది ఈ సెట్ బ్యాక్‌ని గమనంలో ఉంచుకుని మనం ఒక నిర్ధారణకు రావొచ్చు. తర్వాత 1992 అక్టోబర్‌లో 'రచన' సచిత్ర మాసపత్రికలో 'సంకల్పం' అనే కథ అచ్చైంది. తర్వాత 2006లో శ్రీకాకుళ సాహితి మిత్రులు తెచ్చిన 'జంఝావతి కథల సంకలనం'లో వచ్చిన 'అన్నెమ్మ నాయురాలు' కథే కారా మాస్టారి చివరి కథ.

***

1970 నాటి తిరుగుబాటు ఆలోచనలు నిర్మించుకున్న చరిత్రకు సాక్షీభూతం 'కుట్ర' కథ. అక్షరాలా 897మంది సాక్షుల సమక్షంలో, 140మంది ప్రభుత్వాన్ని కూల్చేసే కుట్రని పన్నారని ప్రభుత్వం ఆరోపణ చేసిన నేపథ్యంలో, ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టిన విస్పష్ట కథగా 'కుట్ర'ని పేర్కొనవచ్చు.

ఈ కథలో కుట్ర నిజస్వరూపాన్ని చెప్తారు కాళీపట్నం. రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నట్టు భ్రమింప చేస్తూ పెట్టుబడిదారులు దోపిడీ విధానాలను అమలు చేసే క్రమాన్ని ఇందులో చెబుతారు. ఆ కథాకాలంలో మొదలైన దోపిడీ ఇప్పుడు ఎంత లోతులకు చొరబడిందో మనకు తెలిసిందే. సంపద కేంద్రీకరణ తీరు కళ్ల ముందు కనిపిస్తున్నదే. ఆ విధంగా వర్తమానానికి అనువర్తించబడ్డ కథ 'కుట్ర'. వాస్తవ దోపిడీ వాతావరణ నిజస్థితిని డొక్క చింపి చూపెట్టిన కథ 'కుట్ర'.

"పట్నంలోయేదో కేసొతోందట యిన్నావా?" అని ఇద్దరు స్నేహితుల మధ్య సంభాషణతో మొదలౌతుంది కథ. "దగ్గిర దగ్గిర నూటేభై మంది ముద్దాయిలూ.. వెయ్యిమంది సాక్షులూ..." ఈ మాటలతో వారు పార్వతీపురం కుట్రకేసు గురించే మాట్లాడుకుంటున్నారని మనకు రూఢీ అవుతుంది. ఇద్దరు స్నేహితుల్లో ఒకరంటారు. "కుట్రంటే– ఇద్దరో ముగ్గురో మధ్య రహస్యంగా ఏదైనా జరిగితే అది కుట్ర. నూర్నాటేభైమంది జనమేటి, ఆళ్ళ పక్షాన కాదు, నీ పక్షాన పలకడానికొచ్చినోళ్ళే వెయ్యిమంది సాక్షులు! అంత సాక్షింలో జరిగిందీ అంటే అది పబ్లిగ్గా జరిగిందన్నమాట. అలాటిది ఏటన్నా కావచ్చు గాని కుట్రనడానికి మాత్రం కాదు. నన్నడిగితే దాన్ని కుట్రనడమే ఓ పెద్ద కుట్రంటాను. ఏటి– తిరుగుబాటనడానికి నీకు నామోషీ దేనికి?"

ఈ సంభాషణ నుంచి కథ నెమ్మదిగా కథకుడి వద్దకు వెళ్లి, దేశ రాజకీయార్థిక అవగాహన లోంచి, దృక్పథ చైతన్యం లోంచి ఒక మోనోలాగ్‌లా, ఒక ఉపన్యాసంలా నడుస్తుంది. అసలు కుట్ర ఏదో తేటపరుస్తుంది కాబట్టి కథ అనుకున్న గమ్యాన్నే చేరింది. కారా రాసిన ప్రధానమైన కొన్ని కథల్లాగే ఈ కథ కూడా వర్గదృష్టి ఉన్న కథే.

> 'కుట్ర' కథలో కుట్ర నిజస్వరూపాన్ని చెప్తారు కాళీపట్నం రామారావు. రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నట్టు భ్రమింప చేస్తూ పెట్టుబడిదారులు దోపిడీ విధానాలను అమలు చేసే క్రమాన్ని ఇందులో చెబుతారు. ఆ కథాకాలంలో మొదలైన దోపిడీ ఇప్పుడు ఎంత లోతులకు చొరబడిందో మనకు తెలిసిందే. సంపద కేంద్రీకరణ తీరు కళ్ల ముందు కనిపిస్తున్నదే. ఆ విధంగా వర్తమానానికి అనువర్తించబడ్డ కథ 'కుట్ర'.

కథలో ఒక దగ్గర– "నన్నడిగితే కుట్రనదగ్గదేదేనా జరిగితే రాజ్యాంగం రాసినకాడే జరిగుండాల. పంచవర్ష ప్రణాళికలు ఏసిన్నాడు డెఫినెట్‌గా జరిగింది. జరిగిందనడానికి దాఖలాలున్నాయి మన కళ్ళముందే. అసలు కుట్ర అది," అంటుంది కథ చెప్తున్న పాత్ర. ఇది రచయిత దృక్కోణంగా మనకు తెలియకనే తెలుస్తుంది.

***

ఈ కథ వర్తమానంలో ఏఏ కోణాలకు వర్తిస్తుంది? అని ప్రశ్న వేసుకుంటే– ఈ కథ 1972 లో అచ్చయింది, పార్వతీపురం కుట్ర కేసు 1976లో ముగిసింది, ఇప్పుడు మనం 2024లో ఉన్నాం– ఈ ఏభై ఏళ్లలో దేశం మొత్తం మీద ఎన్నో అబద్ధాల కుట్ర కేసులను చూస్తున్నాం. అందుకు సాయిబాబా కేసు ఒక పెద్ద ఉదాహరణ. మతం గురించి కూడా కథ లోని పాత్ర మాట్లాడుతుంది. ఇది కూడా వర్తమానానికి వర్తించేదే. ఇది– ఈ కథ ద్వారా తక్షణం చర్చించాల్సిన కొత్తకోణం అని ఇప్పటి మతోన్మాద సందర్భంలో నేను అనుకుంటున్నాను. కథ లోనే ఆ చర్చకు ఆస్కారం ఉంది కూడా.

మన దేశానిది కేపిటలిస్టు ఎకానమీనా, సోషలిస్టు ఎకానమీనా అని చర్చ లాంటిది ఒకటి పెడతాడు ఈ కథలోని పాత్ర ద్వారా రచయిత. ప్రభుత్వం చేసే ట్రిక్కుని బయటపెడతాడు. ఆ ట్రిక్కు ఇలా వుంటుంది: "మొదట్నుండీ మన నాయకుల ఆలోచనా ధోరణీ, జాతికి ఆళ్ళు నేర్పి పెట్టిన ఆలోచనా పద్ధతీ, ఒకటుంది గదా! మాటొరసకి– బ్రిటిష్ వాళ్ళు మన మిత్రులా? కాదు కాదు. అయితే శత్రువులా? అబ్బెబ్బే ఎంత మాత్రం కాదు. హిందూ మతాచారాలు మంచివా చెడ్డవా? చెడ్డవే చెడ్డవే. కాని వాటిల్లో మూఢత్వాన్ని తొలగిస్తే, ప్రపంచం మొత్తం మీద ఆ మత విశ్వాసమంత గొప్పది మరింకోటి లేదు."

ఇక్కడ మతానికి సంబంధించిన మాటలు వర్తమాన సందర్భానికి అనువర్తించుకోదగ్గవే. కథ లోని ఈ పాయింట్ ప్రస్తుతం చర్చించదగ్గ పాయింట్ అని అనుకుంటున్నాను.

***

"గాంధీగారి కోతులు కళ్ళూ చెవులూ నోరూ మూసీసుకోవాలనీ, మూసీసుకోండని చెప్పి యింకా వినప్పోతే బలవంతాన మూసీడానికి ప్రయత్నించొచ్చు. కానీ–" అన్న అసంపూర్ణ వాక్యంతో కథ ముగుస్తుంది. "కానీ" తర్వాత వుండేది 'తిరుగుబాటే' అని కథకుని ఉద్దేశం. అన్యాయంపై అధర్మంపై ప్రజ ఎలుగెత్తక తప్పదని ఆయన ఉద్దేశం. అది వాస్తవం కూడా. కథ ప్రారంభంలో ఒక డైలాగ్ ఉంటుంది. "నన్నడిగితే దాన్ని కుట్రనడమే ఓ పెద్ద కుట్రంటాను. ఏటి తిరుగుబాటనడానికి నీకు నామోషీ దేనికి?" అని. ఈ వాక్యాన్ని బలంగా నిరూపించడానికి కథకుడు ఈ కథని చెప్పాడని నేను భావిస్తున్నాను. జాగ్రత్తగా గమనిస్తే ఈ కథలో ఒక వలయం ఉంది. కథ ప్రారంభంలో తిరుగుబాటును కాంక్షించి, కథ ముగింపులో తిరుగుబాటు జరిగి తీరుతుందని చెప్పడం, అదే పరిణామసూత్రం అని ప్రకటించడం. ఇది నిస్సందేహంగా శిల్ప రహస్యమే. కథకుని సృజనాత్మక నిర్మాణ చాతుర్యమే. విప్లవ కథకి ఉండాల్సిన పురోగామి లక్షణాలతో 'కుట్ర' కథని ఒక వైవిధ్యమైన విప్లవ కథగా నేను నిర్ధారిస్తున్నాను.

■ బాలసుధాకర్
✆ 96764 93680

ఒక శ్వాస.. కొన్ని అంతర్లయలు

దూరాన్ని నువ్వే నిర్ణయిద్దువు గాని
ప్రయాణాన్ని ఇవ్వు చాలు

గుండెలో విరిగిన
గడియారం ముల్లును పీకిపారేసి
కొద్దికొద్దిగా కదులుతున్న కాలాన్నివ్వు చాలు

అనేకానేక నవ్వు తెరల మధ్య
వేళ్ళతో మీటితే
ఒలికిపోయి ప్రవహించే
నిండు పాత్రల పరిచయాల్ని ఇవ్వు చాలు

హంగుల నింగి నీడల కుబుసాల్ని
విదుల్చుకొని వచ్చేస్తాను–
రైతుతో పాటు
బురదలో కూరుకుపోయి
బరువెక్కే పాదాల్నివ్వు చాలు

ఇరుకిరుకు లోయల మధ్య
కలిసి పరీవాహకత్వమైన
పురాజ్ఞాపకపు
పరిమళాన్నివ్వు చాలు

నీటి ఎడారి మేటల మీద
మోకరిల్లి ప్రార్థిస్తాను
నా పెదాలకు
ప్రకృతికి అర్థమయ్యే
నాలుగు పదాలనివ్వు చాలు

■ కందుకూరి దుర్గాప్రసాద్
✆ 96189 29018

- స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలి..
- బీసీ డిక్లరేషన్ అమలులో కాంగ్రెస్ విఫలం
- ఒక్క బీసీకైనా రూ.10లక్షల వడ్డీ లేని రుణం ఇచ్చారా..?
- మండలానికో బీసీ గురుకులం, జిల్లాకో డిగ్రీ కాలేజీలు ఏమయ్యాయి..
- కాంగ్రెస్ ఏడాది వైఫల్యాలపై వారోత్సవాలు నిర్వహిస్తాం..
- సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే వి డుదల చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

6

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించాలి


మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్
కేటీఆర్ రాక సందర్భంగా నగరంలో బీఆర్ఎస్ శ్రేణుల బైక్ ర్యాలీ

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించి స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేద న్నారు. అలాగే కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. కుల గణనకు తాము వ్యతిరేకం కాదని, తమిళ నాడు తరహాలో రిజర్వేషన్లు ఇక్కడ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కేటీఆర్ నగర పర్యటన సందర్భంగా కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కరుణాపురం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్


రంగయ్యపల్లిలో కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

- సన్న, దొడ్డు రకాలకు బోనస్ చెల్లించాలి
- రైస్‌మిల్లర్లతో కొంత మంది నాయకుల ములాఖత్
- రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- సర్వేకు వచ్చిన అధికారులను నిలదీస్తున్న ప్రజలు
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

6

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం నిర్ల క్ష్యం చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. భీమదేవర పల్లిలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే సన్న, దొడ్డు వడ్ల కు బోనస్ ప్రకటించాలన్నారు. కాంగ్రెస్ హామీల గురించి కుటుంబ సర్వేలో అధికారులను ప్రజలు నిలదీస్తున్నారని అన్నారు.

- భీమదేవరపల్లి

సకాలంలో సమగ్ర కుటుంబ సర్వేను పూర్తిచేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.. పున్నేలులో సర్వే పరిశీలన
- ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన


పున్నేలులో మోరె రాంచంద్రం ఇంటి అరుగుపై కుర్చుని సర్వే ఫామ్ నమోదును పరిశీలిస్తున్న హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ఐనవోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వ హిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. పున్నేలులో సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో ఆదివారం సందర్శించి పరిశీలించారు. తొలుత రావుల యాకాంతం ఇంటికి వెళ్లి ఎన్యూమరేటర్ పూర్తిచేసిన ఫామ్‌ను పరిశీలించి అందులో నమోదుచేసిన వివరా లు సమగ్రంగా ఉన్నాయా లేదో కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఫామ్‌లోని కొన్ని కాలమ్‌లలో వివరాలు నమోదు చేయకుండా ఖాళీగా ఉంచగా కలెక్టర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతీ కాలమ్ పూర్తిచేయాలని, సమాచారం లేకుంటే గీతపెట్టాలని తెలిపారు. అలా కాకుండా ఖాళీగా ఉంచకూడదని హెచ్చ రించారు. భూమి వివరాల నమోదులో తప్పులు దొర్లుతున్నాయని, దీనిపై తహసీ ల్దార్, ఏఎస్‌వోలు సర్వే సూపర్‌వైజర్లకు తక్షణమే వాట్సాప్ ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఫామ్‌లో కొట్టివేతలు ఉండకుండా చూసుకోవాలని, త ప్పుగా రాస్తే రౌండప్ చేసి మళ్లీ రాయాలి కానీ, దిద్దవద్దని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సర్వేను పూర్తిచేయాలని అధికారులను కోరారు. ప్రతీ రోజు ఒక ఎన్యూమరేటర్ 15 ఇళ్ల సర్వేను పూర్తిచేయాలన్నారు. ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను బహిర్గతం చేయకుండా ఎన్యూమరేటర్లు గోప్యంగా ఉంచాలని ఆదేశించారు. ఈ నెల చివరి వరకు సర్వేను పూర్తిచేసి కంప్యూటర్లో అప్‌లోడ్ చేయడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం పనిచేస్తుందన్నారు. ఆమె వెంట తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు, ఆర్ఐ మల్లయ్య, ఎఎస్‌వో జగన్, ఏవో సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్న ధాన్యానికి బోనస్

రాంనగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రావీణ్య సంద ర్శించారు. రైతులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. సన్నర కాల ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇస్తుందని, ఆ విషయంలో రైతులు అపోహల నుంచి బయటకు వచ్చి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసు కవచ్చి లబ్ధిపొందాలన్నారు. ధాన్యంలో తాలులేకుండా సత్వరమే ప్యాడి క్లీనర్లను ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. ఇప్పటికి ఎన్ని మిల్లులు కేటాయించారు? ఎన్ని క్వింటాళ్ల ధాన్యంను తర లించారని నిర్వాహకులను అడిగితెలుసుకున్నారు. రైతులకు సకాలంలో గన్నీ బ్యాగులు ఇవ్వాలని సూచించారు. కలెక్టర్ వెంట డీసీవో నీరజ, తహ సీల్దార్ విక్రమ్‌కుమార్, ఏవో సునీల్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ డీటీలు నాగేంద్రప్రసాద్, రమేష్, ఆర్ఐ మల్లయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎఎస్‌వో జగన్, సొసైటీ వైస్ చైర్మన్ టి.చందర్‌రావు, సీఈవో సంపత్ తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా దోపిడీ!

- సర్కారు బియ్యంతో కొందరు మి ల్లర్ల మాయాజాలం
- ప్రభుత్వానికే విక్రయిస్తున్న ఘరానా మోసగాళ్లు
- రేషన్ రైస్ రీ సైక్లింగ్‌తో రూ.కోట్లలో అక్రమ సంపాదన
- సీఎంఆర్ కోటాగా చూపుతున్న వైనం
- విద్యుత్ బిల్లులు పరిశీలిస్తే మోసం వెలుగులోకి?
- పట్టించుకోని సివిల్ సప్లయీస్, రెవెన్యూ అధికారులు




హనుమకొండ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేదల బియ్యంతో కొందరు మిల్లర్లు మాయాజాలం చేస్తున్నారు. సివిల్ సప్లయీస్, రెవెన్యూ, నిఘా వర్గాలకు ముట్టజెప్పాల్సినంత ముట్టజెప్పి.. స్మార్ట్‌గా దర్జాగా దోచుకుంటున్నారు. ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ద్వారా నిరుపేదలకు అందించే ఉచిత బియ్యాన్ని దళారులు, కొందరు రైస్ మిల్లర్ల జయమానులు అక్రమ వ్యాపారం చేస్తూ ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. సర్కారు బియ్యాన్ని మళ్లీ సర్కారుకే విక్రయిస్తూ వైట్ కాలర్ దందా సాగిస్తున్నారు. రైస్ మిల్లర్లలో కొందరు నిజాయితీగా సీఎంఆర్ ధాన్యాన్ని మర పట్టించి బియ్యంగా మార్చి ప్రభుత్వానికి అప్పగిస్తుండగా.. కొందరు మాత్రం దొడ్డి దారిన ఉచిత రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి వాటినే సీఎంఆర్ కోటాగా చూపుతూ దోపిడీకి పాల్పడుతున్నారు. అలాగే రైతులు ఇచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని కూడా వక్ర మార్గం పట్టిస్తూ రెండు మార్గాల్లో దగా చేస్తున్నారు. ఇదంతా సివిల్ సప్లయీస్ అధికారులు, రెవెన్యూ, పోలీస్, నిఘా వర్గాలు తెలిసినా కిమ్మనకుండా షరా 'మాముళు'గానే వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

దళారుల సాయంతో రీసైక్లింగ్ దందా..

పేదలకు సర్కారు ఇచ్చే ఉచిత బియ్యాన్ని రేషన్ షాపుల వద్ద కొందరు దళారులు ప్రతీ నెల కొందరు లబ్ధిదారుల నుంచి కిలో రూ.15 నుంచి రూ.20కి కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన దళారులు పెద్ద మొత్తంలో రేషన్ సిండికేట్‌లో ఉన్న వి ఎల్లర్లకు విక్రయిస్తున్నారు. ఈ బియ్యాన్నే మిల్లర్లు మర పట్టించి సన్న బియ్యంగా మార్చి తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తూ రూ.కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారు. ఉదాహరణకు కిలో రూ.25 ఖర్చయితే రూ.50కి విక్రయించి రెండింతలుగా అక్రమంగా దండుకుంటున్నారు. ఇక మరి కొందరు ఏ పైసా పెట్టుబడి లేకుండా ముందుగానే దళారులతో ఒప్పందం చేసుకుంటున్నారు. దళారులు అప్పగించిన రేషన్ బియ్యాన్ని మిల్లర్లు సేకరించుకొని మర పట్టించి విక్రయించే వరకు రూపాయి పెట్టుబడి పెట్టడం లేదు. రీ సైక్లింగ్‌తో సన్న బియ్యంగా మార్చే మిల్లర్లు వాటిని విక్రయించిన తదుపరి వచ్చే సొమ్ములో కొంత దళారులకు అప్పగిస్తున్నారు. ఇలా పైసా పెట్టుబడి లేకుండా దర్జాగా సొమ్ము చేసుకునే మార్గంలో కొందరు మిల్లరు నెలకు కోట్లలో సంపాదిస్తున్నారు.

సీఎంఆర్ కోటాగా చూపుతున్న కేటుగాళ్లు..

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం మర పట్టించేందుకు మిల్లర్లకు అందజేస్తోంది. దీనినే కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అంటారు. ఉదాహరణకు ప్రభుత్వం మిల్లర్‌కు క్వింటా ధాన్యాన్ని అందిస్తే.. ఆ మిల్లర్ 67శాతాన్ని బియ్యంగా మార్చి సర్కార్‌కు అప్పగించాలి. అయితే ఇక్కడ కొందరు మిల్లర్లు దొంగ తెలివి తేటలతో రైతుల నుంచి కొనుగోలు చేసిన నాణ్యమైన ధాన్యాన్ని పక్కన పెట్టి.. ఆ స్థానంలో రేషన్ బియ్యాన్ని మర పట్టించి సన్న బియ్యంగా మార్చి వాటినే సీఎంఆర్ బియ్యంగా ప్రభుత్వానికి ఇచ్చి ఘరానా మోసాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం సీఎంఆర్ కింద వి ఎల్లర్లకు ఇచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వారి ఇష్టానుసారంగా విక్రయిస్తూ కొందరు మిల్లర్లు ఈ తరహా అడ్డదారిలో కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. ఓ వైపు రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి రెండింతలు అక్రమంగా దండుకోవడం.. మరో వైపు సీఎంఆర్ ధాన్యం కోటాను పక్కన పెట్టి.. ఆ తర్వాత వాటిని అమ్ముకుని రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఇక తడిసిన ధాన్యం సాకుతో రైతులను దగా చేసి కొనుగోలు చేసిన దళారులు వాటిని మిల్లర్లకు విక్రయిస్తే ఆ ధాన్యాన్ని మర పట్టించి బియ్యాన్ని మళ్లీ సర్కారుకే అమ్ముతున్నారు.



విద్యుత్ బిల్లులతో స్వాహాపర్వం బయటకొచ్చేనా!

కొందరు రైస్ మిల్లర్ల బియ్యం స్వాహా పర్వాన్ని బయట పెట్టే సాక్ష్యం మిల్లుకు సంబంధించిన విద్యుత్ బిల్లులేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ధాన్యం మర పట్టించి బియ్యంగా మారిస్తే వి ద్యుత్ వినియోగం అధికంగా ఉంటుంది. కానీ బియ్యాన్ని మాత్రమే మర పట్టిస్తే వినియోగం తక్కువగా జరుగుతుంది. ఉదాహరణకు సీఎంఆర్ క్వింటాల్ ధాన్యాన్ని మర పట్టిస్తే 50యూనిట్ల విద్యుత్ వి నియోగం జరిగితే.. అదే రేషన్ బియ్యాన్ని సన్న బియ్యంగా మారిస్తే 20 యూనిట్ల మాత్రమే వినియోగం జరుగుతుందన్నమాట. ఈ లెక్కన సీఎంఆర్ ధాన్యాన్నే మిల్లర్లు బియ్యంగా మార్చి ఇచ్చారా? లేదంటే రేషన్ బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చి ప్రభుత్వానికి ఇచ్చారా అనే విషయాన్ని సదరు మిల్లు విద్యుత్ వినియోగ రికార్డులు చూస్తే పసిగట్టవచ్చని తెలుస్తోంది. రికార్డుల్లో అన్ని సక్రమంగా ఉన్నట్లు మిల్లర్లు అధికారులకు చూపుతారు కానీ ఆ మేరకు విద్యుత్ వినియోగం జరగదు. తక్కువ విద్యుత్ వినియోగం జరిగిందంటే.. రేషన్ బియ్యాన్నే మర పట్టించి వాటినే సీఎంఆర్ కోటాలో మిలర్లు చూపి టోకరా కొట్టినట్టేనని అర్థమవుతుందని చెబుతున్నారు. కానీ ఈ విద్యుత్ బిల్లుల జోలికి అటు మిల్లర్లు.. ఇటు వారికి సహకరించే సివిల్ సప్లయ్ అధికారులు, రెవెన్యూ, నిఘా వర్గాలు వెళ్లరన్న విమర్శలున్నాయి. మిల్లర్ల దర్జా దోపిడీకి అధికారగణం వంత పాడుతూ వాటాలు పుచ్చుకొని కిమ్మనడం లేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

విజేత రంగారెడ్డి జట్టు

- మహిళా విభాగంలో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టు
- ముగిసిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన పశ్చిమ ఎమ్మెల్యే

6


మహిళా విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హా ల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరి ష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.



విజ్ఞానమే హద్దుగా..

- నిట్‌లో ఆలోచింపచేసిన విద్యార్థుల ప్రదర్శనలు
- ముగిసిన టెక్నోజియాన్ - 24 వేడుక
- రెండు రోజుల్లో 30కి పైగా ఎగ్జిబిట్ల ప్రదర్శన
- చివరి రోజూ కొనసాగిన పలు ఈవెంట్లు
- తిరుగుముఖం పట్టిన విద్యార్థులు

8

ఆలోచింప చేసే ఆవిష్కరణలు, విజ్ఞానం పెంచే విషయాలతో విద్యార్థులు అదరగొట్టారు. రెండు రోజులుగా వరంగల్ జాతీయ సాంకేతిక కళాశాల (నిట్)లో జరుగుతున్న టెక్నోజియాన్ - 24 ఆదివారం ముగిసింది. విద్యార్థులు 30కి పైగా ఈవెంట్లు ప్రదర్శించారు. విద్యార్థులనుద్దేశించి పలువురు అతిథులు ప్రసంగించారు. చివరి రోజు కూడా ఈవెంట్లు కొనసాగాయి. సెల్యూషన్, ప్రాడక్ట్ లాంచ్, లాబ్రింత్, మెకానికల్ కిట్, వండర్ కాస్మిక్, కమాండ్ బేస్డ్ కంట్రోల్, చాకోలెట్ డిస్పెన్సర్, రివర్ క్లీనింగ్ బోట్ ఈవెంట్లు ఆలోచింపజేశాయి. కాగా, ఈ వేడుక విదేశీయులను ఆకట్టుకుంది. సిరియాకు చెందిన ముదార్.. తన ఇద్దరు పిల్లలతో టెక్నోజియాన్‌కు వచ్చారు. ఈయన నిట్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

నిట్‌లో ఆదివారం రాత్రి జరిగిన డీజే నైట్‌లో విద్యార్థుల జోష్

వండర్ కాస్మిక్ ఈవెంట్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు


పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ విజేత రంగారెడ్డి జట్టు

- మహిళా విభాగంలో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టు
- ముగిసిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో అంతర్‌జిల్లాల బాల్‌బాడ్మింటన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల, మహిళా బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీలో పురుషుల విభాగంలో రంగారెడ్డి, మహిళా విభాగంలో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ట్రోఫీని అందుకొని విజేతగా నిలిచాయి. హనుమకొండ జేఎన్ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. రెండు రోజులుగా వివిధ జిల్లాకు చెందిన జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన పోరులో పురుషుల విభాగంలో రంగారెడ్డి ప్రథమ స్థానం, హైదరాబాద్ ద్వితీయ స్థానం, ఆతిథ్య వరంగల్ తృతీయ స్థానం, మెదక్ చతుర్థ స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టు క్రీడాకారులు ప్రత్యర్థి జట్టుకు ముచ్చెమటలు పట్టించి గెలుపే లక్ష్యంగా ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా కీర్తి, ప్రతిష్టలు కాపాడాయి. అదే విధంగా ఖమ్మం ద్వితీయ స్థానం, ఆదిలాబాద్ తృతీయ స్థానం, నల్లగొండ జట్టు చతుర్థ స్థానాల్లో నిలిచాయి.

క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలను, బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శరీర దృఢత్వంగా మారుతోందన్నారు. రోజులో ఒక గంట పాటు వ్యాయామం తప్పకుండా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చన్నారు. వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన క్రీడాభిమానులు వర్థమాన క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించడానికి సహకారం అందించడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్ కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు జేఎన్ఎస్‌లోని బాల్ బ్యాడ్మింటన్ కోర్టులో క్రీడాకారులు క్రీడాదుస్తులు మార్చుకునేందుకు వీలు కలిగిన గది నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టోర్నమెంట్ నిర్వాహకుడు ఎస్వీ భద్రయ్య మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జేఎన్ఎస్ వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 10మెన్, 9ఉమెన్ జట్లు పాల్గొన్నాయన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన తెలంగాణ రాష్ట్ర ఉమెన్ జట్టు డిసెంబర్ 26నుంచి 30వరకు మహారాష్ట్రలో నిర్వహించనున్న 70వ జాతీయస్థాయి ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మెన్ విభాగంలో ఇక్కడ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన జట్టు డిసెంబర్ 6నుంచి 9వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించనున్న 8వ ఫెడరేషన్ కప్ 2024కు మెన్ జట్టును ఎంపిక చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, టోర్నమెంట్ కమిటీ చైర్మన్ రవీంద్రకుమార్, వైస్‌చైర్మన్ సాదుల ప్రకాష్, కన్వీనర్ కొత్తపల్లి ప్రసాద్, కోకన్వీనర్ గాదెపాక అయోధ్య, కమిటీ బాధ్యులు కొమురయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్. ఈశ్వర్ కుమార్, కోచ్‌లు కొమ్ము రాజేందర్, విజయ్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు తిరుపతిరెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని


హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలి..
- బీసీ డిక్లరేషన్ అమలులో కాంగ్రెస్ విఫలం
- మాజీ మంత్రి కేటీఆర్

వరంగల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లను అమలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారని, అయితే ఈలోగా కుల గణను పూర్తి చేసి, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తరువాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గత ఏడాది కాంగ్రెస్‌పార్టీ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించిందని, వాటిలో ఏఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఆరు నెలల్లో స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి, ఏడాది దాటినా అమలు చేయడం లేదన్నారు. 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఇంటింటికి వచ్చే అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కులగణనను తాము సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని, కచ్చితంగా కులగణన చేయాల్సిందేనని అన్నారు. తమ పార్టీ బృందం తమిళనాడులో అమలవుతున్న 60శాతం రిజర్వేషన్లను అధ్యయనం చేసిందని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తమిళనాడు తరహాలో ఇక్కడ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 60ఏళ్లలో కాంగ్రెస్ బీసీల కోసం కేంద్రంలో మంత్రిత్వశాఖను కూడా ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. బీసీ కుల గణనపైన, ప్రభుత్వంపైన ప్రజలకు నమ్మకం లేదని, అందుకే ఇంటింటికి వెళ్తున్న అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలల్లో ప్రతీ మండలానికి గురుకులం ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. ఒక్క బీసీకైనా వడ్డీ లేని రూ.10లక్షల రుణం ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఐదేళ్లలో బీసీల సంక్షేమం కోసం ఏటా రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. తొలి ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.8వేల కోట్లే ప్రకటించిందని, అవికూడా ఇప్పటి వరకు విడుదల చేయలేదని విమర్శించారు. కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేస్తోందా? అని ప్రశ్నించారు. 33 జిల్లాల్లో ఒక్కొక్క చోట రూ.50కోట్లతో బీసీ కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఏడాదికాలంలో ఒక్క బీసీ కన్వెన్షన్ హాల్ నిర్మించారా? అని ప్రశ్నించారు. ప్రొఫెసర్ జయశంకర్ పేరిట బీసీ ఐక్యత భవనాలు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. చేతివృత్తుల వారికి 50ఏళ్లకే పింఛన్ అని ఇచ్చిన మాట తప్పారని, 2వేల పింఛన్‌ను రూ.4వేల చేస్తామని చెప్పి మాట కూడా నిలపెట్టుకోలేదని కేటీఆర్ విమర్శించారు. ముదిరాజ్ కులస్థులను బీసీడీ నుంచి బీసీ ఏలో చేరుస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.


వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని పరామర్శిస్తున్న కేటీఆర్

వంద రోజుల్లో గొల్లకురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. గౌడ కులస్థులకు ఈత చెట్ల పెంపకం కోసం ప్రతీ ఊరిలో ఐదెకరాల భూమి ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. సర్పంచులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని ఆందోళన చేస్తుంటే దుర్మార్గంగా అరెస్టులు చేయటం ఏమిటని ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్ పేరిట బలహీనవర్గాలకు వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్.. ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దళిత బంధు నిధులు ఇవ్వాలని అడిగితే బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడులు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఆర్థిక భరోసా కార్యక్రమాలు వెంటనే ప్రారంభించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, అబద్ధాల సీఎంను బీఆర్ఎస్ తరుపున అడుగుతూనే ఉంటాం.. నిలదీస్తూనే ఉంటామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన డిక్లరేషన్‌పైనా ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. బీఆర్ఎస్ చేసిన పనులు కాంగ్రెస్ చేసినట్లు చెప్పుకుంటే, ప్రజలు బట్టలు ఊడతీసి కొడతారని అన్నారు. ప్రభుత్వం ఏం సాధించిందని విజయోత్సవాలకు ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై తాము వారోత్సవాలను నిర్వహిస్తామని కేటీఆర్ తెలిపారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ శాసనమండలి పక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, మాజీ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, రాష్ట్ర, జిల్లా నాయకులు సుందర్‌రాజన్, వాసుదేవా రెడ్డి, జోరిక రమేష్, సిరిమిల్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో గులాబీ బైక్ ర్యాలీ

బీఆర్ఎస్ శ్రేణులు వరంగల్ నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం కరుణాపురం వద్ద జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి వందలాది బైక్‌లతో కేటీఆర్‌కు కార్యకర్తలు స్వాగతం పలికారు. మడికొండ, కాజీపేట, నిట్ క్యాంపస్, కాళోజీ జంక్షన్ నుంచి బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. దారిపొడవునా కాన్వాయ్ నుంచే కేటీఆర్ బీఆర్ఎస్ శ్రేణులకు చేతులు ఊపుతూ, నమస్కారాలు చేస్తూ వచ్చారు. సాయంత్రం 5గంటలకు బీఆర్ఎస్ కార్యాలయం నుంచి బయలుదేరి వరంగల్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని కేటీఆర్ పరామర్శించారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న కేటీఆర్

నూతన వధూవరులకు కేటీఆర్, పొన్నం ఆశీర్వాదం

కమలాపూర్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కమలాపూర్ సింగిల్ విండో డైరెక్టర్ తక్కళ్లపల్లి సత్యనారాయణరావు కూతురు నందు ప్రియరావు - ధీరజ్‌రావు వివాహ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ఆదివారం హాజరయ్యారు. లోటస్ కాకతీయ వెంచర్‌లో జరిగిన వివాహానికి వీరితోపాటు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇనగాల పెద్దిరెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, తాటికొండ రాజయ్య, బాల్కసుమన్‌లు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు ఆంధ్రజ్యోతి బీఎం వి.రఘుపతిరావు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాజీపేటలో రైల్వే ఏజీఎం తనిఖీలు



కాజీపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో రైల్వే స్టేషన్‌లో ఆదివారం దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం నీరజ్ అగర్వాల్ తనిఖీలు చేశారు. సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో కాజీపేటకు చేరుకున్న ఏజీఎంకు స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు. రైల్వే సమస్యలపై స్టేషన్ మేనేజర్ వివరించారు. అనంతరం రన్నింగ్ రూమ్, క్రూ లాబీలను తనిఖీల చేసి ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే డ్రైవర్లకు విధుల పట్ల పలు సూచనలు చేశారు. ఏజీఎం వెంట రైల్వే ఉన్నతాధికారులు ఉన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

వరంగల్ వ్యవసాయం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు తెలంగాణ కాటన్ అసోసియేషన్ ప్రకటించింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ అసోసియేషన్ (సీసీఐ) ఎల్1, ఎల్2, ఎల్3 పేరుతో మిల్లులను, అలాగే రైతులను కఠిన నిబంధనలతో ఇబ్బందులకు గురి చేస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. ఇందుకు కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెసింగ్ ఇండస్ట్రీ యజమానులు సహకరించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

సన్న, దొడ్డు రకాలకు బోనస్ చెల్లించాలి : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


రంగయ్యపల్లిలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న బండి సంజయ్‌కుమార్

భీమదేవరపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో రాష్ట్రంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఇటీవల పిడుగుపడి రూ.లక్షలు నష్టపోయిన ఎర్రబొజ్జు రాధిక, ఆమె కుమారుడు అరుణ్‌ల ఇంటిని బండిసంజయ్ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో జాప్యం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో సన్న, దొడ్డు వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు సన్నవడ్లకు బోనస్ ఇస్తామని తూతూ మాత్రంగా నిర్వహిస్తోందని విమర్శించారు. కొందరు నాయకులు రైస్‌మిల్లర్లతో ములాఖత్ అయి వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్రజాప్యం చేస్తున్నారన్నారు. దీంతో రైతులు అడ్డికి పావుశేరు తమ ధాన్యాన్ని మిల్లర్లకు రూ.2వేల లోపు అమ్ముకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 6వేల వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందంటున్నారు. మరో 1700 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వెంటనే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ప్రభుత్వంపై రైతులతో ఆందోళన చేస్తామన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో చేస్తున్న కులగణన సర్వేకు బీజేపీ వ్యతిరేకం కాదని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కానీ గతంలో కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారన్నారు. దేశ, విదేశాల్లో నుంచి ప్రజలు వచ్చి తమ కుటుంబ సర్వేలో పాల్గొన్నారన్నారు. అందులో ప్రజల కులాలకు సంబంధించిన వివరాలను పొందుపరిచారన్నారు. ఒకవేళ సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ప్రస్తుత రాష్ట్రప్రభుత్వానికి ఇవ్వకపోతే ఆ సర్వేకు అయిన ఖర్చును మొత్తం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ముక్కు పిండి వసూలు చేయాలన్నారు. రాష్ట్రంలో కులగణన సర్వే కోసం వచ్చిన అధికారులను ప్రజలు అడ్డుకుంటున్నారన్నారు. రైతు రుణమాఫీ, రైతుబంధు, ఆసరా, వికలాంగుల పింఛన్ల పెంపు, కొత్త పింఛన్ల అమలు, తదితర పథకాలపై ప్రజలు సర్వేకు వచ్చి న అధికారులను అడుగుతున్నారన్నారు. దీంతో తమకు ఏం తెలియదంటూ సర్వేకు వచ్చిన అధికారులు వాపోతున్నారన్నారు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అడ్డగోలు హామీలు ఇచ్చిందన్నారు. కానీ ఆ హామీలు అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. దీంతో యువత, మహిళా, రైతాంగం, నిరుద్యోగులు అందరూ రాష్ట్రప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతతో ఉన్నారన్నారు.

అంతకుముందు రంగయ్యపల్లి గ్రామంలో బండి సంజయ్ బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రావు పద్మ, గంగాడి మోహన్‌రెడ్డి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్, లక్కిరెడ్డి తిరుమల, దొంగల కొంరయ్య, మాచర్ల కుమార్, గుండెల్లి సదానం దంయాదవ్, అంబీరు కవిత, సింగం రాజేందర్, మేకల రాజు, వికాస్, వీరన్న, శ్రీనాథ్, అయిలయ్య, అజయ్, రాము, శ్రీకాంత్, సంజయ్, అఖిల్, శ్రీను, అంజి తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

సీఎంపై కేటీఆర్ వ్యాఖ్యలు సరికావు

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని అగౌరవపరుస్తూ అహకారంతో అనుచితవాఖ్యలు చేసిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హౌలే సంఘానికి అధ్యక్షుడని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేటీఆర్‌పై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నిప్పులు చెరిగారు. పదేళ్ల అధికారంలో ఉండి వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయకుండా కాలయాపన చేసిన కేటీఆర్.. ఓరుగల్లుకు రావడమే కాకుండా కబ్జా చేసి నిర్మించుకున్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. రాజకీయాలైనా వదిలేస్తా కానీ.. కబ్జా చేసి అక్రమంగా నిర్మించుకున్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని వదిలి పేట్టేదే లేదని హెచ్చరించారు. 19న సీఎం రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి కొత్త నగరంగా తీర్చిదిద్దడానికి రాబోతున్నాడని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వేను తప్పుదోవ పట్టించేందుకు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మరన్నారు. వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయడంతో పాలనాపరమైన ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ఈ దుస్థితికి బీఆర్ఎస్ కారణమన్నారు. బీఆర్ఎస్ 10 ఏళ్లపాలనలో చేయని అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం 10నెలల్లోనే చేసిందని, దీపావళి పండుగ రోజు తర్వాతనే అభివృద్ధి క్యాలెండర్‌ను అవిష్కరించి ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. ఉన్నత చదువులు చదిన అని చెప్పుకునే కేటీఆర్ మాట్లాడే భాష సంస్కారహీనంగా ఉందని, అధికారం కోల్పోయినా ఆయన అహంకారం తగ్గలేదన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌషిక్‌రెడ్డి ఆస్కార్ అవార్డు ఇచ్చేలా నటిస్తున్నారని ఎద్దేవా చేశారు.

త్వరలోనే మామునూరులో విమానాశ్రయం ఏర్పాటుతో పాటు నగరంలో అండర్ డ్రైనేజీ పనులకు డీపీఆర్ సిద్ధం అయిందని ఎమ్మెల్యే నాయిని వెల్లడించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా మూసీనదికి పునర్‌వైభవం తీసుకువస్తున్న ప్రభుత్వంపై అవాకులు చెవాకులు చేయడం హేయమైన చర్య అని తప్పుపట్టారు. త్వరలోనే బుల్డోజర్లతో గడీలను, ఫామ్‌హౌస్‌లను కూలగొడతామన్నారు. బీఆర్ఎస్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఎందుకు ప్రజలకు చూపించలేదన్నారు. ప్రతిపక్షానికి అడిగే స్వేచ్ఛ లేదా? అని మాట్లాడుతున్న కేటీఆర్.. అధికారంలో ఉన్నప్పుడు ధర్నాచౌక్‌ను ఎందుకు ఎత్తివేశారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆనంద్, పులి అనిల్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ రజాలి, పోతుల శ్రీమన్నారాయణ, మమిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్లు అబు బక్కర్, మాధవిరెడ్డి, డిన్నా, నాసిమ్ జహాన్ నాగరాజు, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్, సత్యనారాయణ, నన్నపునేని లక్ష్మారెడ్డి, నాయకులు రాంప్రసాద్, రాజకుమార్, బంక సంపత్, సత్యనారాయణ, నస్సా, గణేష్, రహీమున్నీసా, జావేద్, కుమార్ యాదవ్, రవీందర్, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తాం..

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటును అందిస్తామని కళాశాల పూర్వ విద్యార్థులు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రచార కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్ అధ్యక్షతన కళాశాల 70 ఏళ్ల వేడుక సన్నాహక సమావేశం కళాశాలలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ... తాము చదువుకున్న కళాశాలలో మౌలిక వసతులు మెరుగుకు, కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులను అన్నిరంగాల్లో ప్రోత్సహించడానికి వంతు కృషి చేస్తామన్నారు. 1995-98 సివిల్ బ్రాంచ్ విద్యార్థుల తరపున కళాశాల మహిళా వసతి గృహ ప్రాంగణంలో విద్యార్థినులకు యోగా, వ్యాయామ క్రీడా కోర్టులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే నిర్వహించే 70 ఏళ్ల వేడుకకు అడహక్ కమిటీని నియమంచి చేసి విజయంతానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కళాశాల నూతన భవానికి నిధులు రావడానికి కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పూర్వ విద్యార్థి ఈవి. శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్‌కు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు, రామ ప్రసాద్, నాగరాజారావు, బండి శ్రీనివాస్, దొడ్డపల్లి కుమార్, పూర్ణచందర్, పూదరి శ్రీకాంత్, వెంకన్న, ఆరిఫ్‌ఖాన్, స్వామాట్, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థులు

విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు

కేయూ క్యాంపస్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రంలోని సీఎం రేవంత్‌రెడ్డిలు విద్యారంగాన్ని విస్మరిస్తున్నారని, వారికి విద్యార్థిలోకం బుద్ధిచెప్పాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు పిలుపునిచ్చారు. ఆదివారం కేయూ మొదటి గేటు వద్ద పీడీఎస్‌యూ విప్లవ విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థి అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ వర్సిటీల అభివృద్ధిని పట్టించుకోకుండా పేద విద్యార్థులకు ఉన్నతవిద్యను దూరం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెల్లోషిప్‌లు ఇవ్వడం లేదని, వర్సిటీల్లో మతాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లుగా విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదన్నారు. హైడ్రా, మూసీ పక్షాళన పేరుతో ప్రజలను మభ్యపెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంలేదన్నారు. శాస్త్రీయ విద్య కోసం పీడీఎస్‌యూ పోరాడుతోందని అన్నారు. వర్సిటీల్లో రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలందరికీ ఉన్నతవిద్య అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో పీడీఎస్‌యూ నాయకులు బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, శివ, గణేశ్, అనూష, అఖిల, హేమ, స్వాతి, వెన్నెల, మౌనిక, ప్రియాంక, అర్చన, నవ్య, శ్రీజ, లక్ష్మి, చైతన్య, నిహారిక పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సంఘం రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత, పరిశీలకుడిగా రావుల రమేష్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా బత్తిని శ్రీరామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా చంద్రగిరి లక్ష్మయ్య, ఇప్పకాయల కుమారస్వామి, బత్తిని శ్రీదేవి, చందుపట్ల రాజేంద్రన్, ఎం.జెన్నయ్య, ప్రధానకార్యదర్శిగా గొడిశాల సత్యనారాయణ, కార్యదర్శులుగా గొడిశాల రమేష్, బోడ చక్రునాయక్, ఎం.డి. అబ్దుల్ సత్తార్, ఎం.శోభారాణి, అంకం శ్రీనివాస్, అయ్యం అన్నారెడ్డి, గేమ్ వీరభద్రం, రాష్ట్ర కౌన్సిలర్‌గా ముత్యాల రఘుపతి తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికలు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి సమక్షంలో జరిగాయి.

అయ్యప్ప మండల పూజ పోస్టర్ ఆవిష్కరణ

కాజీపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే దేవాలయంలో ఈ నెల 12 నుంచి జరుగే అయ్యప్ప 30వ మండల పూజ పోస్టర్ ఆదివారం ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ కార్యదర్శి జనార్దన్‌గౌడ్, ఆలయ అర్చకులు వుడుతల శ్రీనివాస్ శర్మలు, కమిటీ సభ్యులు హాజరై పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ దేవాలయంలో నవంబర్ 12 నుంచి డిసెంబర్ 22 వరకు మండల పూజలు, నిత్యం అన్నదానం జరుగుతాయని చెప్పారు. ప్రసాదరణ వితరణ, ఆరట్లు పూజ, శ్రీవల్లి దేవసమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, తదితర కార్యక్రమ వివరాలు తెలిపారు. కార్యక్రమంలో ఆకుల పాపయ్య, బంగారి కుమారస్వామి, బంగారి కుమారస్వామి, ఆవాల పురుషోత్తంరెడ్డి, పిల్లల కుమారస్వామి, కేదారి, సంపత్, దశరథం, ఆరూరి సాంబయ్య పాల్గొన్నారు.

కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలో ఉచిత వైద్య శిబిరం

కాశోజీ జంక్షన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు హోమియో పతిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో హోమియోపతిక్ డాక్టర్లు లక్ష్మీనారాయణ పవన్, శ్రీధర్, గీత, రేవతి, సాయికృష్ణ రోగులను పరీక్షించారు. అనంతరం మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరం నిర్వహణకు సమితి పక్షాన ప్రధాన బాధ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసస్వామి, సూర్య, అంజనాదేవి, పార్వతి, అనిత, లక్ష్మీ సహకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమకొండ టౌన్, నవంబర్ 10 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సమాజ చైతన్యానికి దిక్సూచి గద్దర్

● పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

వడ్డెపల్లి, నవంబరు 10: ప్రజా యుద్ధనౌక, ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్ పాటలు విని ఎంతోమంది చైతన్యమయ్యారని, అందులో తాను ఒకడినని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ అధ్యక్షతన నిర్వహించిన గద్దర్ రచించిన లష్కర్, తరగని గని, అండర్‌గ్రౌండ్, పాటలకు జీవకణం పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గద్దరన్నతో తనకు అనుబంధం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ చేసిన పోరాటాలను కొనియాడారు. గద్దర్ ఫౌండేషన్‌కు తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. పుస్తకాల ఆవిష్కర్త పాశం యాదగిరి మాట్లాడుతూ.. గద్దర్ తన కవితలతో పాటలతో, ఆటలో దేశవ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేశాడని అన్నారు. తెలంగాణ కోసం పాడుతూ జనాన్ని చైతన్యం చేసినందుకు చంద్రబాబు ప్రభుత్వం కాల్పులు జరిపిందన్నారు.

ప్రొఫెసర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. గద్దర్ ఉద్యమం ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఎన్నికల ద్వారా తెలంగాణ రాలేదని, ఉద్యమం ద్వారా మాత్రమే రాష్ట్రం సిద్ధించిందని అన్నారు. ప్రొఫెసర్ కాత్యాయిని విద్మహే మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ కవితా సంకలనం సాహిత్యంలో ఎంతో విశిష్టమైనదని అన్నారు. అండర్ గ్రౌండ్ జీవితంలో గద్దర్ రాసిన కవితలను ఆమె విశ్లేషించారు. గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జీవి.సూర్యకిరణ్ మాట్లాడుతూ గద్దర్ సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేస్తుందని అన్నారు. రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం గద్దర్ స్ఫూర్తితో పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, గద్దర్ పుస్తకాల సంపాదకులు జగన్‌రెడ్డి, రచయితలు అనిశెట్టి రజిత, చింతం ప్రవీణ్, బిల్లా మహేందర్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి చెస్ టోర్నీ



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న సీఐ సతీష్

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో జిల్లా క్రీడా చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ పోటీలు ముగిశాయి. ఆదివారం సాయంత్రం టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు వేడుకలకు హనుమకొండ సీఐ సతీష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. చెస్ టోర్నీలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 70మంది బాలబాలికలు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో కె.అస్మిత, హరిప్రియ, శ్రీహిత, ఆరాధ్యరెడ్డి బాలుర విభాగంలో రిత్విక్, శ్రీవాత్సవ్, సాయి జోషి, విద్యాధన్, లు అత్యుత్తమ ప్రతిభ రాణించడంతో డిసెంబర్ నెలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్లు ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడికి లక్ష తులసీదళ అర్చన

హనుమకొండ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వేయిస్తంభాల గుడిలో కార్తీకమాసం తొమ్మిదోరోజైన ఆదివారం శ్రీ రుద్రేశ్వర స్వామివారికి లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం నీరజ్ అగర్వాల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. జబర్దస్త్ టీమ్ సభ్యులు రచ్చరవి, విక్రమ్, వినోద్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థయాత్రలో భాగంగా శ్రీకాకుళం నుంచి మహిళలు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి రుద్రేశ్వర స్వామివారికి పూజలు చేశారు. వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు కస్తూరి, గంగ, తులసీ తదితరులు కూడా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈనెల 13వ తేదీన బుధవారం ఆలయ ప్రాంగణంలో చిలక ద్వాదశిని పురస్కరించుకొని, తులసీ, ఉసిరక వృక్షాలకు దాత్రి నారాయణ స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. కమ్మ సేవా సంఘం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర రావు మంజుల దంపతుల సహకారంతో కార్తీక వనభోజనాలు, కార్తీక సమారాధన, అన్నపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 14న గురువారం ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

మెట్టుగుట్టపై మహన్యాస రుద్రాభిషేకం

మడికొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చారిత్రక మెట్టుగుట్టపై కార్తీక మాసోత్సవాలలో భాగంగా మెట్టురామలింగేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా మహా శివలింగానికి బిల్వపత్రాలు, ఫల, పుష్పాలతో అభిషేకం చేశారు. అనంతరం రామాలయంలో సీతారామచంద్రస్వామి వారికి విశేష అర్చనలు జరిపారు. సాయంత్రం స్వామి వారికి ప్రదోషకాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్రహారితి, పవళింపు సేవ నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనా రాయణశర్మ, ఓం నమశ్శివాయ గురూజి పెద్ది ప్రభాకర్, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, బైరి రాజు, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, బోగి కేదారి, దండిగం శ్రీనివాస్, ఆలయ సిబ్బంది రణధీర్, అనిల్, కుమార్, సురేష్, రాజమణి, వెంకటలక్ష్మి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

హనుమకొండ టౌన్, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ హాస్టల్ నిర్వహకుడు బొక్క ప్రభాకర్ ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి నగరంలోని కొంత మంది ప్రైవేట్ హాస్టల్స్ నిర్వాహకులు రూ.36,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ హాస్టల్స్ అసోసియేషన్ మాజీ గౌరవాధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రభాకర్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ హాస్టల్స్ నిర్వహకులు సింగారపు సంగీత్, గొర్రె కృష్ణ, పెండ్యాల సదానందం, పత్రి సాంబయ్య, బొక్క సుజిత్, శ్రీకాంత్, చరణ్, తిరుపతి, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

హనుమకొండ టౌన్, నవంబర్ 10(ఆంధ్ర జ్యోతి) : హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఏసీపీ దేవేందర్‌రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతి, భద్రతలకు విఘాతం కల్పించినా.. భూతగాదాల్లో తలదూర్చినా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ కౌన్సెలింగ్‌లో సీఐ వై.సతీస్, ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

హనుమకొండ టౌన్, నవంబర్ 10 (ఆంధ్ర జ్యోతి): నక్కలగుట్ట సబ్‌స్టేషన్‌లో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో రూ.2.2కోట్ల వ్యయంతో 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసినట్లు హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. మరమ్మతు పనుల దృష్ట్యా నాలుగు రోజులుగా ఈ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయంగా బాల సముద్రం, కేయూసీ, ఎన్ఐటీ, కలెక్టరేట్ సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్‌ను సరఫరా చేశామన్నారు. ఆదివారం యథావిధిగా నక్కలగుట్ట సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు సాంబరెడ్డి, దర్శన్‌కుమార్, ఏడీఈ మల్లిఖార్జున్, ఏఈలు పాల్గొన్నారు.

యువత ఉపాధి రంగంలో రాణించాలి



మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

హసన్‌పర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యువత ఉపాధి రంగంలో ఉన్నతంగా రాణించి నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలవాలని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. చింతగట్టులో ఆదివారం ఆయన మినీ ఫంక్షన్ హాలును ప్రారంభించి మాట్లాడారు. యువత వ్యాపారాలలో నైపుణ్యాలను పెంపొందించుకొని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఎదగాలని కోరారు. ప్రస్తుతం దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రజిత, తిరునారాయణపురం కృపాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురెందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాడుతాం

● పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య




సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీ యూ పోరాడుతుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చెన్నయ్య అన్నారు. ఆదివారం హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. సంఘం సమష్టి కోసం, సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ తెలంగాణ నిరంతరం కృషి చేస్తోందన్నారు. సంఘాన్ని చీల్చే వ్యక్తులను ఉపాధ్యాయులు నమ్మవద్దన్నారు. కొందరు రాజకీయ లబ్ధి కోసం ఎమ్మెల్సీ కోసం పాకులాడుతున్నారన్నారు. త్వరలోనే పీఆర్టీయూ తెలంగాణ సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తామని వెల్లడించారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కమిటీలను పునర్నిర్మాణం చేస్తామన్నారు. సీపీఎస్ రద్దు, పీఆర్సీని ఏర్పాటు చేయడం, జీవో 317ను రద్దు చేయాలి, ఉపాధ్యాయులకు హెల్త్ స్కీమ్ అమలు, అన్ని రకాల పెండింగ్ బిల్స్ క్లియర్ చేయాలి, కేజీబీవీ సిబ్బందికి టైం స్కేలు తదితర తీర్మానాలను ఆమోదించారు.

ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యద్శి ఎం.డి. అబ్దుల్లా, ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్, ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య, రిటైర్డ్ డీఈవో చంద్రమోహన్, నాయకులు పున్నం చందర్, వెంకటేష్, శ్రీనివాస్, చిరంజీవి, శంకర్, రమేష్, రాంజి, సురేష్, శరత్, అనిల్, అన్వర్, నిర్మల, ఉమా, కేశవులు, అనిల్‌కుమార్, రమేష్, రాజిరెడ్డి, భాస్కర్, రాజ్‌కుమార్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కావాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రవికుమార్

మిల్స్‌కాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కార్యకర్తలందరూ సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవి కుమార్ పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఆదివారం ధర్మారంలో నిర్వహించిన సంస్థాగత ఎన్నికల సన్నాహక వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరించాలని కోరారు. సంస్థాగత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర కన్వీనర్ మార్తినేని ధర్మారావు, జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి వేముల నరేందర్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్సీ వన్నాల శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధానకార్యదర్శి బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, జి. రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు వంగాల సమ్మిరెడ్డి, ఎడ్ల అశోక్‌రెడ్డి, కె. పుల్లారావు, జి. శ్రీరాములు, ఎ. రఘునారెడ్డి, కుమార్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

వడ్డెపల్లి, నవంబరు 10: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి విరుద్ధమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ బండి అశోక్ అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మనువాద పార్టీలు కుట్రపన్నుతున్నారని దుయ్యబట్టారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర జిల్లా నాయకులు డాక్టర్ పుచ్చ లక్ష్మీనారాయణ, పనికల శ్రీనివాస్, అనురాధ, గరిగె అనిల్, కోండ్ర నర్సింగరావు, దండు మోహన్, అంకూస్ రవికుమార్, జనగాం సారయ్య, పొనగంటి లక్ష్మీనారాయణ, రాజమౌళి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న బీజేపీ'

ఖిలావరంగల్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని, ప్రధాని మోదీ రైతులు, కార్మికులు, యువతకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల విమర్శించారు. ఆదివారం ఖిలావరంగల్ 38వ డివిజన్ కాపువాడలో నిర్వహించిన సీపీఎం మహాసభలో ఆమె మాట్లాడారు. దేశంలో రోజురోజుకూ పేదరికం, నిరుద్యోగం పెరిగిపోతున్నాయని, రైతులు, కార్మికుల సమస్యలు తీవ్రతరం అవుతున్నాయని అన్నారు. కేంద్రం ప్రభుత్వం 44 రైతుచట్టాలను రద్దు చేసి, కార్మిక చట్టాలను విభజించి వారి హక్కులను కాలరాస్తోందని అన్నారు. అంతకు ముందు ఇటీవల మృతి చెందిన సీపీఎం పార్టీ ఆలిండియా కార్యదర్శి సీతారాం ఏచూరి, ఖిలా వరంగల్ ఏరియా కార్యదర్శి సుతారి సారంగపాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు. అనంతరం ఖిలావరంగల్ ఏరియా కార్యదర్శిగా పసునూరి వేణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్లయ్య పిట్ట మహేందర్, కొప్పుల సారయ్య, గద్దం రమేష్, ఠాకూర్ భవాని, బొల్లం వీరయ్య, కొప్పుల శ్రీనివాస్, ఎనుకంటి రాజు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే ఉద్యోగం తథ్యం

శంభునిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒక లక్ష్యం అంటూ ఏర్పరుచుకొని చదివితేనే ప్రభుత్వ ఉద్యోగం లభిస్తుందని ఏకశిల యూత్ అసోసియేషన్, తిమ్మాపూర్ లైబ్రరీ కమిటీ ముఖ్య సలహాదారుడు మ్యాకల సూరయ్య అన్నారు. ఇటీవల ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొందిన మౌనిక, దేవేందర్‌లను ఆదివారం ఏకశిల యూత్, లైబ్రరీ కమిటీల ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేకల సమ్మయ్య, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దపాక ఎల్లయ్య, నూతన విద్యానిలయం హెచ్ఎం చెక్క యాదగిరి, సిరి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రొడ్డ మురళీకృష్ణ, తిమ్మాపూర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఇల్లందుల శ్రీకాంత్, అంతర్జాతీయ చెస్ ఆటగాడు మ్యాకల శ్రీకాంత్, జాతీయ యువజన అవార్డు గ్రహీత ఆకులపల్లి మధు, కుంచం కళావతి, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు రుద్రాక్షల ఎగ్జిబిషన్ ప్రారంభం

వడ్డెపల్లి, నవంబరు 10: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని హనుమకొండ హరితకాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన రుద్రాక్షల ఎగ్జిబిషన్‌ను సోమవారం ప్రారంభించనున్నట్లు నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 20వ తేదీ వరకు ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఎస్సీ కమిషన్ బృందం రాక

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు, అట్రాసిటీ కేసులపై సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించే సమీక్ష సమావేశానికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ బృందం రానుంది. కాన్ఫరెన్స్ హాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ సమావేశం జరుగునుంది. భూ వివాదాలు, అట్రాసిటీ కేసుల విచారణకు సంబంధించి జరిగే ఈ సమేశంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు సభ్యులు హాజరుకానున్నారు.

ఇంటర్నెట్‌లో తప్పుడు వార్తలను గుర్తించవచ్చు

● గూగుల్ న్యూస్ ట్రైనర్ గోపగాని సప్తగిరి



సదస్సులో మాట్లాడుతున్న సప్తగిరి

కేయూ క్యాంపస్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో విస్తృతంగా విభృంభిస్తున్న తప్పుడు వార్తలను ఇంటర్నెట్‌లో సులభంగా గుర్తించవచ్చునని గూగుల్ న్యూస్ ఇనిషియేటివ్ ఫ్యాక్టు చెక్ ట్రైనర్, సీనియర్ జర్నలిస్టు గోపగాని సప్తగిరి స్పష్టం చేశారు. ఆదివారం కేయూ జర్నలిజం విభాగం సెమినార్ హాల్‌లో విభాగాధిపతి సంగాని మల్లేశ్వర్ అధ్యక్షతన 'ఫ్యాక్ట్ చెకింగ్ ఆఫ్ ఫేక్ న్యూస్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సప్తగిరి మాట్లాడుతూ.. తప్పుడు వార్తలపై వాస్తవాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సమాజంలో తప్పుడు వార్తలతో చాలా అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని వివరించారు. తప్పుడు వార్తలను గుర్తించేందుకు గూగుల్ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఫేక్‌న్యూస్‌ను కనిపెట్టడంతో పాటు వాటి మూలాలను ఎలా కనిపెట్టాలనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటర్నెట్ టూల్స్‌ను విద్యార్థులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కంజర్ల నరసింహ రాములు, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ శంకర్, డాక్టర్ చిరంజీవి, జర్నలిజం మొదటి, రెండో ఏడాది చదవుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లయన్స్ క్లబ్ లక్ష్యం



డయాబెటీస్ పరీక్షలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇ.కృపాకర్

హసన్‌పర్తి, నవంబర్ 10 (ఆంధ్ర జ్యోతి): ప్రజారోగ్యమే లయన్స్ క్లబ్ లక్ష్యమని లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి అధ్యక్షుడు ఇ.కృపాకర్ అన్నారు. మండల కేంద్రంలోని పద్మశాలి కాలనీలో లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో కాలనీ ప్రజలకు డయాబెటిస్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృపాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఆరోగ్యాన్ని మించి సంపద లేదని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రజలు గుర్తించి వ్యాయామం, ఆహార నియమాలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి ప్రధాన కార్యదర్శి నేదూనూరి కుమారస్వామి, కోశాధికారి బి.శేఖర్, జీఎల్‌టీ డాక్టర్ దివి అజిత్‌కుమార్‌తో పాటు క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

కాజీపేటలో కేటీఆర్‌కు స్వాగతం



కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

కాజీపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి కేటీఆర్‌కు ఆదివారం కాజీపేటలో బీఆర్ఎస్ శ్రేణుల ఘనంగా స్వాగతం పలికారు. బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి నార్లగిరి రమేశ్ ఆధ్వర్యంలో కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కాజీపేట నుంచి హనుమకొండ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గబ్బెట శ్రీనివాస్, ఎండీ అఫ్జల్, సుంచు కృష్ణ, పాలడుగుల శివ, సుంచు అశోక్, దువ్వ కనుకరాజ్, బెదరకోట రంజిత్, కోండ్ర శంకర్, మర్యాల కృష్ణ, కుమ్మరి రాజ్‌కుమార్ మహమూద్‌లు ఉన్నారు.

పరపతి సంఘాలతో సభ్యులకు ఆర్థిక భద్రత

శంభునిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరపతి సంఘాలు సభ్యులకు ఆర్థికంగా చేయూతనందించటమే కాకుండా సామాజిక భద్రతను కల్పిస్తాయని బీజేపీ జిల్లా నాయ కుడు, న్యూ విశ్వనాథ పొదుపు సంఘం డైరెక్టర్ కర్నె రవీందర్ అన్నారు. ఆదివారం రంగశాయి పేటలో గల జనతా పరపతి సంఘం అధ్యక్షు లు కేడల మల్లేశంతో పాటు జై హనుమాన్ సంఘం అధ్యక్షుడు పోశాల మల్లికార్జున్‌ను న్యూవిశ్వనాథ పరస్పర సహకార పొదుపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘం డైరెక్టర్లు కర్నె రవీందర్, కంది శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. సంఘాలు బలోపేతం కావాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘాల బాధ్యులు వలుపదాసు కృష్ణ, కత్తి సాంబయ్య, టీవీ రఘురాం, అనుమాండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరపతి సంఘం సమావేశం

కాశిబుగ్గ: వివేకానంద కాలనీ వెల్ఫేర్ సొసైటీ వారి పరపతి సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కోశాధికారి వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. డిఫాల్టర్ల నుంచి రావాల్సిన డబ్బులు వసూలు చేయడానికి ప్రత్యేక కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు దయాసాగర్, అధ్యక్షుడు కొమురయ్య, సభ్యులు సత్యనారాయణ, యాదగిరి, లింగమూర్తి, అనిల్ పాల్గొన్నారు.

విజ్ఞానమే హద్దుగా..

- నిట్‌లో ఆలోచింపజేసిన విద్యార్థుల ప్రదర్శనలు
- ముగిసిన టెక్నోజియాన్ - 24 వేడుక
- రెండు రోజుల్లో 30కి పైగా ఎగ్జిబిట్ల ప్రదర్శన
- చివరి రోజూ కొనసాగిన పలు ఈవెంట్లు
- తిరుగు ముఖం పట్టిన విద్యార్థులు



మెకానికల్ కిట్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

మెకానికల్ కిట్

మెకానికల్ ఇంజనీరింగ్ సొసైటీ ద్వారా నిర్వహించిన ఈ ఈవెంట్‌లో పాఠశాల విద్యార్థులు కూడా పాల్గొనడం విశేషం. ఇది మెకానికల్ ఇంజనీరింగ్ ప్రాథమిక సూత్రాలను అర్థం చేసుకోవడానికి ఎంతగానో దోహదపడింది. వివిధ విడి భాగాలను ఒక దగ్గర చేర్చడం, కూర్చడం, వాటి వినియోగాన్ని అర్థం చేసుకోవడం ఈ ఈవెంట్ లక్ష్యం.

హనుమకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన టెక్నోజియాన్-24 ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమం సాయంత్రం అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో జరిగింది. టెక్నోజియాన్‌లో పాల్గొనేందుకు దేశంలోని వివిధ జాతీయ సాంకేతిక కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ఇళ్లకు తిరుగు ముఖం పట్టారు. టెక్నోజియాన్ ద్వారా పొందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మూటగట్టుకొని తీపిగుర్తులతో మధుర జ్ఞాపకాలతో ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. రెండు రోజుల పాటు విద్యార్థులతో కళకళాడిన నిట్ క్యాంపస్ తిరిగి నిశ్శబ్ద ఒడిలోకి జారుకున్నది.

కొనసాగిన ఈవెంట్లు

రెండో రోజు ఆదివారం కూడా పలు ఈవెంట్లు కొనసాగాయి. మొదటి రోజు చేపట్టిన ఈవెంట్లు రెండోరోజు ముగిశాయి. ఇందులో విజేతలైన వారికి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను ఎప్పటికప్పుడు అందచేశారు. ఈవెంట్లు ముగిసిన తర్వాత వాటి ద్వారా తెలుసుకున్న కొత్త సాంకేతిక సమాచారాన్ని విద్యార్థులు బృందాలుగా ఏర్పడి సమీక్షించుకోవడం కనిపించింది. ఈవెంట్లలో విద్యార్థులు కనబరిచిన ప్రతిభాపాటవాలను ఎప్పటికప్పుడు రికార్డు చేశారు.

భవిష్యత్తులో ఈ సమాచారం ప్రయోగాల కొనసాగింపునకు దోహదపడుతుందని ఈవెంట్ టీమ్ లీడర్లు అభిప్రాయపడ్డారు.

చిన్నారుల హల్‌చల్

టెక్నోజియాన్‌లో చిన్నారులు హల్‌చల్ చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 30కిపైగా ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. వీటన్నిటికీ వరంగల్‌లోని క్రియేటివ్ రోబోటిక్ ఇన్‌స్టిట్యూట్ సారథ్యం వహించారు. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు తాము స్వయంగా రూపొందించిన పలు రోబోటిక్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. నిట్ విద్యార్థులను సైతం ఇవి ఆలోచింపచేశాయి. వీటిని టెక్నోజియాన్‌కు హాజరైన వివిధ రాష్ట్రాల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.



రివర్ క్లీనింగ్ బోట్

హనుమకొండ భట్టుపల్లిలోని ఎస్ ఆర్ స్కూల్‌లో ఆరోతరగతి చదువుతున్న మన్విత రివర్ క్లీనింగ్ బోట్ ను స్వయంగా రూపొందిం చింది. చెరువుల్లో పేరుకు పోయిన చెత్తాచె దారాన్ని ఈ బోట్ ద్వారా శుభ్రం చేయవచ్చు.

వండర్ కాస్మిక్

దీనిని నిట్ క్యాంపస్‌లోని ఆస్ట్రానమీ క్లబ్ నిర్వహించింది. ఖగోళశాస్త్రం, గ్రహాల చలనం తదితర అంశాలను అర్థం చేసుకోవడానికి ఇది ఎంతో దోహదపడింది. వీటితో పాటు స్పాట్ లైట్ ఈవెంట్‌గా ఈగేమ్స్ కూడా నిర్వహించారు. ఈ ఈవెంట్ ద్వారా విద్యార్థులు పలు కంప్యూటర్ గేమ్‌లలో పాల్గొన్నారు. వాహనాల ప్రదర్శన రెండో రోజు కూడా కొనసాగింది.

లాబ్రింత్



లాబ్రింత్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఈ ఈవెంట్ రెండోరోజు కూడా కొనసాగింది. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎలక్ట్రానిక్ అమెచ్యూర్స్ హెచ్ఎమ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఈవెంట్‌లో లేజర్ కిరణాలను తాకకుండా తప్పించుకుంటూ నిర్దీత గమ్యస్థానానికి చేరుకోవడం ప్రధానం. ఇందులో విజేతలైన వారికి బహుమతులు ఉంటాయి.

కమాండ్ బేస్డ్ కంట్రోల్



పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన రోబోటిక్ ఎగ్జిబిట్లలో కమాండ్ కంట్రోల్ బేస్డ్ రోబో విశేషంగా ఆకట్టుకున్నది. ఒక రోబోటిక్ జవాన్ బొమ్మను సెల్‌ఫోన్ ద్వారా బ్లూటూత్‌తో వాయిస్ ద్వారా నియంత్రించడం దీని ప్రత్యేకత. ప్రస్తుతం ఈ ఎగ్జిబిట్ ప్రాథమిక దశలో ఉన్న భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేస్తే పలు విధాలుగా ఉపయోగపడుతుందని విద్యార్థులు తెలిపారు.

ప్రొడక్ట్ లాంచ్

మేనేజ్‌మెంట్ స్టూడెంట్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఈవెంట్‌లో ఆయా ఉత్పత్తులను మార్కెట్‌లో ప్రవేశపెట్టడంలో చూపే నైపుణ్యాలను పరీక్షించారు. ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు ఉత్పత్తికి సంబంధించి సృజనాత్మకంగా ప్రకటనలు రూపొందించడం ట్యాగ్‌లైన్‌ను అభివృద్ధి చేయడం, ఉత్పత్తిని ఎలా ప్రారంభించాలో ప్రదర్శనతో మొదలైన అంశాలన్ని ఈ ఈవెంట్‌లో చూపారు.



ప్రొడక్ట్ లాంచింగ్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు



సెల్యూషన్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

సెల్యూషన్

టెక్నోజియాన్ చివరి రోజున నిర్వహించిన సెల్యూషన్ ఈవెంట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో దాదాపు అన్ని విభాగాలకు చెందిన టెకీలు, పాఠశాల విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. కొందరు వ్యక్తిగతంగా పాల్గొనగా మరికొందరు బృందాలుగా పాలుపంచుకున్నారు. వివిధ అంశాలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న జటిల సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం ఈ ఈవెంట్ ముఖ్య ఉద్దేశం.

రెండు రౌండ్లుగా దీనిని నిర్వహించారు. మొదటి రౌండ్‌లో సమస్యలతో కూడిన అంశంపై క్విజ్ నిర్వహించారు. రెండో రౌండ్‌లో సమస్యలకు పరిష్కారం చూపడం. విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సాంకేతికపరమైన అపరిష్కృత సమస్యలను ఈ ఈవెంట్‌లో నివేదించారు. వీటిలో కొన్నిటికి పరిష్కారాలు చూపగా మిగతా వాటిని రికార్డు చేశారు. వీటిని ఇందుకు సంబంధించి ప్రస్తుతం పరిశోధనలు చేస్తున్న వారికి పంపుతారు.



చాకోలెట్ డిస్‌పెన్సర్

చాకోలెట్ డిస్‌పెన్సర్ ఎగ్జిబిట్ సందర్శకులను బాగా ఆకర్షించింది. రెండు బాక్స్‌లు ఉంటాయి. ఇందులో ఒకటి కాయిన్ బాక్స్ రెండోది చాక్లెట్లు ఉన్న పెట్టె. కాయిన్ బాక్స్‌లో నాణం వేస్తే రెండు పెట్టె నుంచి చాక్లెట్ బయటకు వస్తుంది.

టెక్నోజియాన్ పట్ల విదేశీయుల ఆసక్తి

తెలుగులో మాట్లాడుతున్న సిరియా బాలిక

హనుమకొండ (ఆంధ్రజ్యోతి): టెక్నోజియాన్‌ను తిలకించేందుకు విదేశీయులు కూడా ఎంతో ఆసక్తి చూపారు. సిరియాకు చెందిన ముదార్.. తన ఇద్దరు పిల్లలతో టెక్నోజియాన్‌కు వచ్చారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన రోబోటిక్ ఎగ్జిబిట్లను, ఇతర సైంటిఫిక్ ఎగ్జిబిట్లను తిలకించారు. వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. తన పిల్లలకు కూడా వాటి గురించి తెలియచెప్పాడు. ముదాన్ వరంగల్ నిట్‌లో సోలార్ థర్మల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండలోని ప్రశాంత్ నగర్‌లో ఉంటున్నారు. వరంగల్ నిట్‌కు జాతీయ స్థాయిలో మంచిపేరున్నందు వల్లే పీహెచ్‌డీ చేయడానికి దీనిని ఎంచుకున్నానని చెప్పారు. పీహెచ్‌డీ కోసం తాను దరఖాస్తు చేసుకోగా మూడు జాతీయ సాంకేతిక కళాశాలలో అడ్మిషన్ లభించిందని, వాటిలో వరంగల్ నిట్‌నే ఎంచుకున్నానని తెలిపారు. నిట్‌లో విద్యా బోధన, పరిశోధన ప్రమాణాలు అంతర్జా తీయ స్థాయిలో ఉన్నాయని, క్యాంపస్ కూడా తనకు ఎంతో నచ్చిందని చెప్పారు. పీహెచ్‌డీ చేయడా నికి అనువైన వాతావ రణం ఇక్కడ ఉందని ప్రశంసలు కురిపించారు. ఏటా నిట్‌లో నిర్వహించే టెక్నోజియాన్ మిగతా నిట్, ఐఐటీలో కన్నా భిన్నంగా, ఉత్తమంగా ఉంటుందని పేర్కొన్నారు. తమ ఇద్దరు పిల్లలకు టెక్నోజియాన్‌లోని ఈవెంట్లు, ఎగ్జిబిట్లను చూపించేందుకు తీసుకువచ్చానని అన్నారు. కాగా, ముదాన్ ఇద్దరు పిల్ల లు తెలుగులో మాట్లాడడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ ఇద్దరు పిల్లల్లో అమ్మాయి రాండ్ మొదటి తరగతి చదువుతున్నది. రాండ్ మాట్లాడుతూ.. కాజీపేటలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్న తాను తెలుగులో మాట్లాడడం నేర్చుకున్నానని, తెలుగు సంప్రదాయం, సంస్కృతి ఇంటే ఎంతో ఇష్టమని ముద్దు ముద్దుగా తెలిపింది.



టెక్నోజియాన్‌కు తన పిల్లలతో వచ్చిన సిరియా దేశస్థుడు ముదార్

నిట్‌లో విద్యార్థుల సంబురాలు



అలరించిన డీజే నైట్ • చిందేసిన విద్యార్థులు

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన డీజే నైట్ ఆద్యంతం విద్యార్థులను ఉర్రూత లూగించింది. టెక్నోజియాన్-24 విజయవంతంగా ముగిసిన సందర్భంగా నిట్ క్యాంపస్‌లోని ఆడిటోరియం పార్కింగ్ స్థలంలో విద్యార్థులు డీజే నైట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన డీజే నైట్‌లో నిట్ విద్యార్థులు పాల్గొన్నారు. రాత్రి పొద్దుపోయే వరకు సాగిన ఈ సంగీత విభావరిలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాటలు పాడి డ్యాన్సులు చేశారు. డీజే సౌండ్‌తో క్యాంపస్ ప్రతిధ్వనించింది. గతంలో టెక్నోజియాన్‌లో భాగంగా రాత్రి ప్రో షోలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే వారు. ఈసారి భిన్నంగా టెక్నోజియాన్‌లో పూర్తిగా ఈ ఈవెంట్ల పైనే దృష్టి సారించారు. ప్రో షోలు నిర్వహించలేదు. దీంతో ఆదివారం టెక్నోజియాన్ ముగియడంతో విద్యార్థులే డీజే నైట్ పేరుతో సంబరాలు జరుపుకున్నారు.



మిర్చి రైతులకు అండగా..

» 'నల్ల తామర' నివారణకు యువ శాస్త్రవేత్తల పరిశోధనలు » విజయం సాధించిన మానుకోట జిల్లా వాసులు ప్రభాకర్, నరేంద్రకుమార్



త్రిప్ క్లియర్ గురించి నర్సారావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు వివరిస్తున్న యువ శాస్త్రవేత్తలు (ఫైల్)



రాష్ట్ర ఐటీ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేష్ రంజన్ నుంచి ఉత్తమ స్టార్టప్ అవార్డు అందుకుంటున్న ప్రభాకర్, నరేంద్రకుమార్ (ఫైల్)

- వారి పరిశోధనలకు చేయూతనిస్తున్న ప్రభుత్వం
- రైతులకు తక్కువ ధరకు అందేలా 'త్రిప్ క్లియర్' రూపకల్పన

నెల్లికుదురు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మిర్చి, మామిడి పంటల్లో వ్యాప్తి చెందే నల్లతామర, ఇతర వైరస్‌లతో రైతులు తీవ్ర నష్టాలు మూటగట్టుకుంటున్నారు. అనేక రకాల క్రిమిసంహారక మందులను పిచికారీ చేసినా.. పలు యాజమాన్య చర్యలు చేపట్టినా ఫలితం లేక దిగాలు చెందుతున్నారు. అలాంటి రైతులకు అండగా ఉంటున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు గాజుల ప్రభాకర్, పాపతోటి నరేంద్రకుమార్. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరికి చెందిన డాక్టర్ గాజుల ప్రభాకర్ (పీహెచ్‌డీ ప్లాంట్ సైన్సెస్), డోర్నకల్ మండలానికి చెందిన డాక్టర్ పాపతోటి నరేంద్ర కుమార్ (పీహెచ్‌డీ మైక్రోబయాలజీ) ఉస్మానియా యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఈ యువ శాస్త్రవేత్తలు నూతన ఆవిష్కరణలకు అనుగుణంగా అధ్యయనం చేస్తూ, పరిశోధనలే పరమావధిగా పెట్టుకొని రైతుల శ్రేయస్సు కోసం ఇప్పటి వరకు సుమారు 35 పరిశోధనలు చేసి విజయాలు సాధించి.. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. పేద రైతు కుటుంబాలకు చెందిన గాజుల ప్రభాకర్, పాపతోటి నరేంద్రకుమార్ తమ తల్లిదండ్రులు పంట సాగులో పడుతున్న కష్టాలు, చీడపీడలతో నష్టపోతున్న తీరును చూసి చలించిపోయారు. తమ తల్లిదండ్రుల్లా రైతులు కష్టాలు పడొద్దని, నష్టాలు మూటగట్టుకోవద్దన్న లక్ష్యంతో ప్రభుత్వం సహకారంతో మరెన్నో పరిశోధనలు చేస్తూ రైతులకు అండగా ఉంటామని భరోసానిస్తున్నారు.

పలు అవార్డులు.. ప్రోత్సాహకాలు

న్యూఢిల్లీలో బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ (బీఐఆర్ఏసీ) నుంచి రూ.50 లక్షల గ్రాంట్, కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఐఎఫ్‌సీఐ (ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) వెంచర్ క్యాపిటల్ స్కీం ద్వారా దేశవ్యాప్తంగా పరిశోధనలకు అందించే రూ.30 లక్షల ప్రాజెక్టుతో పాటు ఇటీవల రాష్ట్రప్రభుత్వం టీ స్పార్క్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ గ్రాంట్ రూ.10 లక్షలకు ఎంపికై గర్వకారణంగా నిలుస్తున్నారు. పంటల సాగులో రైతులు ఎదుర్కొనే సమస్యల గురించి పరిశోధనలు చేసే స్టార్టప్ సదస్సులో పాల్గొనగా దేశనలుమూలల నుంచి వచ్చిన స్టార్టప్‌లలో తమ పేరులోని అక్షరాలు కలిసొచ్చేలా ఏర్పాటు చేసిన 'శ్రీజీపీ' అవెల్స్‌కు ఉత్తమ స్టార్టప్ అవార్డు దక్కింది. దీంతో పాటు రూ.లక్ష ప్రోత్సాహక బహుమతిని తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్‌రంజన్ నుంచి అందుకున్నారు. రాష్ట్రప్రభుత్వం అందజేసిన నిధులతో ఉత్సాహంతో వివిధ రకాల ఆర్గానిక్ బయోపెస్టిసైడ్స్ ఉత్పత్తులను తయారు చేసి, రైతులకు అండగా ఉంటామంటున్నారు ప్రభాకర్, నరేంద్రకుమార్. కెమికల్ పెస్టిసైడ్‌ల వాడకం నిర్మూలించి బయోపెస్టిసైడ్స్ వాడటంతో ఆరోగ్య సమస్యలను అధికమించవచ్చని, అందుకు ఎకో ఫ్రెండ్లీ ప్రోడక్ట్‌లను తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేసే గ్రాంట్లతో పాటు 6 పుస్తకాలు ప్రచురించడంతో పాటు ఆరు పేటెంట్లను కూడా పొందామని వారు తెలిపారు.

సక్సెస్ స్టోరీ

రైతులకు తక్కువ ధరకే 'త్రిప్ క్లియర్'

నిరుపేద రైతుకుటుంబంలో జన్మించిన గాజుల ప్రభాకర్, పాపతోటి నరేంద్రకుమార్ రైతులు పడుతున్న కష్టాలను స్వయంగా చూశారు. అంతేకాదు కర్షకులు రసాయన ఎరువులు ఉపయోగించి పండించిన పంటల కారణంగా ప్రజలు అనేక రకాల ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ బారిన పడుతుండటాన్ని గుర్తించారు. ముఖ్యంగా రైతులను పీల్చిపిప్పి చేసే మిర్చిలో నల్లతామర పురుగు నివారణ కోసం అగ్రిహబ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, ఐకేపీ-నాలెడ్జ్ పార్క్ హైదరాబాద్ సాయంతో ఆర్గానిక్ బయోపెస్టిసైడ్ తయారీకి ఉపక్రమించి విజయం సాధించారు. తాము త్వరలో రైతులకు అందుబాటు ధరలో ఉండేలా 'త్రిప్ క్లియర్' అనే పేరుతో ఆర్గానిక్ బయో పెస్టిసైడ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వారు చెబుతున్నారు.

ప్రభాకర్ ప్రస్థానం..



మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరికి నిరుపేద కుటుంబానికి చెందిన గాజుల అంజయ్య-వెంకటమ్మ దంపతులకు నలుగురు సంతానం కాగా, మూడో సంతానంగా జన్మించిన ప్రభాకర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 7వ తరగతి వరకు చదివారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టేషన్ ఘన్‌పూర్‌లోని సోషల్ వేల్ఫేర్‌లో చదివి 2004లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్ సిటీ కళాశాలలో 2006-2009లో బీఎస్సీ (బీజెడ్‌సీ) పూర్తి చేసి.. 2013 వరకు ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఎస్సీ (బాటనీ), 2013 నుంచి 2020 వరకు ప్రొఫెసర్ కెశైలజ పర్యవేక్షణ పీహెచ్‌డీ పూర్తి చేశారు.

ఓయూలో నరేంద్రకుమార్ పీహెచ్‌డీ



డోర్నకల్ మండల కేంద్రానికి చెందిన పాపతోటి రంగారావు-శారద దంపతులకు నలుగురు సంతానం. అందులో మూడో సంతానమైన నరేంద్రకుమార్ డీడీహెచ్ఎస్‌లో (బిషప్ స్కూల్) 10వ తరగతి వరకు చదివారు. అనంతరం ఖమ్మంలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. 2005-2007లో జేఎన్‌టీయూహెచ్ ఎం.ఎస్సీ (మైక్రోబయోలజీ) చదివారు. 2007 నుంచి 2018 వరకు హైదరాబాద్ ఉస్మానియ యూనివర్సిటీలో ప్రొఫెసర్ అమీద పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

నిండు నూరేళ్ల బామ్మ..

- వందేళ్ల వయస్సుకు చేరువైన సాయమ్మ
- నేటికి ఆరోగ్యంతో ఉన్న వృద్ధురాలు



సాయమ్మ

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిండు నూరేళ్లు చల్లగా బతుకు అనే పదం చాలా మంది సందర్భాన్ని బట్టి వాడుతుంటారు.. కానీ అన్నేండ్లు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించడమంటే మాట లు కాదు. రోజురోజుకు మానవ జీవన గడుపు కల్తీ ఆహారం, బద్ధకం వల్ల నానాటికి తగ్గుతూ వస్తోంది. కానీ, ఓ బామ్మ సరిగ్గా వందేళ్లలో శనివారం అడుగుపెట్టింది. భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ గ్రామానికి చెందిన కారుకూరి సాయమ్మ. ఈమె భర్త రాజయ్య 35 ఏళ్ల కిందట మృతి చెందాడు. సాయమ్మకు కారుకూరి దుర్గయ్య, కారుకూరి పోషమల్లు అనే ఇద్దరు కుమారులు. కాగా, ఆమెకు మునిమనువళ్లు, మనువరాళ్ల బంధువులు మొత్తంగా 40 మంది రక్తసంబంధికులు ఉన్నారు. నేటికి సాయమ్మ మెత్తగా చేసిన అన్నాన్ని తింటుంది. ఎవరి సహాయం లేకుండా కూర్చుంటుండగా.. ఎవరైనా సహాయంగా పట్టుకుంటే నిల్చొని నడుస్తుంది. అయితే, సాయమ్మను చూసిన వారంతా ఆ రోజుల్లో తిన్న ఆహారం, చేసిన పనుల వల్లే ఇన్నేళ్లు జీవించడానికి కారణమంటూ చర్చించుకుంటున్నారు. ఆమెలో సగమైనా ఈ రోజుల్లో ఎవరైనా బతుకుతారో లేదోననే అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.

బైక్‌ల జోరు

- ప్రజా రవాణాలో ద్విచక్ర వాహనాలు టాప్
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వాటి సంఖ్య 5.73 లక్షలు

మట్టెవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ద్విచక్ర వాహనాల అమ్మకాలు వేగంగా దూసుకెళ్తున్నాయి. యువతీ, యువకులు, ఇంజనీరింగ్ విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు.. ఇలా అందరికీ ద్విచక్ర వాహనాలు అవసరం కావడంతో డిమాండ్ బాగా పెరిగింది. మధ్య తరగతి ప్రజలు, యువకులు, విద్యార్థులు కూడా వ్యక్తిగత వాహనాల కొనుగోళ్లకు ప్రాధాన్యతనిస్తున్నారు. బ్యాంక్‌లు, ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు ద్విచక్రవాహనాల కొనుగోళ్లకు రుణాలు ఇస్తుండడంతో కొనుగోలుదారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నెలకు వేల సంఖ్యలో వాహనాలు అమ్ముడుపోతున్నాయని రవాణాశాఖ లెక్కలు చెపుతున్నాయి. ప్రస్తుతం సగటున నెలకు వరంగల్, హనుమకొండ రవాణాశాఖ కార్యాలయంలో వెయ్యికిపైగా వాహనాలు రిజిస్టర్ అవుతున్నాయి. గ్రేటర్ పరిధిలో వాహన విక్రయాల్లో సింహభాగం ద్విచక్ర వాహనాలే ఉండడం విశేషం. కాగా, నగరంలో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించే వారి సంఖ్య 40 శాతానికి పైగా ఉన్నట్లు రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

హనుమకొండ జిల్లాలో 403 278, వరంగల్ జిల్లాలో 1,69, 555 ఉండగా, రెండు జిల్లాల్లో కలిపి 5,72,833 ఉన్నట్లు అధి కారులు తెలుపుతున్నారు.

యూత్‌జోష్


నగరంలో ఖరీదైన బైక్‌ల విక్రయాలు కూడా రోజురోజుకూ పెరుగుతున్నాయి. ధర కాదు.. స్టైలే ము ఖ్యం.. అంటూ రూ.1 లక్ష నుంచి రూ.3లక్షల వరకు విలువైన బైక్‌లను యువకులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు రాయల్ ఎన్‌ఫీల్డ్, హ్యార్లీ డేవిడ్‌సన్ బ్రాండ్‌లపై, స్పోర్ట్స్ బైక్‌లపై ఆదరణ చూపుతున్న యువకులు తాజాగా బీఎండబ్ల్యూ, డుకాటి బైక్‌లనే ఇష్టపడుతున్నారు. సంపన్న కుటుంబ యువకులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు స్పోర్ట్స్ బైక్‌లనే కొంటున్నారు.

ట్రాఫిక్ కష్టాలు

రోజు రోజుకూ ద్విచక్ర వాహనాల సంఖ్య పెరుగుతోంది. వరంగల్ జనాభాతో ద్విచక్ర వాహనాల సంఖ్య పోటీ పడుతోంది. ఫలితంగా నగరంలో ట్రాఫిక్ కష్టాలు కూడా మొదలయ్యాయి. వాహనాల సంఖ్య వేల నుంచి లక్షల్లోకి పెరిగినా రహదారుల విస్తరణ ఆ స్థాయిలో లేకపోవడంతో వరంగల్ చౌరస్తా, స్టేషన్ రోడ్, జేపీఎన్ రోడ్, ఎస్‌వీఎన్ రోడ్, ఆర్ఎస్‌టీ రోడ్, పోచమ్మ మైదాన్ జంక్షన్, నర్సంపేట రోడ్, ములుగురోడ్ జంక్షన్, హనుమకొండ తదితర ప్రధాన రహదారులపై ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి.



సంకల్పం



స్పందించే హృదయం

ఎప్పుడూ సమాజం నుంచి ఆశించడమేనా?
సమాజానికి మనం తిరిగి ఏమిస్తున్నాం?
ఈ ప్రశ్న బాల్యంలోనే ఆమెను ప్రభావితం చేసింది.
అది మొదలు... బడుగు జీవుల బతుకు బాగుకు...
మహిళా సాధికారతకే కాదు...
కాలుష్యం లేని ప్రకృతి కోసం... సహజ ఇంధన
వనరులను భావితరాలకు అందించడం కోసం...
నిరంతరం శ్రమిస్తున్నారు.
నిస్వార్థ సేవలకు గానూ ఇటీవలే 'సరోజినీనాయుడు
అంతర్జాతీయ అవార్డు' అందుకున్న సామాజిక కార్యకర్త,
పర్యావరణవేత్త, అమెరికాలో తెలుగు పారిశ్రామికవేత్త...
సుస్మిత ముసునూరు అంతరంగం ఇది.



"చుట్టూ ఉన్న మనుషులు, వాళ్ల స్థితిగతులు... ఊహ తెలిసినప్పటి నుంచీ సామాజిక అంశాలతోనే ముడిపడింది నా జీవితం. వయోధికులకు చదువు చెప్పడం, ఎయిడ్స్ బాధితులకు అండగా నిలవడం, మహిళలకు వృత్తి విద్యలు నేర్పడం... ఇలా వారి అభ్యున్నతికి తోడ్పాటునిచ్చేందుకు నావంతు కర్తవ్యం నిర్వర్తిస్తున్నాను. పర్యావరణ పరిరక్షణలో భాగమయ్యాను. దశాబ్దాలుగా సాగుతోంది ఈ ప్రయాణం. వీటన్నిటికీ గుర్తింపుగా ఇటీవల ప్రతిష్ఠాత్మక 'డాక్టర్ సరోజినీనాయుడు అంతర్జాతీయ అవార్డు' అందుకున్నాను. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో అత్యున్నత సేవలు అందించిన మహిళలకు ఏటా ఈ పురస్కారం ఇస్తారు. 'చాంబర్ ఆఫ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ, ఇంటర్నేషనల్ ఉమెన్స్ ఫిలిమ్ ఫోరమ్, ఏఏఎఫ్‌టీ యూనివర్సిటీ' సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తున్నాయి.

అది ఉంటే చాలు...

నేనూ అందరిలాంటి అమ్మాయినే. కాకపోతే మన చుట్టూ ఉన్నవారు బాధలు పడుతుంటే మనకెందుకులే అని వదిలేయలేను. నాలో 'నేను' అనే ఆలోచన తక్కువ. 'మనం' అనే భావన కొంచెం ఎక్కువ. స్పందించే హృదయం ఉంటే చాలు... ఎవరైనా ఈమాత్రం సాయం చేయగలరనేది నా అభిప్రాయం. అయితే ఇవాళ చాలామందిలో 'నేను, నా కుటుంబం బాగుంటే చాలు' అనే ధోరణి గమనించాను. నా ఈ అవార్డు అలాంటివారిలో కొంతైనా మార్పు తీసుకురాగలిగితే... సమాజానికి మేలు జరిగినట్టే.

అప్పుడే మొదలైంది...

నాలో ఈ సేవా దృక్పథం రావడానికి కారణం... నేను పెరిగిన నేపథ్యం. మా అమ్మమ్మావాళ్లది గుంటూరు. అక్కడే



పుట్టాను. అయితే పెరిగిందంతా హైదరాబాద్‌లో. మా పెద్దమ్మ, పిన్నీవాళ్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వయోజన విద్య విభాగాల్లో పని చేసేవారు. ఆ వాతావరణంలో పెరిగాను కదా... నాకు ఎనిమిదేళ్లు వచ్చేసరికి మా చుట్టుపక్కల ఉన్న పెద్దవారికి చదువు చెప్పేదాన్ని. కాలేజీకి వచ్చేసరికి వయోజన విద్య తదితర ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగమయ్యాను. డిగ్రీలో ఉండగా ఎయిడ్స్ బాధితుల కోసం పని చేశాను. అప్పట్లో ఒక కుర్రాడు ఆత్మహత్య చేసుకున్నాడు. అతడిని చూసేందుకు ఆసుపత్రికి వెళితే... ఒకే డిస్పోజబుల్ ఇంజక్షన్ సూదిని చాలా మందికి ఉపయోగించడం కనిపించింది. ప్రభుత్వం ఇచ్చిన డిస్పోజబుల్ నీడిల్స్ స్టాక్‌ను బయట అమ్మేసుకుంటున్నారు. ఎయిడ్స్ లాంటి వైరస్‌ల వ్యాప్తికి ఇలాంటి దారుణాలే కారణం. తమకు వైరస్ ఎలా సోకిందో తెలుసుకోకుండా చాలామంది ఆత్మహత్యలు చేసుకునేవారు. దీనిపై సరైన అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో పలు కార్యక్రమాలు తలపెట్టాను. ఆశ్చర్యమేమంటే... మా లెక్చరర్లు నిరుత్సాహపరిచినా, మా తరగతిలో అమ్మాయిలందరూ ముందుకు వచ్చారు. ఎప్పుడైతే ఆడపిల్లలు కదిలారో... అప్పటి నుంచి అబ్బాయిలు కూడా మాతో జత కలిశారు.

అమెరికా వెళ్లినా...

డిగ్రీ అవ్వగానే ఎంబీఏ కోసం అమెరికా వెళ్లాను. తరువాత అక్కడే స్థిరపడ్డాను. మావారిది ఐటీ రంగం. దాదాపు పాతికేళ్లుగా యూఎస్‌లోనే నా నివాసం. అయితే తరచూ భారత్‌కు వచ్చి వెళుతుంటాను. అక్కడ సంపాదించినదాంట్లో అత్యధిక భాగం ఇక్కడి సేవా కార్యక్రమాల కోసమే ఖర్చు చేస్తున్నా. అమెరికాలో ప్రస్తుతం నాకు 'మిడ్‌వెస్ట్ గ్రీన్‌టెక్' కంపెనీ ఉంది. సౌర, పవన విద్యుత్ ఉపకరణాలకు సంబంధించిన సంస్థ ఇది. 2001లో ఐటీ సంస్థగా ప్రారంభమైన మా కంపెనీ, కాలక్రమంలో ఇలా మారింది.

భావితరాల కోసం...

నేను ఈ రంగంలోకి రావడానికి ఒక ముఖ్యమైన కారణం ఉంది. నాకు మొదటి నుంచీ పర్యావరణంపై ప్రేమ ఎక్కువ. భారత్‌లో కొన్ని గ్రామాలు దత్తత తీసుకుని, వాటిల్లో వేల మొక్కలు నాటాను. చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూనే, అవి లేకపోతే సంభవించే దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్నాను. పెట్రోల్, బొగ్గు వంటి శిలాజ ఇంధనాలను భవిష్యత్ తరాలకు లేకుండా మనం విచ్చలవిడిగా వాడేస్తున్నాం. జల, వాయు, సౌర తదితర ప్రత్యామ్నాయ ఇంధనాలు మనకు విస్తారంగా అందుబాటులో ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకొని, శిలాజ ఇంధనాలను పొదుపు చేస్తే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడతాయి. ఈ ఆలోచనతోనే నేను 'మిడ్‌వెస్ట్ గ్రీన్‌టెక్' కంపెనీ నెలకొల్పాను.

ఆస్తులు ఇవ్వకపోయినా పర్లేదు...

నా లక్ష్యం గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడం. ఇప్పటికే చూస్తున్నాం... ఢిల్లీ కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. భూగోళాన్ని నాశనం చేస్తున్నది ఎవరో కాదు... మానవులు మాత్రమే. మన విధ్వంసంతో మంచు పర్వతాలు కరిగిపోతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. భవిష్యత్తు తరాలకు మనం ఆస్తులు ఇవ్వకపోయినా పరవాలేదు... కానీ ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని ఇవ్వగలగాలి. అదే వారికి పెద్ద వరం అవుతుంది. దాని కోసమే నేను సోలార్, విండ్, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్‌కు ప్రాధాన్యమిస్తున్నా. అమెరికాతో పాటు భారత్‌లో కొన్ని గ్రామాలను దత్తత తీసుకున్నా.

మహిళా సాధికారత...

ఏ ఆధారం లేని పిల్లలకు విద్య, అట్టడుగు వర్గాల మహిళల సాధికారతకు నిరంతరం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. వీధుల్లో, రైల్వే స్టేషన్ల దగ్గర కాగితాలు ఏరుకొంటూ, బిచ్చమెత్తుతూ కనిపించిన చిన్నారులకు రెసిడెన్షియల్ స్కూల్ ఒకటి ఏర్పాటు చేశాం. తల్లితండ్రులు లేని కొందరు పిల్లలను దత్తత తీసుకున్నాను. వాళ్లకు నేనే అమ్మను. 'మాకూ అమ్మ ఉంది' అని నన్ను చూసినప్పుడు వాళ్ల ముఖంలో కనిపించే ఆనందం వెల కట్టలేనిది. నాతో ఎంతో ఆప్యాయంగా ఉంటారు. అలాగే మహిళలకు కుట్టు పనిలాంటివి కాకుండా డిమాండ్ ఉన్న మగ్గం వర్క్ నేర్పించాను. దానివల్ల ఒక చీరను నాలుగైదు రోజుల్లో తయారు చేయవచ్చు. ఆర్థిక స్థోమత లేని చాలామంది అమ్మాయిలను కాలేజీల్లో చేర్పించాను. పైచదువుల కోసం కొందరిని విదేశీ వర్సిటీలకు పంపించాను. వీటన్నిటికీ నా సొంత డబ్బు ఖర్చు చేశాను. ఎవరి నుంచీ చందాలు తీసుకోలేదు. అంతేకాదు... నేను హెర్బల్ రీసెర్చ్ అవీ చేస్తుంటాను. కరోనా సమయంలో నానో టెక్నాలజీతో అభివృద్ధి చేసిన మెడిసిన్‌ను వ్యాపార కోణంలో కాకుండా... ఇక్కడ ఉచితంగా ఇచ్చాను. దీని కోసం మూడేళ్లు పూర్తిగా భారత్‌లోనే ఉన్నాను.

నాలానే మా అమ్మాయి...

నిజానికి నాకు పిల్లలు వద్దనుకున్నాను. ఎందుకంటే ఎంతోమంది అనాథ పిల్లలను చేరదీస్తున్నా. వారంతా నా పిల్లలే కదా. 'ఇంతమందిని దత్తత తీసుకొనే అవకాశం ఉన్నపుడు మళ్లీ నేను పిల్లల గురించి ఎందుకు ఆలోచించాలి' అనుకున్నాను. కానీ మా అమ్మానాన్నలు, పెద్దలు 'నీకు అక్కర్లేకపోతే మాకు ఇవ్వు. మాకూ మనవళ్లు, మనవరాళ్లతో ఆడుకోవాలని ఉంటుంది కదా' అన్నారు. అలా మా అమ్మాయి దీక్ష పుట్టింది. విశేషమేమంటే ఇప్పటివరకు మా అమ్మాయిని బడికి పంపలేదు. ఒకవేళ స్కూలుకు వెళ్లివుంటే తనను వదిలేసి నేను ఇలా తరచూ భారత్‌కు వచ్చి వెళ్లగలిగేదాన్ని కాదు. దీక్షది కూడా నాలానే... స్పందించే హృదయం. వండర్ కిడ్‌గా ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందింది. ఎనిమిదేళ్లకే టెన్త్ పరీక్షలు రాసింది. ప్రస్తుతం తనకు పన్నెండేళ్లు. ఇంటర్ చదువుతోంది. సేవ చేసే అవకాశం నాకు దొరికిన ఒక మంచి అవకాశం అయితే... దీక్ష పుట్టడం దేవుడు ఇచ్చిన వరం."

● హనుమా

చంపుతామని బెదిరించినా...

అప్పట్లో యాదగిరిగుట్ట ప్రాంతంలో చిన్నారులను బలవంతంగా వేశ్య వృత్తిలోకి దించుతున్న వారిపై పోరాడాను. అక్కడికి వెళ్లి, వీడియోలు తీసి, వాటిని పోలీసులు, సంబంధిత అధికారులకు ఇచ్చేదాన్ని. కళాశాలల విద్యార్థులను కలుపుకొని, మానవహారాలు, ధర్నాలవంటివి నిర్వహించాం. నన్ను చంపుతామని బెదిరింపులు, హెచ్చరికలు చాలా వచ్చాయి. వేటికీ బెదరలేదు. చిన్న పిల్లలు... ఎక్కడికీ వెళ్లలేక, తమ ముఖం ఎవరికీ చూపించలేక వేదన అనుభవించేవారు. అవన్నీ తలుచుకొంటే నాకు ఇప్పటికీ నిద్ర పట్టదు. మొత్తంమీద మా ప్రయత్నం ఫలితాన్నిచ్చింది. కొన్నిటిని కోర్టు సుమోటోగా తీసుకుంది. పోలీసులు, అధికారులు, కోర్టుల సహకారంతో చాలా మంది బాలికలకు విముక్తి లభించింది.

మీకు తెలుసా!



ఇవి ఔషధాలు...

మన వంటింట్లో అనాదిగా ఉపయోగిస్తున్న అద్భుత పదార్థం పసుపు. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, యాంటీఇన్‌ఫ్లమేటరీ కాంపోనెంట్స్ అధిక మొత్తంలో ఉంటాయి. మొటిమలు, వాటివల్ల ఏర్పడే మచ్చలు, వృద్ధాప్యపు ఛాయలు, సొరియాసిస్ వంటి అనేక చర్మ సమస్యలకు ఔషధంలా పని చేస్తుంది. రోజూ వంటల్లోనే కాకుండా పాలల్లో కూడా పసుపు వేసుకొని తాగితే మంచి ఫలితాలుంటాయి.

తులసిలో విటమిన్ కె, యాంటీఆక్సిడెంట్స్ అధికం. ఇది రక్తప్రసరణను ప్రేరేపించి జుత్తు పెరగడానికి ఉపకరిస్తుంది. ఇందులో యాంటీబ్యాక్టీరియల్, యాంటీఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు చర్మంపై నల్లమచ్చలు, మొటిమలు, ఇన్‌ఫెక్షన్లు తగ్గించడంలో దోహదపడతాయి.

చర్మ సంబంధిత ఇన్‌ఫెక్షన్లను నియంత్రించడంలో వేప ఆకు బాగా ఉపయోగపడుతుంది. చర్మంపై మంట తగ్గిస్తుంది. వేప కలిపిన నీటితో స్నానం చేస్తే ఎన్నో చర్మ వ్యాధులను దూరంగా పెట్టచ్చు. వేపలో యాంటీబ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీవైరల్ లక్షణాలు అధికం.

కళ్లపై ఒత్తిడి... ఇలా తగ్గిద్దాం..!

ఇటీవల కాలంలో పిల్లలు డిజిటల్ తెరల నుంచి చూపు తిప్పడంలేదు. దీనివల్ల కళ్లపై విపరీతమైన ఒత్తిడి పడుతోంది. ఈ పరిస్థితి సుదీర్ఘ కాలం కొనసాగితే నిద్రలేమి వంటి సమస్యలెన్నో తలెత్తుతాయని అంటున్నారు నిపుణులు. కళ్లు అలసటకు గురికాకుండా కొన్ని సూచనలు చేస్తున్నారు.

- డిజిటల్ తెరలను వీక్షిస్తున్నప్పుడు ఆ గదిలో మంచి వెలుతురు ఉండేలా చూసుకోవాలి. అంటే స్క్రీన్ బ్రైట్‌నెస్- రూమ్ లైటింగ్‌ల మధ్య పెద్దగా వ్యత్యాసం లేకుండా జాగ్రత్తపడాలి. మరో ముఖ్య విషయం ఏమిటంటే... మీ పిల్లలు గాడ్జెట్స్‌ను చీకట్లో ఉపయోగించకుండా చర్యలు తీసుకోండి. అలాగే స్క్రీన్‌పై వేరే లైట్ రిఫ్లెక్షన్లు పడకుండా చూడండి.



- కంప్యూటర్, ట్యాబ్, మొబైల్... ఏది చూస్తున్నా వాటి స్క్రీన్‌కి పిల్లల కళ్లకి మధ్య కనీసం ఒకటిన్నర నుంచి రెండు అడుగుల దూరం ఉండాలి. స్క్రీన్ టాప్ వారి కళ్లకు సమాంతర ఎత్తులో పెట్టాలి. దీనివల్ల మీ పిల్లలు స్క్రీన్ చూడడానికి తల అటూ ఇటూ తిప్పి ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు.
- చుట్టుపక్కల పరిసరాలకు తగినట్టుగా స్క్రీన్ బ్రైట్‌నెస్‌ను ఎడ్జెస్ట్ చేయండి. మరీ డార్క్‌గానో... మరీ లైట్‌గానో ఉండకూడదు. స్పష్టంగా కనిపించడానికి కాంట్రాస్ట్‌ను సరి చేయండి. దీనివల్ల కళ్లకు శ్రమ తగ్గుతుంది.
- కంప్యూటర్ స్క్రీన్ మీద ఆబ్జెక్ట్ కానీ, అక్షరాలు కానీ కనిపించీ కనిపించనట్టు ఉండకూడదు. చూడగానే స్పష్టంగా ఉండేలా ఫాంట్ సైజ్ పెంచుకోండి. అవసరమైతే జూమ్ ఆప్షన్‌ని ఉపయోగించండి.
- డిజిటల్ తెరల నుంచి వచ్చే బ్లూ లైట్ మీ పిల్లల నిద్రకు భంగం కలిగిస్తుంది. ముఖ్యంగా నిద్రపోయే ముందు గాడ్జెట్స్‌ని ఉపయోగించడంవల్ల ఈ సమస్య మరింత వేధిస్తుంది. సాయంత్రం వేళల్లో మొబైల్స్, ట్యాబ్‌లు చూసే సమయాన్ని తగ్గించి, గాడ్జెట్స్‌ని నైట్ మోడ్‌లో పెట్టడం వల్ల కొంత ప్రయోజనం ఉంటుంది.

హెల్త్



మధుమేహాన్ని నియంత్రించాలంటే..

రోజూ మనం తీసుకునే ఆహారం నుంచి శరీరం గ్లూకోజ్‌ను గ్రహించి శక్తిగా మారుస్తుంది. ఇందుకు క్లోమగ్రంథి ఉత్పత్తి చేసే ఇన్సులిన్ సహాయం చేస్తుంది. ఇన్సులిన్ సరిగా ఉత్పత్తి కాకపోయినా, ఉత్పత్తి అయినదాన్ని శరీరం ఉపయోగించుకోకపోయినా రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగి మధుమేహం వస్తుంది. శారీరక వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి, సమయానికి నిద్రపోకపోవడం, మద్యపానం తదితర కారణాలవల్ల మధుమేహం బారిన పడే అవకాశం ఉంది. దీని లక్షణాలు, ఇది రాకుండా వుండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం!

లక్షణాలు

- తరచూ మూత్ర విసర్జన, విపరీతమైన ఆకలి, ఎప్పుడూ నీరసంగా ఉండడం, అధిక దాహం, శరీరంపై గాయాలు మానకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చిగుళ్ల వ్యాధులు, చర్మ వ్యాధులు, కంటి చూపు మందగించడం, పాదాల నొప్పులు కూడా ఉంటాయి.

జాగ్రత్తలు

- ఫైబర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారపదార్థాలు, ప్రోటీన్స్ ఎక్కువగా ఉండే బీన్స్, పప్పు ధాన్యాలు, కొవ్వు తక్కువగా ఉండే పదార్థాలు, కార్బోహైడ్రేట్స్ తక్కువగా ఉండే జామకాయ, పుచ్చకాయ, బొప్పాయి, నారింజలను తీసుకోవాలి. ఆకుకూరలు, చిరుధాన్యాలు, బాదాం, వాల్‌నట్స్ తప్పకుండా తినాలి. అప్పుడే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. వారానికి రెండు సార్లు ఉపవాసం మంచి ఫలితాన్నిస్తుంది. ఒకేసారి ఎక్కువగా తినకుండా తక్కువ పరిమాణంలో ఎక్కువసార్లు తినడం ప్రయోజనకరం.
- చక్కెర, బెల్లంతో చేసిన పదార్థాలు, తేనె, కొబ్బరినీళ్లు, అరటి, మామిడి, సపోటా, సీతాఫలం, ద్రాక్ష, పనస పండ్లను తినకూడదు.
- నేచురల్ ఇన్సులిన్‌గా పనిచేసే తిప్పతీగ రసం, మునగ ఆకు టీ, వేప ఆకు రసం, అశ్వగంధ ఆకుల రసం, కలబంద రసం తీసుకోవడం వల్ల కూడా మధుమేహాన్ని నియంత్రణలో ఉంచవచ్చు.

నవ్విస్తూనే నిలదీస్తారు



సమస్యలపై నిలదీయడం శ్వేతా మంత్రి నైజం. వైకల్యంతో ఉన్నవారి ఇబ్బందుల గురించి గట్టిగా మాట్లాడినందుకు ఆమె అవహేళనలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇప్పుడు అవే మాటలకు హాస్యాన్నీ, వ్యంగ్యాన్నీ జోడించి... స్టాండప్ కమెడియన్‌గా ప్రేక్షకుల్లో ఆలోచనలు రేకెత్తిస్తున్నారు.

"మార్పునకు హాస్యం కూడా ఒక సాధనంగా ఉపయోగించవచ్చనే ఆలోచన నాకు రావడానికి ముందు... ఎన్నో వైఫల్యాలను భరించాను. వైకల్యాలతో ఉన్న వ్యక్తులు ఎదుర్కొనే సమస్యలను, సవాళ్లను వివరిస్తూ ఒక చిత్రాన్ని తీశాను. అది ఆదరణ పొందలేదు సరికదా... నేను అవహేళనలు ఎదుర్కోవాల్సి వచ్చింది. "ప్రతిదానికీ ప్రభుత్వం మీదో, అధికారుల మీదో, సమాజం మీదో ఫిర్యాదులు ఎందుకు చేస్తారు? మీకు అందుబాటులో ఉన్న వనరుల్ని వినియోగించుకొని బాగుపడండి" అని ఒక అధికారి నా ముఖం మీదే అన్నారు. ఎంతో అవమానంగా అనిపించింది. ఇక మా బాధలు ఎవరితో చెప్పుకోవాలనే నైరాశ్యం ఆవరించింది.

ఆ ప్రశ్న వేధించింది...

మా సొంత ఊరు మహారాష్ట్రలోని పుణే. నేను 'స్పైనా బైఫిడా' అనే సమస్యతో పుట్టాను. దీనివల్ల వెన్నెముక సరిగ్గా అభివృద్ధి కాదు. నా పరిస్థితి చూసి తల్లడిల్లిన నా తల్లితండ్రులు ఎన్నో ఆసుపత్రులకు తిరిగారు. శస్త్రచికిత్సలు, ఫిజియో థెరపీ చేయించారు. అప్పటివరకు నిలబడలేకుండా ఉన్న నేను క్రచెస్ ఉపయోగించి నడిచే స్థితికి వచ్చాను. నాకు ఏడేళ్ళు వచ్చేవరకూ ఎవరో ఒకరు నన్ను ఎత్తుకొని తీసుకువెళ్ళి, బడిలో దించి వచ్చేవారు. ఆ తరువాత ఆటోలో కష్టపడి నన్ను ఎక్కించాల్సి వచ్చేది. అక్కడ దిగాక తోటి విద్యార్థుల సాయంతో తరగతి గదిలోకి వెళ్ళేదాన్ని. శారీరకంగా, మానసికంగా అది ఎంతో బాధగా అనిపించేది. కానీ చదువంటే నాకు ఇష్టం కాబట్టి ఓర్చుకున్నాను. కాలేజీకి వచ్చాక... మావాళ్ళు నాకు ఎలక్ట్రికల్ చైర్ కొన్నారు. కానీ తరగతి గదివరకూ దాన్ని నడిపించుకు వెళ్ళే సదుపాయం లేదు. అక్కడే కాదు, వైకల్యంతో ఉన్న వారికి అనువుగా ఉండే సౌకర్యాలు చాలా చోట్ల ఉండేవి కావు. 2007లో మమ్మల్ని రాజస్థాన్ టూర్‌కు తీసుకువెళ్ళారు. పాశ్చాత్య శైలిలో ఉండే టాయిలెట్లు ఆఖరికి హైవేల మీద ఉన్న ధాబాల్లో సైతం ఉండడం చూసి ఆశ్చర్యపోయాను. వాటి యజమానులను అడిగితే... "అవి విదేశీయుల కోసం" అని చెప్పారు. వేరే దేశాల నుంచి వచ్చేవారికోసం చేసే ఇలాంటి ఏర్పాట్లను వికలాంగుల కోసం దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు ఎందుకు చెయ్యకూడదనే ప్రశ్న నన్ను వేధించింది. అదే కొన్నేళ్ళ తరువాత... చక్రాల కుర్చీకే పరిమితమైన నా స్నేహితుడు విశాల్ సావంత్ తో కలిసి 'గివ్ సమ్ స్పేస్' అనే ప్రాజెక్ట్ ప్రారంభించడానికి నాంది పలికింది. నిధులు సేకరించి పుణేలోని ప్రధాన ప్రాంతాల్లో, పుస్తకాల దుకాణాలు, రెస్టారెంట్లు, విద్యా సంస్థల్లో చక్రాల కుర్చీలతో వెళ్ళడానికి వీలుగా ర్యాంప్‌లు ఏర్పాటు చేశాం.

కొత్త పద్ధతిలో చెప్పాలనుకున్నా...

వైకల్యాలు ఉన్నవారి సమస్యలను సమాజానికి అర్థమయ్యేలా చెప్పాలనే తపనతో... 2014లో ఒక చిత్రాన్ని తీశాను. పలు చోట్ల ప్రదర్శించాను. కానీ నేను ఆశించిన స్పందన రాకపోగా... వ్యతిరేకతను, అవమానాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. దానితో మళ్ళీ అలాంటి ఆలోచన చెయ్యలేదు. మా ప్రాజెక్టుకు, వివిధ సంస్థలతో భాగస్వామ్యానికి పరిమితమయ్యాను. కానీ 2016లో జరిగిన ఒక ప్రమాదంతో కొన్నాళ్ళు ఇంట్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో అప్పటివరకూ సాగిన నా ప్రయాణాన్ని, విజయాలను, వైఫల్యాలను సమీక్షించుకున్నాను. సమాజానికి నేను చెప్పాలనుకున్నది కొత్త పద్ధతిలో వినిపించాలనుకున్నాను. దానికోసం స్టాండప్ కామెడీని ఎంచుకున్నాను. కోలుకున్న తరువాత పుణేలో మొదటి ప్రదర్శన ఇచ్చాను. వైకల్యంతో ఉన్న ఒక మహిళ స్టాండప్ కామెడీ చేయడాన్ని జనం ఆమోదించడం కష్టం. నా మాటలతో వారికి హాస్యాన్ని అందిస్తూనే... వికలాంగుల పట్ల వారికి ఉన్న బాధ్యతను కూడా తెలియజేయాలి. నాలాంటి వారి మీద జాలికే పరిమితం కాకుండా... బహిరంగ ప్రదేశాల్లో వారు మరింత సౌకర్యవంతంగా ఉండేలా ఏం చేయగలం? అనే ఆలోచన కలిగించాలి. మళ్ళీ ఇదంతా పాఠం చెబుతున్నట్టో, నిష్ఠూరం ఆడుతున్నట్టో, బతిమాలుతున్నట్టో, నిందిస్తున్నట్టో ఉండకూడదు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని నా స్క్రిప్ట్ రాసుకున్నాను. నా ప్రదర్శనకు మంచి స్పందన వచ్చింది. పలు క్లబ్‌లు, కేఫ్‌ల నుంచి ఆహ్వానాలు వెల్లువెత్తాయి.

వదులుకున్నవే ఎక్కువ...

ఇప్పటివరకూ 300కు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. కానీ వదులుకున్నవి అంతకన్నా ఎన్నో రెట్లు ఉన్నాయి. ఎందుకంటే నా ఎడమ కాలు సరిగ్గా పనిచెయ్యదు. ఫిజియోథెరపీ ద్వారా 20 నుంచి ముప్ఫై శాతం కదల్చగలుగుతున్నాను. కానీ కదలిక ఇప్పటికీ నాకు సమస్యే. ఇది వరకు నేను లెగ్ బ్రేసెస్ లేకుండా ఏడు నిమిషాలు నిలబడగలిగేదాన్ని. ఇప్పుడు ఒక్క నిమిషమే నిలబడగలుగుతున్నాను. ఇక, నాకున్న ఆరోగ్య సమస్య వల్ల తరచూ వాష్‌రూమ్‌కు వెళ్ళాల్సి వస్తుంది. సరైన మౌలిక సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బంది మరింత పెరుగుతోంది. అందుకే 'ప్రదర్శన ఇచ్చే వేదికకు వాష్‌రూమ్ దగ్గరగా ఉందా? ఎన్ని మెట్లు ఎక్కాలి? వేదికను చేరడానికి ఎంత సేపు పడుతుంది?' అనే విషయాలనే ముఖ్యంగా పరిగణనలోకి తీసుకుంటాను."



ఆదాయంలో అధిక శాతం వారికే...

ప్రదర్శనల ద్వారా నాకు వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగాన్ని వికలాంగుల సౌకర్యాల కోసం ఖర్చు చేస్తున్నాను. అలాగే నా ప్రేక్షకులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తున్నాను. వైకల్యాలు ఉన్నవారికి నేను చెప్పగలిగేది ఏమిటంటే... ఎలాంటి పరిస్థితి ఎదురైనా కుంగిపోకండి. మీ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోండి. మీదైన అస్తిత్వాన్ని సృష్టించుకోండి. నిర్భయంగా మాట్లాడండి. నిజం అని నమ్మినదాన్ని జంకు లేకుండా చెప్పండి. వేరొకరిలా ఉండాలని ప్రయత్నించకండి. వైకల్యాలు దాదాపుగా మన జీవితాంతం మనతోనే ఉంటాయి. ఈ సత్యాన్ని ఆమోదించాలి. మన హక్కులు సాధించుకోవడానికి నిరంతరం పోరాడుతూనే ఉండాలి."

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. భూల్ భులాయా (భూల్ భులాయా3)
3. ఆయీ నై (స్త్రీ-2)
4. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
5. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
6. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
7. జా రాంఝున్ (దో పత్తీ)
8. అపనా బనాలే (బేడియా)
9. మిలియనీర్ (గ్లోరీ)
10. తైనూ ఖబర్ నహీ (ముంజ్యా)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

'స్థానిక' ప్రజాప్రతినిధులకు పింఛన్ ఇవ్వాలి

- జాతీయ పంచాయతీరాజ్ చాంబర్ డిమాండ్
- చాంబర్ జాతీయ అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలు, ఎంపీల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రభుత్వాలు వారికి కల్పిస్తున్నట్టే స్థానిక ప్రజాప్రతినిధులకు పింఛన్ సౌకర్యాన్ని కల్పించాలని జాతీయ పంచాయతీరాజ్ చాంబర్ రెండు రాష్ట్రాల సంయుక్త సమావేశం డిమాండ్ చేసింది. ఖమ్మంలో జరుగుతున్న చాంబర్ సంయుక్త సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సమావేశంలో చాంబర్ జాతీయ అధ్యక్షుడిగా యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్ (ఏపీ), జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పుసులూరి నరేందర్ (తెలంగాణ), జాతీయ ఉపాధ్యక్షుడిగా చింపుల సత్యనారాయణరెడ్డి, ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో గత సర్పంచులు చేసిన గ్రామాభివృద్ధి పనులకు బిల్లులు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, తక్షణమే ఆ బిల్లులను చెల్లించాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకూ ఓటు హక్కు కల్పించాలని తీర్మానించారు.

ఒవైసీ బ్రదర్స్ 'మహా' ప్రచారం

- మహారాష్ట్రలో 16 స్థానాల్లో మజ్లిస్ పోటీ

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఆయన సోదరుడు, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ముస్లిం మైనారిటీ ఓటుబ్యాంకు అధికంగా ఉన్న 16 స్థానాల నుంచి మజ్లిస్ బరిలో ఉంది. 2019 ఎన్నికల్లో 35 చోట్ల పోటీ చేసి, మాలేగావ్ సెంట్రల్, ధూలే సిటీ నియోజకవర్గాలను కైవసం చేసుకుంది. గత ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా సాధించిన ఓట్ల శాతాన్ని బేరీజు వేసుకుని, ఈ సారి 16 చోట్ల తమ అభ్యర్థులను బరిలోకి దింపింది. వీటిల్లో కనీసం 10 స్థానాల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో ఒవైసీ సోదరులు తమ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు.

కాగితాలకే పరిమితమైన 'టీప్రైమ్'

- పథకం అమలుకు మార్గదర్శకాలను ఖరారు చేయాలి
- టెక్‌టీప్ డిమాండ్

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన టీ-ప్రైమ్ పథకం అమలుకు మార్గదర్శకాలను ఖరారు చేయాలని తెలంగాణ చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ (టెక్‌టీప్) వ్యవస్థాపక డైరెక్టర్ అబూ ఫతేసయ్యద్ బందగి బాషా రియాజ్ ఖాద్రీ డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరేళ్ల క్రితం ప్రకటించిన టీప్రైమ్ స్కీమ్ కేవలం కాగితాలకే పరిమితమైందని ఆయన పేర్కొన్నారు. దళితుల తరహాలోనే మైనారిటీ వర్గాల్లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని టెక్‌టీప్ చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి పంపిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

ఓహియో గవర్నర్ సలహాదారుగా ఖమ్మం మహిళ


రామసహాయం రాధిక

ఖమ్మంటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ఓహియో రాష్ట్ర గవర్నర్ సలహాదారుగా తెలుగు మహిళ రామసహాయం రాధిక నియమితులయ్యారు. ఖమ్మం నగరానికి చెందిన బుచ్చిరెడ్డి- నిర్మల దంపతుల పెద్ద కుమార్తె రాధిక 2006లో గద్వాల్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం వివాహం చేసుకొని భర్త రఘురాంరెడ్డితో కలిసి అమెరికా వెళ్లారు. అక్కడ వివిధ కంపెనీల్లో ఆమె ఉన్నత హోదాల్లో పనిచేశారు. నేషన్‌వైడ్ కంపెనీ సాఫ్ట్‌వేర్ డైరెక్టర్‌గా రాధిక బాధ్యతలు నిర్వర్తించారు. ఈనెల 8న ఓహియో రాష్ట్ర గవర్నర్ మైక్ డివైన్‌కు మైనారిటీ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ సలహాదారుగా నియమితులయ్యారు.


సిద్దిపేట జిల్లా పొట్లపల్లిలో నీరా తాగుతున్న సంజయ్

కమీషన్ల కోసం రైతుల బలి

ధాన్యం సేకరణలో సర్కారు నిర్లక్ష్యం.. బోనస్ ఎగ్గొట్టేందుకు కొనుగోలు ఆలస్యం: సంజయ్

శంకరపట్నం/భీమదేవరపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్రోకర్ల నుంచి కమీషన్లు దండుకునేందుకు రైతుల ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం బలి చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. బోనస్ పైసలివ్వకుండా తప్పించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకుండా జాప్యం చేస్తోందని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలను నేటికీ పూర్తిగా ప్రారంభించకపోవడం దారుణమన్నారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంజయ్ ఆదివారం సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం వడ్లకు క్వింటాకు రూ.2,300కు పైగా చెల్లిస్తోందని.. దీనికి రూ.500 బోనస్ చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని చెప్పారు. ఈ సీజన్‌లో 50 లక్షల టన్నుల సన్న వడ్లకు రూ.500 చొప్పున రూ.2,500 కోట్ల బోనస్ చెల్లిస్తామని ప్రగల్భాలు పలికిందన్నారు. ఇప్పటి వరకు రైతులకు నయా పైసా బోనస్ ఇవ్వలేదని మండిపడ్డారు. బోనస్ సంగతి దేవుడెరుగు..? కొనుగోళ్లు లేక విసిగిపోయిన రైతన్నలు ఇప్పటికే 20 లక్షల టన్నుల వడ్లను మిల్లర్లకు అమ్ముకున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన తర్వాత కాంగ్రెస్ సర్కారు విజయోత్సవాలు జరుపుకోవాలని చెప్పారు. రాష్ట్రంలోని ఆలయాలపై వరుస దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేవాలయాలపై దాడులు చేస్తున్న వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

రాకేశ్‌కు వైద్య ఖర్చులు అందిస్తా..

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లికి చెందిన వికలాంగ విద్యార్థి గూళ్ల రాకేశ్ వైద్యానికి అయ్యే ఖర్చులను భరిస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు. గతంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాకేశ్‌పై వచ్చిన కథనంపై సంజయ్ స్పందించారు. ఆదివారం రంగయ్యపల్లిలో రాకేశ్‌ను కలిసి మాట్లాడారు. అతడికి త్రిచక్ర వాహనాన్ని అందిస్తానని చెప్పారు. అలాగే గ్రామంలో ఇటీవల పిడుగుపడి పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరిగిన ఓ కుటుంబాన్ని సంజయ్ పరామర్శించారు.

బీసీలకు కాంగ్రెస్ వెన్నుపోటు

ఒక్క హామీనీ అమలు చేయలేదు.. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు పెట్టాలి: కేటీఆర్

వరంగల్/సిరిసిల్ల/యాదగిరిగుట్ట రూరల్/హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీలను వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. ఏడాది కిందట కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఓట్ల కోసం దొంగ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఒక్క బీసీ డిక్లరేషన్ హామీ అయినా అమలు చేసిందా? అని ప్రశ్నించారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన పూర్తయిన తరువాత, బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తాము కులగణనను సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని చెప్పారు. 42% రిజర్వేషన్లు అమలు చేయాలని ఇంటింటి సర్వేకు వచ్చే అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో తెలంగాణ రైతులకు పంటపై బోనస్ రూ.500లు ఇస్తున్నామని రేవంత్‌రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఏ ఒక్క రైతుకైనా రూ.500ల బోనస్ ప్రభుత్వం ఇచ్చినట్లు నిరూపిస్తే తాము రాజీనామాలకు సిద్ధమని సవాల్ చేశారు. ఒక్క బీసీకైనా వడ్డీ లేని రూ.10లక్షల రుణం ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఐదేళ్లలో బీసీల సంక్షేమం కోసం ఏటా రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. తొలి ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.8వేల కోట్లే ప్రకటించిందని, అవికూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని విమర్శించారు. సర్పంచులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని ఆందోళన చేస్తుంటే దుర్మార్గంగా అరెస్టులు చేయటం ఏమిటని ప్రశ్నించారు. బీసీ వెల్ఫేర్‌తో పాటు ఎంబీసీలకు మరో మంత్రిత్వశాఖను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, తన క్యాబినెట్‌లో 18మంది మంత్రులను భర్తీ చేసుకునే చేతకాని సీఎం రేవంత్‌రెడ్డి అని, కొత్త మంత్రిత్వశాఖను ఏర్పాటు చేస్తా.. అంటే ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. దళిత బంధు నిధులు ఇవ్వాలని అడిగితే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడులు చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, అబద్ధాల సీఎంను బీఆర్ఎస్ తరుపున నిలదీస్తూనే ఉంటామన్నారు. ప్రభుత్వం ఏం సాధించిందని విజయోత్సవాలకు ఏర్పాటు చేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలపైన తాము కూడా వారోత్సవాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బాంబుల శాఖ ఇచ్చారేమో.. ఆయన రోజుకో బాంబు పేల్చుతానంటున్నారని, ఆ బాంబు కాంగ్రెస్ మంత్రుల్లో ఎవరిపైన పేలుతుందో అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.


హనుమకొండలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నేను సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఉండటం ఇబ్బందిగా ఉంటే రాజీనామా చేస్తా

'ఎంతమంది నేత కార్మికులు చనిపోతే ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి బుద్ధి వస్తుంది. ఎంతమంది ఆత్మహత్యలు చేసుకుంటే సిగ్గువస్తుంది. భేషజాలు వదిలిపెట్టు. సిరిసిల్లలో నేను ఎమ్మెల్యేగా ఉండడం ఇబ్బంది ఐతే, ఇక్కడి ప్రజలపై ప్రేమ కలగడం లేదంటే రేపే ఎమ్మెల్యే పదవిని వదిలేస్తా' అని కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేటలో ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికుడు బైరి అమర్, స్రవంతి దంపతుల కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ముగ్గురు పిల్లలను అనాథలు చేసి యువ జంట ఆత్మహత్య చేసుకోవడం ఎవరికైనా కన్నీళ్లు పెట్టించే పరిస్థితి అన్నారు. ఈ ముగ్గురు పిల్లలను తాను చదివిస్తానని, పార్టీ తరఫున అండగా ఉంటామని చెప్పారు. నేతన్న కడుపు కొట్టినట్లు.. పగబట్టినట్లు బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్‌లు, రంజాన్, క్రిస్మస్‌కు అందించే కానుకలు రద్దు చేసి సిరిసిల్లలో నేత కార్మికులకు పనిలేక పొట్టగడవని పరిస్థితులు తీసుకొచ్చారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలని డిమాండ్ చేశారు. మరోవైపు.. 'వచ్చేది మన ప్రభుత్వమే, అన్ని పథకాలు యథావిధిగా కొనసాగుతాయని' కేటీఆర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఆయనకు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి వద్ద మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న చొల్లేరుకు చెందిన తోటకూరి వెంకటమ్మ అనే వృద్ధురాలితో కేటీఆర్ ముచ్చటించారు. పింఛన్లు, రైతు భరోసా వంటి పథకాలు అందుతున్నాయా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడగ్గా.. ఏం ప్రభుత్వమో ఏమో సారూ.. రైతుభరోసా, పింఛన్లు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆమె చెప్పారు. దీంతో స్పందించిన కేటీఆర్.. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ సీఎం అవుతారని, ఇబ్బందులన్నీ తొలగిపోతాయన్నారు. కాగా, కాంగ్రెస్ పాలన చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా చేపట్టాల్సింది విజయోత్సవాలు కాదని.. కుంభకోణాల కుంభమేళా అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎనుముల వారి ఏడాది ఏలికలో.. తెలంగాణ బతుకు చీలికలు, పీలికలేనని.. కోలుకోలేని విధ్వంసం సృష్టించి విజయోత్సవాలా అంటూ 'ఎక్స్' వేదికగా ఆయన ప్రశ్నించారు.



సీఎం అబద్ధాలను ఖండిస్తున్నాం

- మహారాష్ట్రలో ఏ పార్టీకి ప్రచారం చేయం
- హామీల అమలుపై చర్చకు సిద్ధమా?: హరీశ్

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇక్కడ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చిందంటూ మహారాష్ట్ర ప్రజలను సైతం మభ్యపెడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. అక్కడి ప్రజలకు సీఎం చెప్పిన అబద్ధాలను ఖండిస్తున్నామన్నారు. ఆదివారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహారాష్ట్రలో బీఆర్ఎస్ పార్టీకి గ్రౌండ్ ఏర్పాటు చేసుకోలేదు కాబట్టి.. అక్కడి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయడం లేదని పేర్కొన్నారు. అదే సమయంలో ఏ పార్టీకి కూడా అనుకూలంగా కానీ.. వ్యతిరేకంగా కానీ.. అక్కడికి వెళ్లి బీఆర్ఎస్ తరఫున ప్రచారం చేయబోమన్నారు. రైతుందరికీ రుణమాఫీ చేశామంటూ సీఎం రేవంత్ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిడ్డారు. కాంగ్రెస్ అధికారిక వెబ్‌సైట్‌లో అబద్ధాలు పెట్టారని.. తెలంగాణలో అమలు చేయని పథకాలను సైతం గొప్పగా అమలు చేస్తున్నట్లు మహారాష్ట్ర పత్రికల్లో ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. హామీల అమలుపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని సీఎంకు సవాల్ విసిరారు. మహారాష్ట్రలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడమే కాకుండా.. తెలంగాణ డబ్బులను అక్కడికి తరలిస్తున్నారని ఆరోపించారు. సీఎం ఎన్నికల ప్రచారంలో ఉంటూ.. మంత్రులు కొందరు ఇతర రాష్ట్రాలకు, మరికొందరు విదేశీ పర్యటనల్లో బిజీగా ఉండి పాలనను గాలికి వదిలేశారని ఆయన విమర్శించారు.

నవ్య | చిత్రజ్యోతి

పల్లెటూరి ప్రేమకథ

'మేం ఫేమస్' చిత్రంతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ కథానాయకుడిగా కొత్త చిత్రం ప్రారంభమైంది. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. నిధి ప్రదీప్ కథానాయికగా పరిచయం అవుతున్నారు. జగపతి బాబు, రాజీవ్ కనకాల కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఆదివారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ మొదలైంది. ముహూర్తం షాట్‌కు హీరో శ్రీవిష్ణు క్లాప్ ఇచ్చారు. సురేశ్‌బాబు కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, మహేశ్‌బాబు పి. గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ను



యూనిట్‌కు అందించారు. నిర్మాత సునీల్ నారంగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ 'యూత్‌ఫుల్ మ్యూజికల్ రొమాంటిక్ కామెడీగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. గోదావరి ప్రాంతంలోని పల్లెల అందాలను తెరపైన అద్భుతంగా ఆవిష్కరించబోతున్నాం. త్వరలో భీమవరంలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం' అని తెలిపారు. ఇదో పల్లెటూరి ప్రేమకథ, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి నాగవంశీ కృష్ణ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సాయిసంతోష్.

వాస్తవ సంఘటనలతో...



నూతన నటీనటులతో తెరకెక్కుతున్న చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. టైటిల్‌ను ప్రకటించి, దర్శకుడు మారుతి చేతుల మీదుగా ఫస్ట్‌లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. ధర్మ, ఐశ్వర్యశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధాన తారాగణం. సంగీతం: శ్రీ వసంత్, సినిమాటోగ్రఫీ: ప్రశాంత్ అంకిరెడ్డి



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల జతకడుతున్నారు. 'పుష్ప 2-ది రూల్' చిత్రంలో వీరిద్దరి కాంబినేషన్‌లో స్పెషల్ సాంగ్ చిత్రీకరిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మేకర్స్ అధికారికంగా విడుదల చేశారు. 'పుష్ప'లో అల్లు అర్జున్- సమంతపై చిత్రీకరించిన 'ఊ అంటావా మామా ఊఊ అంటావా' సాంగ్ జాతీయ స్థాయిలో పాపులర్ అయింది. ఇప్పుడు తాజాగా 'పుష్ప 2' లో చిత్రీకరిస్తున్న ఈ మాసివ్ నెంబర్ దానికి మించి ఉండబోతోందని చిత్రబృందం తెలిపింది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, రవిశంకర్ వై. నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం ప్రమోషన్స్‌ను పాట్నా, కోల్‌కతా, చెన్నయ్, కొచ్చి, బెంగళూరు, ముంబై, హైదరాబాద్‌లో నిర్వహించబోతున్నారు. ప్రస్తుతం చివరి దశ చిత్రీకరణతోపాటు నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి.

కొత్త లుక్‌లో కనువిందు



శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నాగార్జున, ధనుష్ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'కుబేర'. రష్మిక మందన్న హీరోయిన్. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం ఒక పోస్టర్‌ని విడుదల చేసింది. ముంబై మహాసముద్రం బ్యాక్‌డ్రాప్‌లో అందమైన చిరునవ్వుతో రష్మిక ఆ పోస్టర్‌లో కనిపించారు. మూవీకి సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ని ఈనెల 15న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇప్పటికే సినిమాలోని మూడు కీలక పాత్రలను మూడు వేర్వేరు వీడియోలు, పోస్టర్ల ద్వారా మేకర్స్ పరిచయం చేశారు. ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న క్యారెక్టర్ల బ్యాక్‌డ్రాప్‌ని క్రియేటివ్‌గా ప్రెజెంట్ చేస్తూ విడుదల చేసిన దీపావళి స్పెషల్ పోస్టర్‌కు మంచి స్పందన లభించింది.

కంగువలో సింగర్‌గా




నటిగా శ్రద్ధాదాస్‌కి మంచి పేరుంది. గాయనిగా ఆమె ప్రేక్షకులను అలరించబోతున్నారు. సూర్య కథానాయకుడిగా నటించిన 'కంగువ' చిత్రంలో శ్రద్ధాదాస్ కథానాయికగా నటించారు. ఈ సినిమాలో 'యోలో' అంటూ సాగే ఓ మంచి హుషారైన గీతాన్ని శ్రద్ధా దాస్ ఆలపించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చడంతో పాటు శ్రద్ధాదాస్, సాగర్‌తో కలిసి ఆలపించారు. రాకేందు మౌళి సాహిత్యాన్ని అందించారు. 'కంగువ' చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది.

అదిరే కలయిక కుదిరేనా?



బాలీవుడ్ వర్గాలు చెబుతున్నది నిజమైతే ఓ అరుదైన కలయికకు రంగం సిద్ధమైనట్లే. టాలీవుడ్ సంచలన దర్శకుడు నాగ్ అశ్విన్, అగ్రకథానాయిక అలియాభట్ కలయికలో ఓ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కబోతోందనే వార్త హిందీ మీడియాలో ప్రముఖంగా వినిపిస్తోంది. నాగ్ అశ్విన్ మహిళా ప్రాధాన్య కథతో ఓ పాన్ ఇండియా చిత్రం చేయాలనుకుంటున్నారని, ఈ చిత్రాన్ని కూడా వైజయంతి మూవీస్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నదని ఆ వార్తల సారాంశం. నాగ్ అశ్విన్ తన తర్వాతి చిత్రం కోసం ఒక శక్తిమంతమైన మహిళ కథను సిద్ధం చేశారట. భావోద్వేగాలను అలవోకగా పండించగల అలియా అయితే ఈ పాత్రకు న్యాయం చేయగలుగుతారని ఆయన భావించారట. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌పై అలియా, నాగ్‌అశ్విన్ మధ్య చర్చలు జరుగుతున్నాయట. త్వరలోనే అధికారిక ప్రకటన రావొచ్చని చెబుతున్నారు. అలియా ప్రస్తుతం సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తున్న 'లవ్ అండ్ వార్'తో పాటు 'ఆల్ఫా' చిత్రంలో నటిస్తున్నారు. ప్రభాస్‌తో 'కల్కి 2898 ఏడి' చిత్రం రెండో భాగాన్ని నాగ్ అశ్విన్ సెట్స్‌పైకి తీసుకెళ్లాల్సి ఉంది.

తమిళ నటుడు ఢిల్లీ గణేశ్ కన్నుమూత



తమిళ చిత్రపరిశ్రమకు చెందిన సీనియర్ నటుడు ఢిల్లీ గణేశ్ (80) శనివారం రాత్రి చెన్నైలో కన్నుమూశారు. వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యల కారణంగా గత కొంతకాలంగా బాధపడుతున్న ఆయన స్థానిక రామాపురంలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం ఉదయం ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు జరగనున్నాయి. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ తదితర భాషల్లో 400లకు పైగా చిత్రాల్లో నటించిన ఢిల్లీ గణేశ్.. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కమెడియన్‌గా, విలన్‌గా, హీరోగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా రాణించారు. అగ్ర నటుడు కమల్ హాసన్ ఆస్థాన నటుల్లో ఢిల్లీ గణేశ్ ఒకరు. తిరునల్వేలికి చెందిన ఢిల్లీ గణేశ్.. సినిమాల్లోకి రాకముందు ఢిల్లీలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉన్నతోద్యోగిగా వున్నారు. నటనపై ఉన్న ఆసక్తితో ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసి, సినీపరిశ్రమలోకి అడుగు పెట్టారు. ఆయన అసలు పేరు గణేశన్ మహదేవన్. కె.బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన 'పట్టిన ప్రవేశం' చిత్రంలో ఆయన తొలిసారి వెండితెరపై కనిపించారు. ఆయన నటించిన చివరి చిత్రం కమల్ హాసన్ నటించిన 'ఇండియన్-2'. మెగాస్టార్ చిరంజీవి, కన్నడ నటుడు విష్ణువర్ధన్‌కు చెందిన తమిళ చిత్రాలకు ఆయనే డబ్బింగ్ చెప్పారు. 1981లో తమిళంలో కె.బాలచందర్ దర్శకత్వంలో చిరంజీవి నటించిన '47 నాట్కల్', 1990లో ఘన విజయం సాధించిన 'జగదేకవీరుడు అతిలోకసుందరి' తమిళ వెర్షన్ (కాదల్ దేవదై) చిత్రానికి డబ్బింగ్ చెప్పారు. అలాగే, విష్ణువర్ధన్ నటించి 1980లో విడుదలైన 'మళలై పట్టాలం' చిత్రానికి ఆయన డబ్బింగ్ చెప్పారు. ఢిల్లీ గణేశ్ మృతి పట్ల సీఎం స్టాలిన్, అగ్రహీరోలు రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్, సూర్య, కార్తీ, శివకార్తికేయన్‌లతో పాటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నడిగర్ సంఘం నిర్వాహకులు తమ ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

కొత్తగా..

అమ్మనవ్వాలని నాకూ ఉంది



సమంత ప్రధాన పాత్ర పోషించిన 'సీటాడెల్: హనీబన్నీ' వెబ్‌సిరీస్ ఇటీవలే విడుదలై ప్రేక్షకాదరణ పొందిన విషయం తెలిసిందే. ఆ సిరీస్‌లో సమంత తన బిడ్డను కాపాడుకునేందుకు అరాచక శక్తులతో పోరాడే శక్తిమంతమైన తల్లిపాత్రలో ఆకట్టుకున్నారు. ఆ సిరీస్‌లో తను పోషించిన తల్లి పాత్ర గురించి సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'తెరపైనే కాదు నిజ జీవితంలోనూ అమ్మగా పిల్లల ఆలనా పాలనా చూసి మురిసిపోవాలనుందని ఆమె తన మనసులో మాట చెప్పారు. 'పిల్లలతో గడపడం నాకు చాలా ఇష్టమైన విషయం. మాతృత్వాన్ని ఆస్వాదించే విషయంలో నాకంటూ కొన్ని కలలు ఉన్నాయి. తల్లినవ్వాలని నాకూ ఉంది. పిల్లలను ప్రేమ ఆప్యాయతలతో పెంచాలనే కోరిక ఉంది. అయితే అమ్మనయ్యే విషయంలో ఇప్పటికే ఆలస్యం అయిందని నేను అనుకోవడం లేదు' అని సమంత అన్నారు. మయోసైటిస్ వ్యాధి పూర్తిగా నయం కాకపోయినా చాలా వరకూ కోలుకున్నట్లు సమంత చెప్పారు.

కొత్త తేదీన రిలీజ్



అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో అశోక్ గల్లా, వారణాసి మానస హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. సోమినేని బాలకృష్ణ నిర్మాత. ముందుగా ఈ చిత్రాన్ని ఈనెల 14న విడుదల చేయాలని మేకర్స్ భావించారు. అయితే, విడుదల తేదీని మార్చారు. ఈనెల 22న ప్రేక్షకుల ముందుకు మూవీని తీసుకురానున్నట్లు మేకర్స్ తెలిపారు.

ఏ రోజైతే చూశానో...



'చెక్, బుర్రకథ' తదితర చిత్రాల్లో బాలనటుడిగా నటించిన భరత్ రామ్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ ప్రేమకథా చిత్రానికి 'ఏ రోజైతే చూశానో నిన్ను' అనే టైటిల్‌ను నిర్ణయించారు. రాజు బోనగాని దర్శకత్వం వహిస్తున్నారు. ఇనావర్స్ సినిమా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ప్రస్తుతం మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి.



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లే ముందు (జూన్ 5న) సునీత



సెప్టెంబరు 24న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఆమె ఫొటో

అంతరిక్షంలో చిక్కి..


న్యూయార్క్, నవంబరు 10: ఐదు నెలల క్రితం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లి అక్కడే చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతావిలియమ్స్ (59) ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది! వెళ్లేటప్పుడు ఆరోగ్యంగా కనిపించిన సునీత.. సెప్టెంబరు 24న తీసిన ఫొటోల్లో బాగా బరువు తగ్గిపోయి, బక్కచిక్కిపోయి, బుగ్గలు పీక్కుపోయి.. పదేళ్ల వయసు పైబడినట్టుగా కనిపిస్తుండడం గమనార్హం. ఈ ఏడాది జూన్ 5న ఆమె స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. షెడ్యూలు ప్రకారం జూన్ 14నే ఆమె తిరిగి రావాల్సి ఉంది. కానీ, వ్యోమనౌకలో హీలియం లీకేజీ వల్ల తిరుగుప్రయాణం సాధ్యం కాలేదు. స్పేస్‌ఎక్స్ వ్యోమనౌకలో వచ్చే ఫిబ్రవరిలో ఆమెను భూమికి తీసుకురానున్నట్టు నాసా ప్రకటించింది. ఆమె ఆరోగ్యంగానే ఉన్నట్టు నాసా ప్రకటన చేసినప్పటికీ.. నానాటికీ క్షీణిస్తున్న ఆమె ఆరోగ్యాన్ని బాగు చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. నాసాలోని విశ్వసనీయ వర్గాలు వెల్లడించినదాని ప్రకారం.. వ్యోమగాములు రోదసిలో ఉండగా నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన హైక్యాలరీ ఆహారాన్ని ఆమె తీసుకోలేకపోతున్నారని తెలుస్తోంది. ఎక్కువకాలంపాటు రోదసిలో ఉంటే.. ఆ ప్రభావం వ్యోమగాముల ఆరోగ్యంపై పడుతుంది. పురుషులతో పోలిస్తే మహిళా వ్యోమగాముల ఆరోగ్యంపై ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. బరువు కోల్పోవడం, కండరాలు దెబ్బతినడం, ఎముకలు బోలుగా మారడం వంటి సమస్యలతో బాధపడతారు. ప్రస్తుతం సునీత కోల్పోయిన బరువును తిరిగి పొంది, మునుపటిలా ఆరోగ్యంగా ఉండాలంటే.. రోజుకు 3,500 నుంచి 4000 క్యాలరీల ఆహారం తినాలని నాసా వర్గాల సమాచారం.



ముద్దు బొమ్మతో.. పెళ్లై ఆరేళ్లు!

ఒకరి తర్వాత ఒకరు.. వరుసగా ఏడుగురు అమ్మాయిలు ఛీ కొడితే ఏమవుతుంది? ఈ కాలం కుర్రాళ్లు.. 'అది పోతే ఇంకోతొస్తది' అని లైట్ తీస్కుంటారు!! కానీ, జపాన్‌కు చెందిన అకిహికో కొండో అనే ఈ వ్యక్తిని ఏడుగురు అమ్మాయిలు ఛీకొడితే.. ఇదుగో ఇలా ఓ కార్టూన్ క్యారెక్టర్‌ని పెళ్లి చేసుకుని ప్రశాంతంగా సెటిలైపోయాడు. ఇటీవలే తమ ఆరో వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకొని ఆ ఫొటోలను ఇన్‌స్టాలో పెట్టి పాపులర్ అయిపోయాడు!!







చైనా తయారుచేసిన హైపర్‌సానిక్ విమానం

7 గంటల్లో భూప్రదక్షిణ!

శబ్దానికి నాలుగురెట్ల వేగంతో వెళ్లే విమానం

"ఎనభై రోజుల్లో భూప్రదక్షిణ".. ఎప్పుడో విమానాలు లేని రోజుల్లో, 1872లో ప్రఖ్యాత ఫ్రెంచ్ రచయిత జూల్స్‌వెర్న్ రాసిన కాల్పనిక నవల పేరు ఇది! ఆయన ఆ నవల రాసిన వందేళ్ల తర్వాత.. శబ్దం కన్నా ఎక్కువ వేగంతో (సూపర్‌సానిక్) ప్రయాణించే కంకార్డ్ విమానాలు గాల్లో ఎగిరాయి. 1986 నవంబరులో బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన ఓ కంకార్డ్ విమానం.. 29 గంటల 59 నిమిషాల్లో భూప్రదక్షిణం చేసింది. ఇప్పుడు వాటినిమించి.. శబ్దవేగానికి ఐదు రెట్ల (హైపర్‌సానిక్) వేగంతో ప్రయాణించే విమానాల తయారీకి కృషి జరుగుతోంది. చైనాకు చెందిన 'స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్' కంపెనీ ఇటీవలే ఆ దిశగా ఒక అడుగు ముందుకు వేసింది. శబ్దానికి నాలుగు రెట్ల వేగంతో ప్రయాణించే విమానాన్ని తయారుచేసింది. దాదాపుగా గంటకు 5 వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ విమానంలో భూప్రదక్షిణ చేయడానికి జస్ట్ 7 గంటలు పడుతుందంతే!!

\- న్యూయార్క్

శబ్దానికి ఐదు రెట్లు, అంతకుమించిన (మ్యాక్ 5) వేగంతో ఖండాలు దాటి దూసుకెళ్లి లక్ష్యాలను ఛేదించే హైపర్ సానిక్ క్షిపణులు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయిగానీ.. అతి తక్కువ సమయంలో సుదూరతీరాలకు ప్రయాణికులను తీసుకెళ్లే వాణిజ్య హైపర్‌సానిక్ విమానాలు మాత్రం చాలాకాలంగా ప్రయోగాల దశలోనే ఉన్నాయి. చైనాకు చెందిన 'స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్ (ఈ కంపెనీ చైనా నామధేయం.. 'లింకాంగ్ టియాన్షింగ్ టెక్నాలజీ')' సంస్థ ఆ దిశగా ఒకడుగు ముందుకు వేసినట్టు 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' వార్తాసంస్థ ఇటీవల ఒక కథనాన్ని వెలువరించింది. ఈ కంపెనీ తయారుచేసిన వాణిజ్య విమాన నమూనా శబ్దానికి నాలుగు రెట్ల వేగాన్ని సాధించినట్టు అందులో పేర్కొంది. శబ్దవేగం గంటకు 1234.8 కిలోమీటర్లు. దానికి నాలుగు రెట్లంటే.. దాదాపుగా గంటకు 5 వేల కిలోమీటర్లు. లండన్ నుంచి న్యూయార్క్‌కి కంకార్డ్ (సూపర్‌సానిక్) విమానంలో అయితే 2 గంటల 53 నిమిషాల సమయం పట్టేది. ఈ విమానంలో అయితే గంటన్నరలో వెళ్లిపోవచ్చు. అలాగే.. లండన్ నుంచి సిడ్నీకి ప్రస్తుతం అందుబాటులో ఉన్న విమానాల్లో అయితే సుమారుగా 22 గంటల సమయం పడుతుంది. అదే ఈ చైనా కంపెనీ తయారుచేసిన విమానంలో అయితే కేవలం నాలుగు గంటల లోపే పడుతుందన్నమాట. ఈ విమానం 2027 నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని అంచనా. అన్నట్టు.. ఈ విమానికి సదరు చైనా కంపెనీ పెట్టిన పేరు యున్షింగ్. అంటే వరుగుతీయడం అని అర్థం. ఒక్క చైనా కంపెనీయేకాదు.. అమెరికాకు చెందిన వీనస్ ఏరోస్పేస్ కంపెనీ.. 'స్టార్‌గేజర్' అనే హైపర్‌సానిక్ విమానాన్ని అభివృద్ధి చేస్తోంది. 2030 నాటికి అందుబాటులోకి వచ్చే ఈ విమానం.. మ్యాక్ 9 (శబ్దవేగానికి 9 రెట్లు) వేగంతో ప్రయాణిస్తుందని, ఢిల్లీ నుంచి లండన్‌కు కేవలం గంటలో వెళ్లిపోతుందని (ఇప్పుడు 9 నుంచి 10 గంటలు పడుతోంది) దాని రూపకర్తలు చెబుతున్నారు. అంటే.. సరదాగా మధ్యాహ్న భోజనం వేళకు తాజ్‌మహల్‌ని సందర్శించి సాయంత్రం లండన్‌లో బిగ్‌బెన్ గడియారాన్ని చూస్తూ టీ రుచిని ఆస్వాదించవచ్చన్నమాట. ఇలాగే.. అమెరికాకు చెందిన బూమ్‌సానిక్ సంస్థ కూడా హైపర్‌సానిక్ విమానాల తయారీకి చాలాకాలంగా కృషిచేస్తోంది.



చైనా సంస్థ స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్ తయారీ!

శబ్దానికి 9 రెట్ల వేగంతో వెళ్లే విమానాల

అభివృద్ధి దిశగా అమెరికన్ కంపెనీల కృషి



అమెరికా తయారుచేస్తున్న హైపర్‌సానిక్ విమానం

పర్యావరణంపై ఆందోళన..

హైపర్‌సానిక్ విమానాలు అందుబాటులోకి రావడం వల్ల దేశాల మధ్య సరిహద్దులు చెరిగిపోయేంత దగ్గరవుతాయన్న మాట నిజమేగానీ.. ఆ విమానాల నుంచి వెలువడే కాలుష్యం పర్యావరణ పరమైన ఆందోళనలకు కారణమవుతోంది. నాసా అంచనాల ప్రకారం.. సూపర్‌సానిక్ జెట్ విమానాలు సంప్రదాయ విమానాలతో పోలిస్తే రెట్టింపు ఇంధనాన్ని వినియోగిస్తాయి. పోనీ అందుకు తగ్గట్టుగా పెద్ద సంఖ్యలో ప్రయాణికులను మోసుకెళ్లగలవా? అంటే.. సాధారణ విమానాలతో పోలిస్తే వాటిలో తక్కువమంది మాత్రమే ప్రయాణించే వీలుంటుంది.

ఇంత ఆలస్యమేంటి?

హైపర్‌సానిక్ క్షిపణులు ఇప్పటికే అందుబాటులోకి వచ్చినా.. ఆ వేగంతో ప్రయాణించే విమానాల రాకకు ఎందుకింత ఆలస్యమవుతోంది? అనే సందేహం చాలా మందికి రావచ్చు. క్షిపణి ప్రయోజనం.. శత్రు దేశంపైకి దూసుకెళ్లి లక్ష్యాన్ని తాకి విధ్వంసం సృష్టించడమే. దాన్ని క్షేమంగా దింపాల్సిన అవసరం లేదు. కానీ, వాణిజ్యపరమైన విమానాలు అలా కాదు. ప్రయాణికుల క్షేమం ముఖ్యం. క్షిపణుల టెక్నాలజీని విమానాలకు వాడితే.. ఆ వేగం వల్ల పుట్టే వేడి, శక్తికే ఆ విమానాలు ధ్వంసమైపోతాయి. కాబట్టి ఉష్ణోగ్రతలను తక్కువస్థాయిలో ఉంచేందుకు వైమానిక రంగ నిపుణులు.. మాగ్నెటో హైడ్రో డైనమిక్స్, సినర్జిటిక్ ఎయిర్ బ్రీతింగ్ రాకెట్ ఇంజన్ వంటి ప్రత్యామ్నాయ చోదక విధానాలను (ప్రొపల్షన్ మీన్స్) పరీక్షిస్తున్నారు. ఈ ఎయిర్ బ్రీతింగ్ ఇంజన్లు.. రాకెట్ తరహాలో దూసుకుపోవడానికి, అదే సమయంలో జెట్ ఇంజన్ తరహాలో ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగపడతాయి.



(చెన్నై - ఆంధ్రజ్యోతి)

'ఐదు రూపాయల డాక్టర్'గా ప్రభుత్వ వైద్య వ్యవస్థలోని లోపాలపై విరుచుకుపడి... 'అదిరింది' అనిపించిన విజయ్!

ఓటు విలువ తెలియచేస్తూ... బడా రాజకీయ నాయకులనే ఢీకొట్టిన 'సర్కార్' నాయకుడు!

పార్టీలు, ప్రభుత్వాలు, పథకాలపై అనేక పంచ్ డైలాగులతో అభిమానులకు ఎప్పటి నుంచో 'పొలిటికల్' సంకేతాలు!

ఎట్టకేలకు, ఇప్పుడు రాజకీయ పార్టీ స్థాపన! పేరులో... విజయ్! పార్టీ పేరులోనూ విజయం (వెట్రి)! మరి... తమిళనాడు రాజకీయాల్లో విజయ్‌ని ఆ విజయం వరిస్తుందా? ఆయన చేరే తీరం ఏది?

విజయ్... తీరం చేరేనా!?

తమిళనాట నటుడు విజయ్ కొత్త పార్టీ

అభిమానులే ఆలంబనగా రాజకీయ ప్రస్థానం

రాజకీయ నేతల్లేకుండానే పార్టీ ఏర్పాటు

కరుణ, జయ లేని లోటు పూడ్చాలనే లక్ష్యం

డీఎంకే, బీజేపీపై బహిరంగంగా వ్యతిరేకత

టీవీకే ప్రస్థానంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

సినిమాల్లో కథానాయకుడు... రాజకీయాల్లో నాయకుడు కావాలనే ఆశ, లక్ష్యం! ఎప్పటికప్పుడు రాజకీయ రంగ ప్రవేశానికి ఒక అడుగు ముందుకు వేస్తూనే... 'ఇప్పుడు కాదు' అంటూ రెండు అడుగులు వెనక్కి వేసిన నేపథ్యం! ఇప్పుడు... ఎట్టకేలకు ఈ కథానాయకుడు రాజకీయ నాయకుడిగా అవతరించాడు. ఆయనే... విజయ్! తమిళ నటుడే అయినప్పటికీ... తెలుగు సినీ ప్రేక్షకులకూ సుపరిచితుడు! మరో ఏడాదిన్నరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో 'ఇదే సరైన సమయం' అంటూ విజయ్ తన పార్టీ ప్రకటించేశారు. ఆయన తీరేమిటి? భవిష్యత్తు ఎలా ఉండొచ్చు? ఇప్పటికే ఉన్న డీఎంకే, అన్నా డీఎంకేలలో విజయ్ వల్ల ఎవరికి నష్టం? ఎంత నష్టం? సినీ నటుడిగా ఉన్న జనాకర్షణ రాజకీయాల్లోనూ పనికొస్తుందా? ఆయన ఏర్పాటు చేసిన 'తమిళగ వెట్రి కళగం' (తమిళుల విజయం పార్టీ) విజయ తీరాలకు చేరుతుందా? దీనిపై తమిళనాట భారీ చర్చ జరుగుతోంది. డబ్బింగ్ సినిమాల ద్వారా తెలుగు వారికీ సుపరిచితుడైన విజయ్ పార్టీపై రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆసక్తి నెలకొంది.

పంచ్ డైలాగులతో...

విజయ్ పంచ్ డైలాగులకు థియేటర్లు దద్దరిల్లుతాయి. కానీ... కొందరు రాజకీయ నాయకులకు మాత్రం అవంటే గిట్టదు. ఆ డైలాగులు తమ గురించి, తమ పార్టీ గురించే చెబుతున్నారని వారి ఉద్దేశం. ఆదిలోనే విజయ్ డీఎంకేతో వైరం తెచ్చుకున్నారు. పలుమార్లు తన సినిమాల విడుదల, థియేటర్ల కాంట్రాక్టు వంటి విషయాల్లో తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో... 2011లో విజయ్ అభిమాన సంఘం జయలలిత నేతృత్వంలోని అన్నా డీఎంకేకు మద్దతు పలికింది. జయ విజయం కోసం విజయ్ పరోక్షంగా పని చేశారు. తదనంతరం... జయ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఉచిత మిక్సీలు, గ్రైండర్ల వంటి వాటిని విమర్శిస్తూ విజయ్ సినిమాలో పంచ్ డైలాగులు పేల్చారు. దీంతో... ఆమె సర్కారు సైతం విజయ్ పట్ల కాస్త కఠినంగా వ్యవహరించింది. కొన్నాళ్లు విజయ్ చిత్రాల ప్రదర్శనకు థియేటర్లు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. రాజకీయ నేతల 'పవర్' ఏమిటో విజయ్‌కి తెలిసొచ్చింది. ఈ నేపథ్యంలో 'పొలిటికల్ పవర్' సాధించాలని గట్టిగా నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతారు.



నాయకుల చిత్రపటాల వద్ద పూలు జల్లుతున్న విజయ్

ఎవరీ విజయ్?

విజయ్ పూర్తి పేరు... జోసఫ్ విజయ్ చంద్రశేఖర్. ఆయన తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ సినీ దర్శకుడు. తల్లి శోభ ఒకప్పటి గాయని, సంగీత విద్వాంసురాలు. శోభ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, చంద్రశేఖర్‌ది 'వేళాలర్' (క్రిస్టియన్) వర్గం. 1974 జూన్ 22న జన్మించిన విజయ్‌కి ఆది నుంచీ సినిమాలపై ఆసక్తి. రాజకీయాలపై ప్రత్యేక ఆసక్తి! అందులో భాగంగా ఆయన 2009లో 'విజయ్ మక్కల్ ఇయక్కం' పేరుతో అభిమానుల సంఘాన్ని ప్రారంభించి, దాని ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే... కరుణానిధి, జయలలిత వంటి హేమాహేమీలు రాజకీయాల్లో ఉండడం, రజనీకాంత్ వంటి వారూ రాజకీయాలపై ఆసక్తి ప్రదర్శిస్తుండటంతో విజయ్ తగిన సమయం కోసం వేచిచూశారు. ఇప్పుడు కరుణానిధి, జయలలిత లేరు! రజనీ రాజకీయాల్లోకి రాలేదు. దీంతో... తమిళ రాజకీయాల్లో తనకు 'చోటు' ఉందనే అంచనాకు వచ్చారు. కొత్త పార్టీని ప్రకటించేశారు.

బలాలు.. బలహీనతలు!

విజయ్ అభిమానుల్లో అత్యధికులు యువతే. 18-35 సంవత్సరాల మధ్య వయస్కుల్లో అధిక శాతం ఓట్లను తాము ఆకర్షించగలమని టీవీకే వర్గాలు భావిస్తున్నాయి. అయితే, ఇందులో ఓటు హక్కు కలిగివున్న వారెందరు? ఓటు వేసే వారెందరు? అని ప్రశ్నిస్తే సమాధానం కోసం తడుముకోవాల్సిన పరిస్థితి. విజయ్ ఎక్కడికెళ్లినా సందడి చేసే యువత.. రాజకీయంగాను అండగా నిలుస్తుందా అన్నది చూడాలి. అందుకే విజయ్ మిగిలిన వర్గాలను ఆకట్టుకోవడం తక్షణావసరమని పలువురు సీనియర్లు సూచిస్తున్నారు. సినీ నటుడుగా విజయ్‌కి మహిళా అభిమానులు ఎక్కువ. విజయ్ క్రైస్తవుడైనప్పటికీ, హిందూ మతాచారాలు పాటిస్తారని ఆయన గురించి బాగా తెలిసిన ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు. ఆయనకు నమ్మకాలు కూడా ఎక్కువే. జనాలతో సరిగ్గా మమేకమవకపోవడం ఆయనకు పెద్ద మైనస్. దీనికి తోడు ముక్కుమీద కోపం! డబ్బును ఆచితూచి ఖర్చు చేస్తారనే పేరూ ఉంది.



బహిరంగ సభకు హాజరైన అభిమానులు, ప్రజలకు అభివాదం చేస్తున్న విజయ్

నేతల్లేకుండానే టీవీకే ఆవిర్భావం..

పార్టీ కొత్తదే కావొచ్చు! కానీ... అప్పటికే రాజకీయాల్లో ఉన్న ప్రముఖులెవరో ఒకరు అందులో చేరడం ఇప్పటిదాకా చూశాం. కానీ... విజయ్ పార్టీలో అలాంటి రాజకీయ నాయకులెవరూ కనిపించలేదు. 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పేరుతో ఎలాంటి హంగూ ఆర్భాటాల్లేకుండా పార్టీని ప్రారంభించి... తొలి మహానాడును ప్రత్యర్థులు సైతం అచ్చెరువొందేలా 5లక్షలమందితో నిర్వహించారు. నిజానికి పార్టీ ప్రారంభానికి కేవలం అభిమానులతో సన్నాహాలు చేసుకున్న విజయ్.. రాజకీయ నేతలెవ్వరినీ దరిచేరనీయలేదు. ఆయన ఐదుగురు ఐపీఎస్‌లు, ముగ్గురు ఐఏఎస్‌ల సలహాలు, సూచనలతోనే పార్టీని నడుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ఐపీఎస్‌లలో ఇద్దరు ఇప్పటికీ సర్వీసులో ఉన్నారు. వారు కూడా త్వరలో స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని విజయ్ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. దాంతో టీవీకేలో రాజకీయ పార్టీ లక్షణాలే కనిపించడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తమిళనాడులో 2026 మే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ లోపు పార్టీని నిర్మించడం విజయ్ ముందున్న పెద్ద సవాల్.



అన్నా డీఎంకేతో పొత్తుకు చాన్స్!

విజయ్ ఈ ఎన్నికల్లో అన్నా డీఎంకేతో పొత్తు పెట్టుకునే సూచనలు కనిపిస్తున్నాయి. పార్టీ మహానాడులో ఆయన డీఎంకే, బీజేపీపైనే విమర్శలు ఎక్కుపెట్టారు. అన్నా డీఎంకేపై ఇప్పటిదాకా ఎలాంటి విమర్శలు చేయలేదు. ఈ పరిణామాలను గమనిస్తే... రెండు పార్టీలు భవిష్యత్తులో కలిసికట్టుగా సాగే అవకాశముందని చెప్పవచ్చు. పోలింగ్‌బూత్ వరకు ఓటర్లను తీసుకురాగలిగిన క్యాడర్ ఇంకా సమకూరకపోవడం, ఆర్థికంగానూ తన శక్తిసామర్థ్యాలు సరిపోవని భావించిన విజయ్.. అన్నా డీఎంకేతో పొత్తుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అధికార డీఎంకే కూటమిని ఢీకొట్టడానికి ప్రస్తుతం అన్నా డీఎంకే నానా తంటాలు పడుతోంది. విజయ్‌తో పొత్తు తమకు కలిసొస్తుందని అన్నా డీఎంకే అధినేత పళనిస్వామి గట్టిగా తలపోస్తున్నారు. అందుకే విజయ్‌పైన గానీ, ఆయన పార్టీపైనగానీ విమర్శలు చేయరాదని పళనిస్వామి తన అనుచరులకు సంకేతాలు పంపారు. అంతేగాక... ఇటీవల జరిగిన టీవీకే మహానాడుకు అన్నా డీఎంకే పరోక్షంగా సహకరించినట్లు తెలుస్తోంది.

ఎవరు తన వైపు?

తమిళనాట డీఎంకే-అన్నాడీఎంకేలకు పటిష్ఠమైన క్యాడర్ ఉంది. పార్టీ చిహ్నం చూసి ఓటేసే ప్రజలు అధికంగానే ఉన్నారు. ఈ రెండు పార్టీలకు కలిపి 60 శాతానికి పైగా ఓటు బ్యాంకు ఉంటుంది. మిగిలిన 40% ఓట్లను ఇతర పార్టీలతోపాటు విజయ్ పంచుకోవాలి. లేదా.. రెండు ప్రధాన పార్టీల ఓట్లకు గండి కొట్టాలి! దీనికోసం ఆయన చాలా శ్రమించాల్సి వస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే క్రిస్టియన్ మైనారిటీ ఓట్లను టీవీకే చీల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయ్ తండ్రి సామాజికవర్గమైన వేళాలర్ ఓట్లు తమిళనాడులో 1-2% ఉన్నాయి. ఈ ఓట్లలో అధికభాగం టీవీకేకే పడే అవకాశముంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే..విజయ్ ఒంటరిగా పోరాడితే 7-8 % ఓట్లు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

చాంపియన్స్ ట్రోఫీ రద్దేనా?



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ మొత్తంగా రద్దయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వచ్చే ఫిబ్రవరి 19 నుంచి మార్చి 19 వరకు పాకిస్థాన్‌లో జరిగే ఈ టోర్నీకి సంబంధించిన ఓ ముఖ్య కార్యక్రమాన్ని సోమవారంలాహోర్‌లో నిర్వహించాల్సి ఉంది. కానీ ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆదివారం హఠాత్తుగా ప్రకటించింది. దాంతో టోర్నీ నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ టోర్నీలో ఆడేందుకు పాక్ వెళ్లబోమని ఐసీసీకి బీసీసీఐ శనివారం తెలియజేసింది. ఈ పరిస్థితుల్లో సోమవారం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు ఐసీసీ ప్రకటించడం గమనార్హం. అయితే, రద్దుకు కారణమేంటో ఐసీసీ వెల్లడించలేదు. కానీ షెడ్యూల్ ఖరారులో వివాదం, పాక్‌లో పర్యటనకు భారత్ నిరాకరణే కారణమని తెలుస్తోంది. పాక్ వెళ్లేందుకు భారత్ నిరాకరించడంతో టోర్నీని హైబ్రిడ్ విధానంలో జరపాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే హైబ్రిడ్ పద్ధతికి పీసీబీ విముఖత వ్యక్తంజేస్తోంది.

అవును..భారత జట్టు రావడంలేదు: చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు భారత జట్టు తమ దేశం రావడంలేదని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ధ్రువీకరించింది. ఈమేరకు ఐసీసీ తమకు సమాచారం అందజేసిందని ఆదివారం పేర్కొంది.

కోర్టుకు పాకిస్థాన్?

చాంపియన్స్ ట్రోఫీ కోసం పాక్ రావడంలేదని భారత్ స్పష్టం చేయడంతో.. అంతర్జాతీయ క్రీడా మధ్యవర్తిత్వం న్యాయస్థానాన్ని (కాస్) పాకిస్థాన్ ఆశ్రయించే అవకాశాలున్నాయి. నిరుడు భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచ కప్‌లో పాల్గొనేందుకు తాము ఆ దేశం వెళ్లిన విషయాన్ని కాస్‌లో వేసే పిటిషన్‌లో పాక్ బోర్డు ప్రస్తావించనున్నట్టు సమాచారం.



లక్ష్యం..మరో టైటిల్

తొలి మ్యాచ్‌లో మలేసియాతో భారత్ ఢీ
నేటి నుంచి మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీ

రాజ్‌గిర్ (బిహార్): మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీకి సోమవారం ఇక్కడ తెరలేవనుంది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో దిగుతున్న సలీమా టేటె సారథ్యంలోని భారత్ తొలి మ్యాచ్‌లో.. తమకంటే తక్కువ ర్యాంకరైన మలేసియాతో తలపడనుంది. చైనా, కొరియా, జపాన్, థాయ్‌లాండ్ టోర్నీలో తలపడుతున్న ఇతర జట్లు. సింగిల్ రౌండ్ రాబిన్ లీగ్ విధానంలో జరిగే ఈ చాంపియన్‌షిప్‌లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచే జట్లు సెమీస్‌కు చేరతాయి. తొలి రోజు జరిగే ఇతర మ్యాచ్‌ల్లో జపాన్‌తో కొరియా, చైనాతో థాయ్‌లాండ్ పోటీపడనున్నాయి.

ఉత్కంఠ పోరులో ముంబా గెలుపు

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11 రెండో అంచె పోటీలు నోయిడాలో మొదలయ్యాయి. ఆదివారం ఆతిథ్య యూపీ యోధాస్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో యు ముంబా 35-33తో నెగ్గింది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 39-23తో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది.

ఆఖర్లో వదిలేశారు

రెండో టీ20లో భారత్ ఓటమి

దక్షిణాఫ్రికాను గెలిపించిన స్టబ్స్
స్పిన్నర్ వరుణ్‌కు ఐదు వికెట్లు



1 ఒకే క్యాలెండర్ ఏడాదిలో రెండు సెంచరీలు బాది, నాలుగు సార్లు డకౌట్ అయిన టీ20 బ్యాటర్‌గా శాంసన్

స్టబ్స్ (47 నాటౌట్)



వరుణ్ చక్రవర్తి (5/17)

గెబెహా: దక్షిణాఫ్రికాతో ఉత్కంఠభరితంగా సాగిన రెండో టీ20లో భారత్ చేజేతులా ఓడింది. స్వల్ప స్కోరును కాపాడే క్రమంలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కెరీర్ బెస్ట్ బౌలింగ్ (5/17)తో చెలరేగాడు. దీంతో ఓ దశలో ఆతిథ్య జట్టు 86/7 స్కోరుతో ఓటమివైపు సాగింది. కానీ యువ బ్యాటర్ ట్రిస్టాన్ స్టబ్స్ (47 నాటౌట్) సూపర్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కొట్జీ (19 నాటౌట్)తో కలిసి ఆఖరి మూడు ఓవర్లలో 40 పరుగులతో జట్టును గట్టెక్కించాడు. తద్వారా 3 వికెట్ల తేడాతో గెలిచిన ఆతిథ్య జట్టు సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. అలాగే భారత్ వరుస 11 టీ20 విజయాలకు బ్రేక్ పడింది. బుధవారం మూడో మ్యాచ్ జరుగుతుంది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 124 పరుగులు చేసింది. హార్దిక్ (39 నాటౌట్), అక్షర్ (27), తిలక్ (20) మాత్రమే రాణించారు. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 19 ఓవర్లలో 7 వికెట్లకు 128 పరుగులు చేసి గెలిచింది. హెన్‌డ్రిక్స్ (24) ఫర్వాలేదనిపించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా స్టబ్స్ నిలిచాడు.

వరుణ్ తిప్పేసినా..: స్వల్ప ఛేదనలో స్పిన్నర్ వరుణ్ ధాటికి దక్షిణాఫ్రికా టపటపా వికెట్లను కోల్పోయింది. బంతులకన్నా చేయాల్సిన పరుగులు కూడా ఎక్కువే కావడంతో భారత్ గెలుపు ఖాయమనిపించింది. కానీ చివర్లో పేసర్లు అవేశ్, అర్ష్‌దీప్ ధారాళంగా పరుగులిచ్చుకోవడం దెబ్బతీసింది. మూడో ఓవర్‌లోనే ఓపెనర్ రికెల్టన్ (13)ను అర్ష్‌దీప్ అవుట్ చేయగా ఆ తర్వాత స్పిన్నర్ వరుణ్ తన వరుస ఓవర్లలో హవా చూపాడు. కెప్టెన్ మార్‌క్రమ్ (3), ఓపెనర్ హెన్‌డ్రిక్స్‌తో పాటు బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందే వచ్చిన జాన్సెన్ (7) కూడా వరుణ్ చేతిలో బౌల్డయ్యాడు. ఇక 13వ ఓవర్‌లో తను సఫారీలకు అతి పెద్ద షాక్ ఇచ్చాడు. ఒక్క పరుగే ఇచ్చి క్లాసెన్ (2), మిల్లర్ (0)ల వికెట్లను తీయడంతో 66/6తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కానీ క్రీజులో స్టబ్స్ ఉండడంతో సఫారీలు విజయంపై ఆశలు వదులుకోలేదు. దీనికితోడు సిమెలానె (7) తర్వాత కొట్జీ రాకతో భారత్ ఒత్తిడిలో పడింది. 17వ ఓవర్‌లో అతడి భారీ సిక్సర్ స్టేడియంపైన పడగా స్టబ్స్ ఫోర్‌తో 12 రన్స్ వచ్చాయి. ఇక 18వ ఓవర్‌లో కొట్జీ రెండు వరుస ఫోర్లతో సమీకరణం 12 బంతుల్లో 13 రన్స్‌కు మారింది. 19వ ఓవర్‌లో స్టబ్స్ 4 ఫోర్లతో 16 రన్స్ సాధించి మ్యాచ్‌ను ముగించాడు.

బౌలర్లు సమష్టిగా..: వరుసగా రెండో మ్యాచ్‌లోనూ టాస్ ఓడిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. ఈసారి కూడా టాపార్డర్ నిరాశపర్చగా, మిడిలార్డర్‌లో తిలక్, అక్షర్‌లతో పాటు హార్దిక్ ఆటతీరు పుణ్యాన జట్టు స్కోరు కష్టమ్మీద 120 దాటగలిగింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే పేసర్ జాన్సెన్ మూడో బంతికే సంజూ శాంసన్ (0)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. తర్వాతి ఓవర్‌లోనే అభిషేక్ (4)ను కొట్జీ దెబ్బతీశాడు. ఇక కెప్టెన్ సూర్య (4)ను సిమిలానె ఎల్బీ చేయడంతో 15/3 స్కోరుతో జట్టు ఇబ్బందుల్లో పడింది. అయితే తిలక్, అక్షర్ జోడీ ఆత్మవిశ్వాసంతో ఎదురుదాడికి దిగడంతో పవర్‌ప్లేలో 34/3తో నిలిచింది. కానీ తిలక్ క్యాచ్‌ను.. కవర్స్‌లో మిల్లర్ గాల్లోకి ఎగిరి ఒంటిచేత్తో పట్టేయడంతో వెనుదిరగాల్సి వచ్చింది. ఆ తర్వాత కాసేపటికే ఊపు మీదున్న అక్షర్ రనౌటయ్యాడు. హార్దిక్ ఆడిన షాట్ స్పిన్నర్ పీటర్ చేతివేళ్లను తాకి నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో వికెట్లను గిరాటేసింది. రింకూ సింగ్ (9) కూడా విఫలమయ్యాడు. మరోవైపు 35 బంతుల వరకు జట్టు నుంచి బౌండరీ కూడా రాలేదు. చివరకు 16వ ఓవర్‌లో అర్ష్‌దీప్ సిక్సర్ బాదాడు. 17వ ఓవర్‌లో హార్దిక్ ఫోర్‌తో స్కోరు వందకి చేరింది. ఆ తర్వాత ఓవర్‌లో అతడి 4,6,4తో 14 రన్స్ సమకూరాయి. ఇక ఆఖరి ఓవర్‌లో హార్దిక్ ఇచ్చిన రెండు క్యాచ్‌లు విఫలం కాగా ఆరు పరుగులే వచ్చాయి. ఇన్నింగ్స్‌లో అత్యధికంగా ఏడో వికెట్‌కు అజేయంగా 37 పరుగులు రావడం విశేషం.

స్కోరుబోర్డు

భారత్: శాంసన్ (బి) జాన్సెన్ 0; అభిషేక్ (సి) జాన్సెన్ (బి) కొట్జీ 4; సూర్యకుమార్ (బి) సిమిలానె 4; తిలక్ (సి) మిల్లర్ (బి) మార్‌క్రమ్ 20; అక్షర్ (రనౌట్) 27; హార్దిక్ (నాటౌట్) 39; రింకూ (సి) కొట్జీ (బి) పీటర్ 9; అర్ష్‌దీప్ (నాటౌట్) 7; **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 124/6. వికెట్ల పతనం:** 1-0, 2-5, 3-15, 4-45, 5-70, 6-87. **బౌలింగ్:** జాన్సెన్ 4-1-25-1; కొట్జీ 4-0-25-1; సిమిలానె 3-0-20-1; కేశవ్ 4-0-24-0; మార్‌క్రమ్ 1-0-4-1; పీటర్ 4-0-20-1.

దక్షిణాఫ్రికా: రికెల్టన్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 13; హెండ్రిక్స్ (బి) వరుణ్ 24; మార్‌క్రమ్ (బి) వరుణ్ 3; స్టబ్స్ (నాటౌట్) 47; జాన్సెన్ (బి) వరుణ్ 7; క్లాసెన్ (సి) రింకూ (బి) వరుణ్ 2; మిల్లర్ (బి) వరుణ్ 0; సిమిలానె (బి) రవి బిష్ణోయ్ 7; కొట్జీ (నాటౌట్) 19; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 19 ఓవర్లలో 128/7. వికెట్ల పతనం:** 1-22, 2-33, 3-44, 4-64, 5-66, 6-66, 7-86. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-41-1, అవేశ్ 3-0-23-0, హార్దిక్ 3-0-22-0, వరుణ్ చక్రవర్తి 4-0-17-5, రవి బిష్ణోయ్ 4-0-21-1, అక్షర్ పటేల్ 1-0-2-0.



'డబ్ల్యూటీఏ' క్వీన్.. గాఫ్
అమెరికా స్టార్‌కు రూ. 40 కోట్ల ప్రైజ్‌మనీ

రియాద్: అమెరికా టెన్నిస్ యువ సంచలనం కొకొ గాఫ్ సీజన్‌కు గ్రాండ్‌గా వీడ్కోలు పలికింది. సీజన్ ముగింపు టోర్నీ అయిన ప్రతిష్ఠాత్మక డబ్ల్యూటీఏ ఫైనల్స్ ట్రోఫీని గాఫ్ అందుకుంది. శనివారం రాత్రి జరిగిన ఫైనల్లో గాఫ్ 3-6, 6-4, 7-6(2)తో జెంగ్ కిన్వెన్ (చైనా)ను ఓడించింది. విజేత గాఫ్‌కు రికార్డుస్థాయిలో రూ. 40 కోట్లు, రన్నరప్ జెంగ్ రూ. 31 కోట్లు ప్రైజ్ మనీ రూపంలో దక్కింది. 2014లో సెరెనా విలియమ్స్ తర్వాత డబ్ల్యూటీఏ ఫైనల్స్ గెలిచిన తొలి అమెరికా క్రీడాకారిణిగా గాఫ్ రికార్డుకెక్కింది. అంతే కాదు.. 2004లో షరపోవా తర్వాత ఈ ట్రోఫీ నెగ్గిన పిన్న వయసు ప్లేయర్‌గానూ 20 ఏళ్ల గాఫ్ ఘనత సాధించింది.

రుత్విక జోడీకి మిక్స్‌డ్ టైటిల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎన్ఎండీసీ తెలంగాణ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను హైదరాబాద్ అమ్మాయి రుత్విక శివానీ జోడీ కైవసం చేసుకుంది. ఆదివారం ఇక్కడి గోపీచంద్ అకాడమీలో జరిగిన ఫైనల్లో శివానీ-రోహన్ కపూర్ ద్వయం 21-17, 21-19తో తనీషా-హరిహరన్ జంటపై గెలిచింది. పృథ్వీ-సాయి ప్రతీక్ ద్వయం 21-19, 21-17తో అర్జున్-విష్ణువర్ధన్ గౌడ్ జోడీపై నెగ్గి పురుషుల డబుల్స్ విజేతగా నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో రుత్విక్, మహిళల సింగిల్స్‌లో ఇషారాణి, డబుల్స్‌లో ప్రియ-శ్రుతి మిశ్రా జంట టైటిళ్లు సాధించారు.

22 ఏళ్ల తర్వాత..

ఆసీస్ గడ్డపై పాక్‌కు సిరీస్
మూడో వన్డేలో ఘనవిజయం

పెర్త్: మహ్మద్ రిజ్వాన్ కెప్టెన్సీలో తొలిసారి బరిలోకి దిగిన పాకిస్థాన్ వన్డే జట్టు అదరగొట్టింది. ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగిన మూడో వన్డేలో 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో దక్కించుకుంది. అలాగే 22 ఏళ్ల (2002) తర్వాత పాక్ జట్టు కంగారూ గడ్డపై సిరీస్ సాధించింది. అలాగే ఓ వన్డే సిరీస్‌లో ఆసీస్ నుంచి ఏ ఒక్క బ్యాటర్ కూడా అర్ధసెంచరీ చేయకపోవడం ఇదే తొలిసారి. పేసర్లు షహీన్, నసీమ్ షా మూడేసి వికెట్లతో కట్టడి చేయగా, ఆసీస్ 31.5 ఓవర్లలో 140 పరుగులే చేసింది. ఎబాట్ (30) టాప్‌స్కోరర్. ఛేదనలో పాక్ 26.5 ఓవర్లలో 143/2 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్లు సయీమ్ అయూబ్ (42), అబ్దుల్లా షఫీక్ (37), రిజ్వాన్ (30 నాటౌట్), బాబర్ (28 నాటౌట్) రాణించారు. మోరిస్‌కు 2 వికెట్లు దక్కాయి.

మెక్‌స్వీని, ఇన్‌గ్లిస్‌లకు పిలుపు

భారత్‌తో తొలి టెస్టుకు ఆసీస్ జట్టు ఎంపిక

సిడ్నీ: భారత్‌తో జరిగే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా తొలి టెస్టు కోసం 13మందితో కూడిన ఆస్ట్రేలియా జట్టును ఆదివారం ప్రకటించారు. ఈనెల 22 నుంచి 5 టెస్టుల సిరీస్ జరుగుతుంది. కమిన్స్ నాయకత్వంలోని జట్టులో జోష్ ఇన్‌గ్లిస్‌తో పాటు యువ సంచలనం నాథన్ మెక్‌స్వీనిలకు తొలిసారి చోటిచ్చారు.

ఆస్ట్రేలియా జట్టు: కమిన్స్ (కెప్టెన్), హెడ్, ఖవాజా, లబుషేన్, మార్ష్, మెక్‌స్వీని, స్మిత్, క్యారీ, ఇన్‌గ్లిస్, హాజెల్‌వుడ్, బోలాండ్, లియోన్, స్టార్క్.

అర్జున్‌కు షాక్

చెన్నై: అప్రతిహత విజయాలతో దూసుకుపోతున్న తెలుగు కుర్రాడు ఇరిగేసి అర్జున్‌కు చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ ఆరో రౌండ్‌లో అరవింద్ చిదంబరం (తమిళనాడు) షాకిచ్చాడు. ఆదివారం జరిగిన గేమ్‌లో 48వ ఎత్తుల్లో అర్జున్‌కు అరవిండ్ చెక్ చెప్పాడు. లెవాన్ అరోనియన్ (అమెరికా)తో గేమ్‌ను విదిత్ సంతోష్ గుజరాతి డ్రా చేసుకున్నాడు. ఆరో రౌండ్ అనంతరం అర్జున్, లెవాన్ 4 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలవగా, అరవింద్ రెండో స్థానంలో ఉన్నాడు. సోమవారం ఆఖరిదైన ఏడో రౌండ్ జరగనుంది. చెన్నై చాలెంజర్స్ చెస్ టోర్నీలో రౌనక్ సాధ్వానితో జరిగిన ఆరో రౌండ్‌ను ద్రోణవల్లి హారిక డ్రాగా ముగించింది. మొత్తంగా 6 రౌండ్లు ముగిసేసరికి ప్రణవ్ టాప్‌లో ఉండగా, హారిక 7వ స్థానంలో నిలిచింది.

ఏపీ, గుజరాత్‌ల్లో రెండు కొత్త యూనిట్లు

2028 నాటికి రూ.2,500 కోట్ల టర్నోవర్
ఇంటర్‌ఆర్క్ బిల్డింగ్ ప్రొడక్ట్స్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో రెండు కొత్త యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఇంటర్‌ఆర్క్ బిల్డింగ్ ప్రొడక్ట్స్ ప్రకటించింది. కంపెనీ ఎండీ అరవింద్ నందా ఈ విషయం వెల్లడించారు. ప్రీ ఇంజనీర్డ్ బిల్డింగ్ పరిశ్రమలో గట్టి పట్టున్న కంపెనీకి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాలోని ఐతవరం, తమిళనాడులోని శ్రీపెరంబుదూర్, ఉత్తరాఖండ్‌లోని పంత్ నగర్, కిచ్చ వద్ద నాలుగు ఉత్పత్తి యూనిట్లు ఉన్నాయి. వీటికి తోడు ఏపీ, గుజరాత్‌ల్లో కొత్తగా రెండు సమగ్ర యూనిట్లు ఏర్పాటు చేయనుంది. ఇందు కోసం ఇటీవల పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన రూ.600 కోట్లలో కొంత మొత్తాన్ని ఖర్చు చేయనుంది. కొత్త యూనిట్లు, ఉన్న యూనిట్ల ఉత్పత్తి సామర్థ్య విస్తరణ ద్వారా 2028 మార్చి నాటికి రూ.2,500 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు నందా చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ రూ.1,293 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	565
వరంగల్	557	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	115
వరంగల్	110	గుంటూరు	115
కరీంనగర్	110	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	100
కర్నూలు	110	నెల్లూరు	100
విశాఖపట్నం	111	అనంతపురం	100
గోదావరి	115		

నేటితో విస్తారా కథ కంచికి..

ఎయిర్ ఇండియాలో విలీనం



ముంబై/న్యూఢిల్లీ: దేశ విమానయాన రంగంలో మరో కంపెనీ పేరు అదృశ్యమవుతోంది. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి 2015లో టాటా గ్రూప్ ఏర్పాటు చేసిన విస్తారా ఎయిర్‌లైన్స్ సోమవారం నుంచి టాటా గ్రూప్‌లోని ఎయిర్ ఇండియాలో విలీనమవుతోంది. విస్తారా ఎయిర్‌లైన్స్ ఈక్విటీలో ప్రస్తుతం టాటా గ్రూప్‌నకు 51 శాతం, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 49 శాతం వాటా ఉంది. విలీనం తర్వాత ఎయిర్ ఇండియా ఈక్విటీలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా ఉంటుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం దేశీయ విమానయాన కంపెనీల ఈక్విటీలో 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను అనుమతిస్తూ 2012లో నిర్ణయం తీసుకుంది. దీంతో టాటా గ్రూప్ 51 శాతం, సింగపూర్ ఎయిర్‌లైన్స్ 49 శాతం వాటాతో 2015 జనవరిలో విస్తారా ఎయిర్‌లైన్స్‌ను ప్రారంభించాయి.

మరింత పట్టు

టాటా గ్రూప్ 2022లో కేంద్ర ప్రభుత్వం నుంచి ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసింది. అక్కడి నుంచి తన నిర్వహణలోని ఎయిర్ ఏషియా ఇండియా, విస్తారా ఎయిర్‌లైన్స్‌ను ఎయిర్ ఇండియాలో విలీనం చేస్తోంది. ఈ విలీనంతో ఎయిర్ ఇండియా ఒక్కటే దేశంలో ఫుల్ సర్వీస్ క్యారియర్‌గా నిలిచిపోనుంది. కాగా గత 17 సంవత్సరాల్లో కింగ్‌ఫిషర్, జెట్ ఎయిర్‌వేస్‌తో సహా ఐదు ఫుల్ సర్వీస్ క్యారియర్స్ మూతపడ్డాయి. విస్తారా విలీనంతో దేశ విమానయాన రంగంపై టాటా గ్రూప్ పట్టు మరింత పెరగనుంది.

సింగపూర్ ఎయిర్‌లైన్స్ రూ.3,195 కోట్ల పెట్టుబడి

విలీనం తర్వాత ఎయిర్ ఇండియా ఈక్విటీలో 25.1 శాతం వాటా కోసం సింగపూర్ ఎయిర్‌లైన్స్ గ్రూప్.. టాటా గ్రూప్‌నకు మరో రూ.3,195 కోట్లు సమకూర్చనుంది. ఈ మొత్తం ఈ నెలలోనే టాటా గ్రూప్‌నకు అందనుంది.

పైలెట్ల అసంతృప్తి

అయితే ఈ విలీనంపై ఎయిర్ ఇండియాకు చెందిన కొంత మంది పైలెట్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ పదవీ విరమణ వయసు 58 ఏళ్లకు, విస్తారా పైలెట్ల రిటైర్మెంట్ వయసు 60 ఏళ్లుగా ఉండడం ఇందుకు ప్రధాన కారణం. వెంటనే ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దాలని వారు ఇప్పటికే టాటా గ్రూప్‌ను కోరారు.

బిజినెస్

ఐదు ట్రేడింగ్ సెషన్స్.. రూ.20,000 కోట్లు

భారీగా ఎఫ్‌పీఐల అమ్మకాలు

న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్లో విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్‌పీఐ) అమ్మకాలు కొనసాగుతున్నాయి. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో (నవంబరు 4-8) ఎఫ్‌పీఐలు దాదాపు రూ.20,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. అక్టోబరు నెల మొత్తానికి చూసినా ఈ సంస్థలు భారత మార్కెట్లో రూ.1.14 లక్షల కోట్ల విలువైన షేర్లను విక్రయించాయి. దేశీయ కంపెనీల షేర్లు అధిక వాల్యుయేషన్‌తో ట్రేడవడం, చైనా మార్కెట్ మన కంటే ఆకర్షణీయంగా కనిపించడం, క్యూ2 ఆర్థిక ఫలితాలు ఆశించినంతగా లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. కాగా డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు కూడా ఆకర్షణీయంగా లేకపోతే ఎఫ్‌పీఐల అమ్మకాలకు ఇప్పట్లో తెరపడదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

నయా ఫండ్స్..

బజాజ్ ఫిన్‌సర్వ్ కన్జంప్షన్ ఫండ్

బజాజ్ ఫిన్‌సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ.. కన్జంప్షన్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది కన్జంప్షన్ థీమ్‌తో రూపొందించిన ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. వినియోగదారుల ప్రవర్తన, ఖర్చుల ఆధారంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఈ ఫండ్‌కు నిఫ్టీ ఇండియా కన్జంప్షన్ టోటల్ రిటర్న్ ఇండెక్స్ (టీఆర్ఐ) బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 22.

టాటా ఇండియా ఇన్నోవేషన్ ఫండ్

టాటా అసెట్ మేనేజ్‌మెంట్.. టాటా ఇండియా ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఇన్నోవేటివ్ వ్యూహాలు, సరికొత్త థీమ్స్‌ను ఉపయోగిస్తూ ముందుకు సాగుతున్న అన్ని రంగాల్లోని కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. మదుపరులకు దీర్ఘకాలంలో మెరుగైన రిటర్నులు అందించే విధంగా ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత విభాగాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ఈ నెల 11న ప్రారంభమయ్యే ఈ ఫండ్ 25న ముగియనుంది.

యాక్సిస్ సెప్టెంబరు 2027 ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ క్రిసిల్-ఐబీఎక్స్ ఏఏఏ ఫైనాన్షియల్ సర్వీసెస్- సెప్టెంబరు 2027 ఇండెక్స్ ఫండ్ పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్. వడ్డీ రేటు రిస్క్ తక్కువ ఉన్న, క్రెడిట్ రిస్క్ తక్కువగా ఉన్న వాటిల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ పథకం మెచ్యూరిటీ తేదీ 2027 సెప్టెంబరు 30. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ఈ పథకం ముగింపు తేదీ ఈ నెల 21.

భారత్ ద్వారా ఈయూకు రష్యా చమురు

న్యూఢిల్లీ: చమురు ఎగుమతులపై జీ-7, యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాలు విధించిన ఆంక్షలను తప్పించుకునేందుకు రష్యా కొత్త మార్గం కనిపెట్టింది. భారత రిఫైనరీలకు పెద్దమొత్తంలో ముడి చమురు ఎగుమతి చేస్తూ.. దాని నుంచి వచ్చే డీజిల్, విమాన ఇంధనాలను ఈయూ దేశాలకు ఎగుమతి చేస్తోంది. రష్యా చమురుతో తయారు చేసే తుది ఉత్పత్తుల ఎగుమతిపై ఎలాంటి ఆంక్షలు లేకపోవడం ఇందుకు కారణం. ఈ ఏడాది తొలి మూడు త్రైమాసికాల్లో ఈయూ దేశాలకు భారత డీజిల్, విమాన ఇంధనాల ఎగుమతి 58 శాతం పెరగడమే ఇందుకు నిదర్శనం. ఇందులో ఎక్కువ భాగం డిస్కౌంట్‌తో రష్యా సరఫరా చేసిన ముడి చమురు నుంచి ఉత్పత్తి చేశారని సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) ఒక నివేదికలో తెలిపింది.

ఇంకా అనిశ్చితే..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలవటం, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించటం, క్రూడాయిల్ ధరల్లో మార్పులు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు సూచీల గమనంపై ప్రభావం చూపించే వీలుంది. ఈ వారం నిఫ్టీకి 24,100 వద్ద మద్దతు, 24,250 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. గత వారం ఐటీ, పీఎస్‌యూ బ్యాంకులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆటో రంగ షేర్లు కొంతమేరకు రాణించగా రియల్టీ, మీడియా, ఎనర్జీ, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

మహీంద్రా అండ్ మహీంద్రా: జీవిత కాల గరిష్ఠం తర్వాత ఈ షేరు 17 శాతం మేర దిద్దుబాటు జరిగింది. కీలకమైన రూ.2,661 వద్ద మద్దతు లభించటంతో అక్కడి నుంచి అప్‌ట్రెండ్ మొదలైంది. తాజా త్రైమాసిక ఫలితాల అనంతరం మూమెంటమ్ పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు 2.89 శాతం లాభంతో రూ.2,974 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,960 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.3,150/3,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.

ఇండియన్ హోటల్స్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతోంది. సెప్టెంబరు త్రైమాసికంలో మెరుగైన ఈపీఎస్, అమ్మకాలు నమోదవటంతో మదుపరులు ఆసక్తి చూపిస్తున్నారు. నిఫ్టీతో పోలిస్తే మంచి పనితీరును కనబరుస్తోంది. గత శుక్రవారం 7.18 శాతం లాభంతో రూ.732 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.700 శ్రేణిలో ప్రవేశించి రూ.780/850 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.

అశోక్ లేలాండ్: జీవిత కాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 25 శాతం మేర పతనమైన ఈ కౌంటర్‌లో టర్న్ అరౌండ్ జరిగే అవకాశం కనిపిస్తోంది. సెప్టెంబరు త్రైమాసికంలో మంచి ఫలితాలు సాధించటం, డివిడెండ్ ప్రకటించటంతో ఇన్వెస్టర్లు ఆసక్తి కనబరుస్తున్నారు. గత శుక్రవారం ఈ షేరు 2.79 శాతం లాభంతో రూ.221.93 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.210 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.270/290 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.

మోతీలాల్ ఓస్వాల్: మార్కెట్ సెంటిమెంట్ ప్రతికూలంగా ఉన్నప్పటికీ ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో అక్యుములేషన్ జరుగుతోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ భారీగా నమోదవుతోంది. గత శుక్రవారం ఈ షేరు 6.1 శాతం లాభంతో రూ.997 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.960 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,050/1,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.

పేటీఎం: ఈ కౌంటర్‌లో మే నెలలో మొదలైన బుల్‌రన్ ఇంకా కొనసాగుతోంది. నష్టాల మార్కెట్లో ఈ షేరు మెరుగ్గా రాణించింది. సెప్టెంబరు త్రైమాసికంలో ఈపీఎస్ 211 శాతం, సేల్స్ 11 శాతం పెరగటంతో మదుపరుల ఆసక్తి పెరిగింది. గత శుక్రవారం 6.62 శాతం లాభంతో రూ.848 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.825 వద్ద పొజిషన్ తీసుకుని రూ.990/1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ: 24,000 వద్ద గట్టి పరీక్ష



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ఆరంభంలోనే 500 పాయింట్లు పతనమై బేరిష్ ట్రెండ్‌ను కనబరిచింది. అయితే కీలకమైన 24,000 స్థాయిల వద్ద రికవరీ సాధించి 24,500 స్థాయికి చేరుకున్నప్పటికీ అక్కడ నిలదొక్కుకోవటంలో విఫలమైంది. అంతేకాకుండా ఎలాంటి సానుకూల ట్రెండ్‌ను సూచించలేదు. చివరకు వారాంతంలో 155 పాయింట్ల నష్టంతో 24,150 పాయింట్ల వద్ద క్లోజైంది. 24,000 స్థాయిల వద్ద మద్దతు తీసుకోవాలని ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు. టెక్నికల్‌గా చూస్తే మొత్తం ట్రెండ్ బలహీనంగా కనిపిస్తోంది. వారం ప్రాతిపదికన చూస్తే గత వారం మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 150 పాయింట్లు, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 250 మేర పాయింట్ల మేరకు నష్టపోయాయి. గత వారం మార్కెట్ గమనం ప్రకారం చూస్తే ఈ వారం నిఫ్టీ మరోసారి నెగటివ్‌గా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోసారి 24,000 స్థాయిల వద్ద గట్టి పరీక్షను ఎదుర్కొనే వీలుంది. ప్రధాన బాటమ్ స్థాయిలైన 24,000 ఎగువన నిలదొక్కుకుంటేనే సానుకూల ట్రెండ్‌ను కనబరిచే అవకాశం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్ కోసం మైనర్ నిరోధ స్థాయిలైన 24,300 ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 24,500. ఇది రెండు వారాల క్రితం ఏర్పడిన గరిష్ఠ స్థాయి. ఇక్కడ నిలదొక్కుకుంటేనే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది.

బేరిష్ స్థాయిలు: ప్రధాన మద్దతు స్థాయిలైన 24,000 వద్ద నిలదొక్కుకోవటంలో విఫలమైతే మరింత బలహీనతను సూచిస్తుంది. సానుకూల రక్షణ కోసం కీలకమైన ఈ మద్దతు స్థాయిలకు ఎగువన కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. బలహీనతను సూచిస్తే మాత్రం స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటం మంచిది. తదుపరి మద్దతు స్థాయిలు 23,800, 23,500.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం సైడ్‌వేస్ ట్రెండ్‌ను కొనసాగించింది. కొద్ది వారాలుగా ఈ సూచీ 52,000 స్థాయిల్లో కదలాడుతోంది. వీక్లీ ప్రాతిపదికన చూస్తే గత వారం ఈ సూచీ 110 పాయింట్ల నష్టంతో 51,560 స్థాయిల వద్ద క్లోజైంది. సానుకూల ట్రెండ్ కోసం ప్రధాన నిరోధ స్థాయిలైన 52,000 ఎగువన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 52,600. ఒకవేళ బలహీనతను సూచిస్తే మాత్రం 51,000 దిగువన మద్దతు స్థాయిలుంటాయి. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనతను సూచిస్తుంది. తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 50,400.

పాటర్న్: నిఫ్టీకి 24,000 స్థాయిల వద్ద సమాంతరంగా దిగువకు ఏర్పడిన ట్రెండ్‌లైన్ దగ్గర మద్దతు స్థాయిలున్నాయి. ఒకవేళ ఈ మద్దతు స్థాయి కంటే దిగువకు చేరితే స్వల్పకాలిక బలహీనతను కనబరుస్తుంది. నిఫ్టీ ప్రస్తుతం 24,500 వద్ద అడ్డంగా కిందకు ఏర్పడిన నిరోధ రేఖకు దిగువన ఉంది. సానుకూలత కోసం ఈ రేఖకు ఎగువన బ్రేకౌట్ సాధించాల్సి ఉంటుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,110, 24,200
మద్దతు	24,000, 23,920

గ్రూప్-3 హాల్‌టికెట్లు సిద్ధం

» ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్షలు

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1,365 పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షల హాల్‌టికెట్లు ఆదివారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. మొదటి రోజు రెండు సెషన్లలో జనరల్ స్టడీస్, హిస్టరీ-పాలిటీ-సొసైటీ, రెండో రోజు ఎకానమీ సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగుతాయి. ఈ పోస్టులకోసం 5.68 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు టీజీపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. మొదటి సెషన్ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు.. రెండో సెషన్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తారు. పరీక్ష మొదలవ్వడానికి అరగంట ముందే గేట్లను మూసివేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. అంటే.. ఉదయం సెషన్‌లో 9.30, మధ్యాహ్నం సెషన్‌లో 2.30 గంటల్లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఒకే హాల్‌టికెట్‌ను అన్ని పరీక్షలకు వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలున్నా, అదనపు సమాచారం కావాలన్నా కమిషన్ ఫోన్ నంబర్లు 040-23542185, 040-23542187లను సంప్రదించాలని సూచించారు.

దేశాభివృద్ధికి స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో భాగం కండి

» విద్యార్థులను తీర్చిదిద్దడంలో దీని పాత్ర కీలకం: గవర్నర్



భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో సంస్థ ప్రతినిధులు రూపొందించిన పుస్తకాన్ని బుర్రా వెంకటేశ్‌తో కలిసి ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్

కవాడిగూడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంలో చేరితే దేశ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసిన వారవుతారని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్ దోమలగూడ గగన్‌మహల్‌లోని స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం డైమండ్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. క్రమశిక్షణ గల విద్యార్థులను తీర్చిదిద్దడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ముందు వరుసలో నిలుస్తుందని, ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులు సమాజానికి సేవలు అందించే మంచి డాక్టర్లు, నైపుణ్యం కలిగిన ఇంజనీర్లుగా తయారవుతారని అన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధులు రూపొందించిన పుస్తకాన్ని స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ చీఫ్ కమిషనర్ బుర్రా వెంకటేశ్‌తో కలిసి గవర్నర్ ఆవిష్కరించి విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.

ఝార్ఖండ్‌ను దోపిడీదారులపాలు కానివ్వకండి

» ఇండియా కూటమినే గెలిపించండి: భట్టి



హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ వనరులను తమకు కావాల్సిన కొద్ది మంది పెట్టుబడిదారుల చేతిలో పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి.. ఝార్ఖండ్ వనరులు దోపిడీదారుల పాలు కాకుండా కాపాడుకోవాలంటూ ఆ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఝార్ఖండ్ ఎన్నికలకు సంబంధించి ఏఐసీసీ సీనియర్ పరిశీలకుడిగా ఉన్న భట్టి.. ఆదివారం రాంఘర్ నియోజకవర్గ కాంగ్రెస్ బూత్ లెవల్ మీటింగ్, చిత్తార్పూర్ బహిరంగ సభలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదానీ, అంబానీ వంటి పెట్టుబడిదారుల నుంచి ఝార్ఖండ్‌కు విముక్తి కల్పించాలన్నారు.

గ్రామీణ విలేకరులే నా గురువులు

» బెజవాడతో అనుబంధానికి సాహిత్యం, పుస్తక ప్రదర్శనలే పునాదులు
» ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు కె.శ్రీనివాస్
» ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సత్కారం



విజయవాడ, విజయవాడ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పత్రికారంగంలో ఏ స్థాయిలో ఉన్నా నేర్చుకుంటూ ఉండాలని ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు కె.శ్రీనివాస్ అన్నారు. తాను పత్రికారంగంలో అడుగుపెట్టినప్పటి నుంచి ప్రజల జీవితాలను చాలా దగ్గరగా పరిశీలించడాన్ని వృత్తిలో భాగంగా అలవరుచుకున్నానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలోను, సాహితీమిత్రులు నిర్వహించిన మాటామంతీ కార్యక్రమంలోను శ్రీనివాస్ పాల్గొన్నారు. 1984లో ఉదయం పత్రిక మొదటి బ్యాచ్‌లో ట్రైనీ సబ్ ఎడిటర్‌గా తన పాత్రికేయ జీవితం విజయవాడలోనే ప్రారంభమైందని ఆయన తెలిపారు. సాహిత్యం, బుక్ ఫెస్టివల్, ఇక్కడి సమాజంతో సజీవ సంబంధాలను కొనసాగించడానికి పునాదులయ్యాయని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో 17 ఏళ్ల ప్రయాణంలో ప్రజల జీవితాలను చాలా దగ్గరగా పరిశీలించానన్నారు. గ్రామీణ విలేకరులే తనకు గురువులని ఆయన పేర్కొన్నారు. ప్రజాసమస్యలతో పత్రికలు సంబంధాలను కొనసాగించాలని, ఈ పనే 'ఆంధ్రజ్యోతి' చేసిందన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ముందుచూపుతో వ్యవహరించేవారు ఎంతో మంది ఉన్నారని చెప్పారు.


పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

శ్రీగిరిపై కార్తీక కాంతులు

» భక్తులతో కిక్కిరిసిన క్షేత్ర వీధులు

శ్రీశైలం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో శనివారం, ఆదివారం వరుస సెలవులు కలిసి కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్షేత్రానికి తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, ప్రధాన వీధులలో రద్దీ నెలకొంది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు దీప హారతులు, నైవేద్యాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరారు. కార్తీకమాసం శని, ఆది, సోమవారం రోజులలో భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులందరికీ స్వామి వారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయ ఉత్తర మాడవీధి ప్రాంగణం వద్ద, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రధాన ధ్వజస్తంభం వద్ద శాస్త్రోక్తంగా ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీకమాసోత్సవాల సందర్భంగా దేవస్థానంలో అఖండ శివ భజనల కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది.

మిల్లర్ల దొడ్డుదారి!

» బ్లాక్ మార్కెట్‌కు పంపిన ధాన్యం లోటు భర్తీకి పావులు
» రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోళ్లు

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేలంపాటలో ప్రభుత్వం విక్రయించిన ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకున్న రైస్‌మిల్లర్లు.. ఆ లోటును పూడ్చుకునేందుకు రైతుల నుంచి దొడ్డు ధాన్యం కొనుగోలు చేసే పనిలో పడ్డారు. మింగిన ధాన్యాన్ని కక్కాల్సిందేనని, లేకపోతే 25 శాతం జరిమానా విధిస్తామని ప్రభుత్వం హెచ్చరించడంతో.. ప్రస్తుత సీజన్‌లో వస్తున్న కొత్త ధాన్యంతో దానిని భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ప్రకటించడంతో.. బోనస్ లేని దొడ్డు ధాన్యాన్ని తక్కువ ధరకే ఫామ్‌గేట్‌లో కొనుగోలు చేస్తున్నారు. తేమ శాతం ఎక్కువ ఉందనే సాకుతో కనీస మద్దతు ధర కూడా చెల్లించడంలేదు. క్వింటాలుకు రూ.2 వేల నుంచి రూ.2,100 మించి ధర పెట్టడం లేదు. ధాన్యాన్ని ఆరబెట్టడం, తూర్పారబట్టడం, శుద్ధిచేయడం, 17 శాతానికి తేమ వచ్చేంతవరకు ఎదురుచూడటం ఎందుకనే ఉద్దేశంతో కొందరు రైతులు.. మిల్లర్లు అడిగిన ధరకు అమ్మేస్తున్నారు. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వేలంపాటలో విక్రయించిన విషయం తెలిసిందే. ఈ ధాన్యానికి క్వింటాలుకు రూ.2 వేల చొప్పున బిడ్డింగ్ ధర ఖరారైంది. టెండరు నిబంధనల ప్రకారం.. పే అండ్ లిఫ్టింగ్ సిస్టమ్‌ను అమలు చేయాలి. అంటే.. టెండర్ ఏజెన్సీలు ముందుగా ప్రభుత్వానికి డబ్బులు చెల్లిస్తే రిలీజింగ్ ఆర్డర్ (ఆర్వో) ఇస్తారు. ఆర్వోను రైస్‌మిల్లర్లకు పంపిస్తే.. వాళ్లు ధాన్యం అప్పగించాలి. ఇలా మొత్తం 35 లక్షల టన్నుల ధాన్యం విక్రయించి రూ.7 వేల కోట్లు రికవరీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

12 లక్షల టన్నుల ధాన్యం బ్లాక్ మార్కెట్‌కు..

ధాన్యం విక్రయం ద్వారా ప్రభుత్వం రికవరీ చేయాలనుకున్న మొత్తంలో ఇప్పటివరకు రూ.2,400 కోట్లు మాత్రమే రికవరీ అయ్యాయి. మొత్తం 35 లక్షల టన్నుల్లో.. ఇప్పటివరకు 12 లక్షల టన్నుల ధాన్యాన్ని మాత్రమే మిల్లర్లు ఏజెన్సీలకు అప్పగించారు. ఇంకా 23 లక్షల టన్నుల ధాన్యం అప్పగించాల్సి ఉంది. వీటికి సంబంధించి రూ.4,600 కోట్లు రావాల్సి ఉంది. కానీ, మిల్లర్ల వద్ద ఉండాల్సిన 23 లక్షల టన్నుల ధాన్యంలో.. 11 లక్షల టన్నుల వరకే మిల్లుల్లో నిల్వలున్నాయి. ఇంకా 12 లక్షల టన్నులను వారు బ్లాక్ మార్కెట్లో అమ్ముకున్నారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ బృందాలు రైస్‌మిల్లుల్లో జరిపిన తనిఖీల్లో ఈ మేరకు ధాన్యం షార్టేజ్ బయటపడింది. దీంతో ధాన్యాన్ని అమ్ముకున్న రైస్‌మిల్లర్ల వివరాలను ప్రభుత్వం సేకరించింది వారిపై నిఘా కూడా పెట్టింది. ధాన్యం రికవరీకి టాస్క్‌ఫోర్స్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్, డీఎస్‌వోలు, జిల్లా మేనేజర్లతో ఒత్తిడి చేస్తోంది. టెండరు ధాన్యం అప్పగించేందుకు డిసెంబరు 31 తేదీని తుది గడువుగా ప్రభుత్వం విధించిందని, ఈ గడువు దాటితే 25 శాతం జరిమానా చెల్లించాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఉదాహరణకు.. వేయి టన్నుల ధాన్యం బకాయిలున్న రైస్‌మిల్లరు గడువు లోపల చెల్లిస్తే వేయి టన్నులతో సమస్య పరిష్కారం అవుతుంది. లేకపోతే 1,250 టన్నులను ప్రభుత్వానికి అప్పజెప్పాల్సి వస్తుంది. ఇప్పటికే కొందరు అక్రమార్కులపై రెవెన్యూ రికవరీ యాక్టు, క్రిమినల్ కేసులు నమోదు చేశారు. టెండరు ధాన్యం లెక్కచూపని మిల్లర్లపైనా ఈ 3 అస్త్రాలు ప్రయోగించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయి. దీంతో డిసెంబరు 31 తర్వాత జరిమానాలు, కేసులు ఎదుర్కోవడం కంటే.. ముందే జాగ్రత్త పడడం మంచిదన్న ఉద్దేశంతో మిల్లరు దొడ్డు ధాన్యం బాట పట్టారు. కానీ, ఈ క్రమంలో తక్కువ ధరకు ధాన్యం అమ్ముకుంటూ రైతులు నష్టపోతున్నారు.


నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం పరిధిలో ధాన్యం ఖరీదు చేయకపోవడంతో మిల్లుల వద్ద బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు

సన్నాలకూ దక్కని ధర!

క్వింటాలుకు 2200 మాత్రమే పెడతామన్న మిర్యాలగూడ రైస్ మిల్లర్లు.. నాణ్యత, తేమ పేరుతో ధర తగ్గింపు

» మిల్లుల వద్ద రైతుల ధర్నా, రాస్తారోకో
» 3వేలకు పైగా ధాన్యం ట్రాక్టర్ల రాక
» రోజంతా ఆందోళనలు చేపట్టిన రైతులు
» వేరేదారి లేక మిల్లర్లు ఇచ్చిన ధరకే అమ్మకం

నల్లగొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వం బోనస్ ఇవ్వని దొడ్డు ధాన్యాన్ని రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లర్లు.. సన్న ధాన్యానికి కూడా కనీస మద్దతు ధర చెల్లించడంలేదు. ధాన్యం నాణ్యతగా లేదని, తేమ ఎక్కువ ఉందనే కారణాలు చూపుతూ.. ధరను తగ్గించేస్తున్నారు. ఇందుకు రైతులు అంగీకరించకపోతే ధాన్యం కొనుగోలును నిలిపివేస్తూ.. తాము నిర్ణయించిన ధరకే వారు విక్రయించే పరిస్థితులు కల్పిస్తున్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో రైతులకు ఇదే పరిస్థితి ఎదురైంది. క్వింటాలు ధాన్యానికి రూ.2300 కనీస మద్దతు ధరకుతోడు రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనితో కలిపి సన్న వడ్ల ధర క్వింటాలుకు రూ.2,800 అవుతుంది. అయితే తేమ శాతం ఎక్కువ ఉందన్న కారణంతో రైతులు మిల్లర్లకు అమ్మేందుకు వెళితే.. వారు క్వింటాల్‌కు రూ.2200కి మించి ఇవ్వలేమని తేల్చిచెప్పారు. దీంతో రైతులు రోడ్డెక్కారు. ఉన్నట్లుండి ధర తగ్గించడం, కొనుగోళ్లు నిలిపివేయడంతో ఆందోళన చేపట్టారు. పట్టణ శివార్లలో నార్కట్‌పల్లి- అద్దంకి జాతీయ రహదారి వెంబడి, మిర్యాలగూడ- కోదాడ రాష్ట్ర రహదారుల వెంబడి విస్తరించిన రైస్‌మిల్లుల వద్ద ధర్నాలు చేశారు. శనివారం సాయంత్రం నుంచి మిల్లుల వద్ద కాంటాలు నిలిపివేయడంతో ఈ రెండు ప్రాంతాల్లోని మిల్లుల వద్ద ఆదివారం ఉదయం వరకు 3వేల ధాన్యం లోడు ట్రాక్టర్లు నిలిచిపోయాయి. ఉదయం 10 గంటల వరకు కొనుగోళ్లు చేయకపోవడంతోపాటు, ధాన్యం నాణ్యతగా లేదని ధర క్వింటాల్‌కు రూ.2200కి మించి ఇవ్వలేమని మిల్లర్ల గుమాస్తాలు ప్రకటించారు. దీంతో రెండు ప్రాంతాల్లోనూ రైతులు ధర్నాలకు దిగారు. ఈ ఆందోళనతో రెండువైపులా దాదాపు రెండు గంటలకుపైగా రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచింది.


మిల్లు పాయింట్ల వద్ద రైతులు, మిల్లర్లతో మాట్లాడుతున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యే, అధికారులు వచ్చి చెప్పినా..

రైతుల ధర్నా విషయం తెలుసుకున్న వేములపల్లి తహసీల్దార్ కోటేశ్వరి, వేములపల్లి ఎస్‌ఐ వెంకటేశంతో కలిసి నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై ఉన్న మిల్లుల వద్దకు వచ్చి రైతులు, మిల్లర్లతో చర్చలు జరిపారు. ధాన్యాన్ని మిల్లుల్లోకి పంపించి తేమ శాతం(17) ప్రకారం ధర ఇవ్వాలని సూచించారు. మరోవైపు కోదాడ-మిర్యాలగూడ రహదారిపై ధర్నా చేస్తున్న రైతుల వద్దకు మిర్యాలగూడ తహసీల్దార్ హరిబాబు, రూరల్ ఎస్‌ఐ లోకేష్ వెళ్లి ట్రాక్టర్లను మిల్లుల్లోకి పంపించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మద్దతు ధర కల్పించి రైతుల ధాన్యం కాంటాలు వేసుకోవాలని సూచించారు. కానీ, మిల్లర్లు మాత్రం ధర కల్పించలేదు. రూ.2200కే పరిమితం చేశారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సైతం మిల్లర్ల వద్దకు వచ్చి రైతులు, మిల్లర్లతో మాట్లాడారు. ధాన్యానికి కనీస మద్దతు ఇవ్వాలని మిల్లర్లకు సూచించారు. ఎమ్మెల్యే అక్కడున్న కొద్దిసేపు సమారు 10మంది రైతులు తెచ్చిన ధాన్యానికి క్వింటాకు రూ.2400 ధర ఇచ్చారని, ఎమ్మెల్యే వెళ్లిపోయిన వెంటనే మళ్లీ ధాన్యం బాగోలేదంటూ కాంటాలు నిలిపివేసి క్వింటాకు రూ.2,200కి ధర పరిమితం చేశారని రైతులు వాపోయారు. గతేడాది, ఈ ఏడాది గతవారం వరకు సైతం ఈ మిల్లుల్లోనే సన్న ధాన్యానికి ఎటువంటి పట్టింపుల్లేకుండా క్వింటాకు రూ.2,400కుపైగా ధర ఇచ్చారని, ఈసారి ధాన్యం ఎక్కువగా వస్తుండటంతో ఉద్దేశ్యపూర్వకంగా ధర తగ్గించి తమ నోరు కొడుతున్నారని రైతులు తెలిపారు. తహసీల్దార్లు, ఎస్‌ఐలు వచ్చి తమకే నచ్చజెబుతున్నారు తప్ప.. మిల్లర్లు ధాన్యం కొనాలని, రైతులకు న్యాయం చేయాలని ఆదేశించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మిల్లర్లు చెప్పిన ధరకే ధాన్యం విక్రయించుకుని వెళ్తున్నామని తెలిపారు. మిల్లర్ల సిండికేట్ వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని, మిల్లు పాయింట్ల కొనుగోళ్లపై ప్రభుత్వ నియంత్రణ కరువైందని ఆరోపించారు. ప్రధానంగా శని, ఆదివారాల్లో కనీస పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తుతోందన్నారు. ఇకనుంచైనా మిల్లు పాయింట్ల వద్ద ధరల పర్యవేక్షణకు ప్రభుత్వం సిబ్బందిని నియమించాలని కోరారు.

17 నెలల్లో 8 మంది 'పుర' సంచాలకుల మార్పు

శాఖ కార్యక్రమాల అమలుపై ప్రభావం

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టణాభివృద్ధికి కీలకమైన పురపాలక శాఖలో రాష్ట్ర సంచాలకుల బదిలీలు ఏడాదిన్నర వ్యవధిలో 8 మంది మారడం ఆ శాఖలో చర్చనీయాంశం అయింది. 2023 జూలైలో పురపాలక శాఖ సంచాలకుడి(సీడీఎంఏ) గా ఉన్న ఎన్. సత్యనారాయణ పదవీ విరమణ చేశారు. ఆ తరువాత పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న అరవింద్‌కుమార్ తాత్కాలిక సీడీఎంగా వ్యవహరించారు. ఆయన తరువాత సుదర్శన్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. రెండు నెలలు తిరక్కముందే పమేల సత్పతి సీడీఎంఏగా వచ్చారు. ఆ తరువాత కొంత కాలానికే ఆమె బదిలీ అయ్యారు. హరిచందనను సీడీఎంఏగా నియమించారు. ఈమె 14 రోజులు పనిచేశాక నల్లగొండ కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో దివ్యదేవరాజన్‌ను నియమించారు. ఆమె చెరువుల పునరుజ్జీవం కోసం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసే సమయంలో నాలుగు నెలలు పనిచేశాక బదిలీ అయ్యారు. ఆ తరువాత సీడీఎంఏగా వీపీ గౌతంను నియమించారు. ఆయన ఎల్ఆర్ఎస్ మీద రోజువారీ సమీక్షలు చేస్తూ ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలను పర్యవేక్షించే తరుణంలో మూడు నెలలు తిరక్కముందే ఆయన్నూ బదిలీ చేశారు. ప్రస్తుతం టీకే శ్రీదేవిని సీడీఎంఏగా నియమించారు. ఏదైనా శాఖలో ఏడాదికి ఒకరో, ఇద్దరో కీలక అధికారుల మార్పు జరుగుతుంది. కానీ పురపాలక శాఖ సంచాలకుల(సీడీఎంఏ) విషయంలో వరుస బదిలీలు ఆ శాఖ కార్యక్రమాల అమలుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలనుకున్న కార్యక్రమాల పర్యవేక్షణ దెబ్బతినడంతోపాటు రోజువారీ పాలన సైతం గాడితప్పే ప్రమాదం లేకపోలేదని పలువురు అధికారులు భావిస్తున్నారు. రెవెన్యూ వనరుల సమీకరణ, ఆదాయ పెంపు వంటి కార్యక్రమాలపై స్వల్ప వ్యవధిలో అధికారుల మార్పు తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది. మునిసిపాలిటీల పరిధిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన పురోగతి కనిపించడంలేదు. నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీల పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం 13,77,619 దరఖాస్తులు రాగా.. ఎల్2 దశలో 16450 దరఖాస్తులు మాత్రమే పరిశీలనకు వచ్చాయి. ఎల్1 నుంచి ఎల్2, ఎల్3, ఎల్4 దశలకు చేరేందుకు నిరంతరం ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయాల్సి ఉంది.

పత్తి కొనుగోళ్లు బంద్..!

నేటి నుంచి కొనుగోలు కేంద్రాలకు తాళం!.. సీసీఐ నిబంధనలపై జిన్నింగ్ మిల్లర్ల కన్నెర్ర

» నిరవధిక సమ్మె దిశగా అడుగులు
» ఎల్-1, 2, 3 నిబంధనలతో రైతులకు తిప్పలు
» అన్ని సెంటర్లలో పత్తి కొనుగోళ్లకు.. కాటన్ అసోసియేషన్ డిమాండ్

హైదరాబాద్, ఆదిలాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు బంద్ అయ్యాయి. సోమవారం నుంచి కొనుగోలు కేంద్రాలకు తాళం వేస్తామని తెలంగాణ కాటన్ అసోసియేషన్ ప్రకటించింది. నిరవధిక సమ్మె దిశగా జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లర్లు అడుగులు వేస్తున్నారు. "కొనుగోళ్లను నిలిపేశాం. రైతులు సహకరించాలి. దయచేసి పత్తిని తీసుకురావొద్దు" అంటూ కొనుగోలు కేంద్రాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో ఆరుగాలం శ్రమించి, పత్తిని పండించిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మిల్లర్ల నిర్ణయానికి కారణం.. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొత్త నిబంధనలే.! గతంలో మాదిరిగా కాకుండా.. ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరుతో కొనుగోళ్ల బాధ్యతలను విడతల వారీగా చేపట్టాలని సీసీఐ నిర్ణయించింది. అంటే.. పత్తి జిన్నింగ్, ప్రెస్సింగ్ జాబ్‌వర్క్‌ను సీసీఐ మూడు క్యాటగిరీలుగా విభజించింది. అతి తక్కువ ధరకు జిన్నింగ్ చేసే మిల్లర్లను ఎల్-1, కాస్త ఎక్కువ కోట్ చేసిన వారిని ఎల్-2, అధిక ధరకు జిన్నింగ్ చేస్తామనే వారిని ఎల్-3 క్యాటగిరీలుగా విభజించింది. తొలుత కొనుగోలు బాధ్యతలను ఎల్-1 మిల్లర్లకు ఇస్తామని ప్రకటించింది. రాష్ట్రంలో ఉన్న 318 జిన్నింగ్ మిల్లులను సీసీఐ కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసింది. మిల్లర్లు పత్తిలో గింజలను తొలగించి, జిన్నింగ్, ప్రెస్సింగ్ చేసి.. బేళ్లుగా మార్చాక.. తిరిగి సీసీఐ స్వాధీనం చేసుకుంటుంది.



నాగర్ కర్నూల్ జిల్లాల్లో సీసీఐ సెంటర్ల వద్ద ఫ్లెక్సీలు

మంత్రులు చర్చలు జరిపినా..

రాష్ట్రంలో ఒక్కో పత్తి బేల్ జిన్నింగ్/ప్రెస్సింగ్‌కు మిల్లర్లు రూ.1,495 నుంచి రూ.1,550 వరకు కోట్ చేశారు. దాంతో.. ధర ఎక్కువగా కోట్ చేసిన వారి వద్ద మిల్లింగ్‌తో తమకు గిట్టుబాటు కాదంటూ సీసీఐ పేచీ మొదలుపెట్టింది. దాంతో.. 318 కేంద్రాలకుగాను.. ఎల్-1 కింద కోట్ చేసిన 165 కేంద్రాలకే జాబ్‌వర్క్ ఇచ్చే పరిస్థితి నెలకొంది. దీంతో.. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రంగంలోకి దిగారు. ఆయన సమక్షంలో సీసీఐ అధికారులు, తెలంగాణ కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమయ్యారు. సుదీర్ఘ చర్చల తర్వాత.. గత ఏడాది నిర్ణయించిన రూ.1,345కు రూ.5 కలిపి.. బేల్‌కు రూ.1,350 చెల్లించేలా ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో తమకు నచ్చిన మిల్లర్లకు రైతులు స్వేచ్ఛగా పత్తిని అమ్ముకునే వెసులుబాటు కలిగింది. చర్చల సందర్భంగా సరేనని చెప్పిన సీసీఐ.. ఆ తర్వాత మాట మార్చింది. దేశమంతా ఒక నిబంధన.. రాష్ట్రంలో మరోలా కుదరదని పేర్కొంటూ, తొలుత ఎల్-1 కేంద్రాల్లో పత్తి కొనుగోలుకు సిద్ధమని ప్రకటించింది. దీని వల్ల అటు మిల్లర్లకు జాబ్‌వర్క్ ఉండదని, రైతులకు దూరాభారం తప్పదని కాటన్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. పునఃపరిశీలించాలని సీసీఐని కోరింది. సీసీఐ అధికారులు ససేమిరా ఒప్పుకోకపోవడంతో.. అసోసియేషన్ నిరవధిక సమ్మె దిశలో ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో సోమవారం నుంచి కొనుగోళ్లను బంద్ చేస్తున్నట్లు ప్రకటించింది. జిన్నింగ్ మిల్లుల గేట్లకు తాళాలు వేసింది. గేట్ల వద్ద రైతులు పత్తిని తీసుకురావద్దని కోరుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. ప్రైవేటు కొనుగోళ్లను కూడా నిలిపివేయాలని జిన్నింగ్/ప్రెస్సింగ్ పరిశ్రమల యజమానులకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లేఖలు రాసింది. తమ సమస్య పరిష్కారమయ్యేదాకా పత్తి కొనుగోళ్లను పునరుద్ధరించేది లేదని ఆ లేఖల్లో స్పష్టం చేసినట్లు తెలంగాణ కాటన్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బొవిన్నేని రవీందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సీసీఐ అధికారలుఉ జిన్నింగ్ పరిశ్రమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అయన ఆరోపించారు. కొన్ని మిల్లుల్లోనే కొనుగోళ్లు జరిపితే.. రైతులు కూడా దూరాభారం, రవాణా ఖర్చులతో నష్టపోతారని వాపోయారు.

పత్తి రైతుల్లో గుబులు

కాటన్ అసోసియేషన్ నిర్ణయంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సీజన్ ప్రారంభంలో వర్షాభావం.. ఆ తర్వాత భారీవర్షాలతో పత్తిచేలు జాలుపట్టిపోయాయి. తెగుళ్లు, చీడపీడల బెడద కూడా ఈ సారి తీవ్రంగా ఉంది. ఫలితంగా దిగుబడి ఎకరానికి 10-12 క్వింటాళ్లకు బదులు.. ఐదారు క్వింటాళ్లకు పడిపోయింది. దిగుబడి తగ్గి ఆందోళన చెందుతున్న రైతులు.. ఇప్పుడు కొనుగోళ్ల నిలిచిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సీసీఐ 50వేల నుంచి 60 బేళ్ల వేల పత్తిని కొనుగోలు చేసినా.. ప్రైవేటులో 2.50 లక్షల బేళ్ల పత్తి విక్రయాలు జరిగినా.. దీపావళి తర్వాత పత్తితీత జోరందుకుంటుంది. వరుస సెలవుల తర్వాత.. సోమవారం నుంచి పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులు నిర్ణయించారు. ఈ వారం మార్కెట్‌కు పత్తి పోటెత్తే అవకాశాలుండగా.. జిన్నింగ్ మిల్లర్ల సమ్మెతో రైతులు కుదేలవుతున్నారు.

వర్రాకు బిగుస్తున్న ఉచ్చు!

» రాష్ట్ర వ్యాప్తంగా 20కిపైగా కేసులు నమోదు
» బీఎన్ఎస్, సైబర్ సెక్షన్ల కింద సైకోలకు చెక్

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అత్యంత హేయమైన భాషను ఉపయోగించి పోస్టులు చేసిన ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరుడు, జగన్ సతీమణి భారతి పీఏ వర్రా రవీంద్రా రెడ్డికి ఉచ్చు బిగుస్తోంది. పులివెందుల నియోజకవర్గం వేముల మండలానికి చెందిన ఆయనపై రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదవుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, పీసీసీ చీఫ్ షర్మిల సహా కూటమి నేతలు, వారి కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టులు పెట్టిన పాపం ఇప్పుడు వర్రాను వెంటాడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ సైబర్ సైకోపై వచ్చిన ఫిర్యాదులు అన్నింటినీ పోలీసులు సీరియస్‌గా తీసుకుని ఎక్కడికక్కడ కేసులు నమోదు చేస్తున్నారు. అనధికారిక సమాచారం మేరకు ఆదివారం సాయంత్రానికి 20కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు తెలిసింది. కడప, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, కర్నూలు, విజయవాడ, గుంటూరు జిల్లాల్లోని పలు పోలీసు స్టేషన్లలో వర్రాపై కేసులు నమోదయ్యాయి. అతని పోస్టుల్లోని వ్యాఖ్యల్లో తీవ్రత, వీడియోల్లో అశ్లీలత, ఫొటోల్లో అసభ్యత ఆధారంగా బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్లు ఎఫ్ఐఆర్‌లలో చేర్చినట్లు తెలిసింది. బీఎన్ఎస్ 111, చైల్డ్ అబ్యూజ్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తే ఆ వ్యక్తి జీవితం ఇక జైలుకే పరిమితం అవుతుంది. వర్రాతో పాటు రాష్ట్రంలో ఇలాంటి వ్యాఖ్యలు ఎవరెవరు, ఎప్పుడెప్పుడు చేశారనే వివరాలను ప్రతి జిల్లాలో పది మందితో కూడిన పోలీసు టెక్నికల్ బృందం వెలికి తీస్తోంది.

అడ్డగోలు పోస్టులు.. నిజామాబాద్ వాసి అరెస్టు

వైసీపీ సోషల్ మీడియా ముసుగులో టీడీపీ, జనసేన ముఖ్య నేతలను కించపరుస్తూ పోస్టులు పెడుతున్న వ్యక్తిని మంగళగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ కథనం మేరకు.. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా మెడోరా గ్రామానికి చెందిన బద్దం అశోక్‌రెడ్డి వైసీపీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా పనిచేస్తున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, మంత్రి అనిత, లోకేశ్ తదితర ముఖ్యనేతల ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారు. అశోక్‌రెడ్డిపై రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులకు సంబంధించి అశోక్‌రెడ్డిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితుడ్ని మంగళగిరి కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించిందని డీఎస్పీ తెలిపారు.

సజ్జల భార్గవ్‌పై అట్రాసిటీ కేసు

కడప, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సకలశాఖా మంత్రిగా ఖ్యాతిగాంచిన సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు, వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవరెడ్డి, జగన్ చిన్నాన్న వైఎస్ ప్రకాశ్‌రెడ్డి కుమార్తె కొడుకైన సింగారెడ్డి అర్జున్‌రెడ్డితో పాటు సోషల్ సైకో వర్రా రవీంద్రరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పులివెందులలోని టీడీపీ ఆఫీసులో పనిచేసే సింహాద్రిపురానికి చెందిన కొండప్పగారి హరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వర్రా పోస్టుల వెనుక భార్గవరెడ్డి, అర్జున్‌రెడ్డి, వైసీపీ సోషల్ మీడియా టీం ఉందని తెలిసిందని, అసభ్య పోస్టులపై ప్రశ్నించడానికి వెళ్లిన తనను కులం పేరుతో దూషించడంతో పాటు పోస్టు తీయాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని, లేదంటే చంపి పాతిపెడతానని బెదిరించారని హరి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు 196, 308 (5), 351(3), 353 (సి), 112(2)(బి) ఆర్/డబ్ల్యు3 (5) బీఎన్ఎస్ సెక్షన్ 3(1ఆర్) ఎస్ఆర్, ఎస్సీ ఎస్టీ యాక్ట్ 2015, 67ఆఫ్ ఐటీ యాక్ట్ మేరకు కేసు నమోదు చేశారు.



చాగంటి కోటేశ్వరరావును అభినందిస్తున్న సత్సంగం సభ్యులు

పదవి నాపై మరింత బాధ్యత పెంచింది

- నియామక ఉత్తర్వులు అందాక కార్యాచరణ ప్రణాళిక
- ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సర్పవరం జంక్షన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'హిందూ ధర్మం, సనాతన ధర్మంపై చేసిన ప్రవచనాలు ఆత్మ సంతృప్తినిచ్చాయి. నైతిక విలువలు లోపించడం, సంస్కృతీ సంప్రదాయాలపట్ల చిన్నచూపు, పిల్లలపై తల్లిదండ్రులు నియంత్రణ కోల్పోవడం వంటి కారణాలతో యువత ఆలోచనా విధానం మారింది. వీటన్నింటినీ అధిగమించేందుకు ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత చింతన అలవాటు చేసుకోవాలి' అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ఏపీ ప్రభుత్వం ఆయనను 'స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్ సలహాదారుడి'గా నియమించిన సందర్భంగా కాకినాడలో ఆదివారం పలువురు చాగంటిని కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చాగంటి తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. నెల్లూరులో ప్రవచనాలు ముగించుకుని శనివారం తిరుగు ప్రయాణంలో ఉండగా తనకు ప్రభుత్వం ప్రకటించిన పదవి గురించి తెలిసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే వేదిక ఏర్పాటు చేసి వేలాది మంది విద్యార్థులకు నైతిక విలువల పెంపు, సమాజహితం కోసం, తల్లిదండ్రులు గర్వించేలా, సమాజం, దేశం కోసం దేశభక్తి నింపేలా ప్రవచనాలు అందించేందుకు తనకు అవకాశం కల్పించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ పదవి తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నియామక ఉత్తర్వులు అందిన తర్వాత తన కార్యాచరణ ప్రణాళిక వివరాలను వెల్లడిస్తానని స్పష్టం చేశారు. కాగా, విద్యార్థులు-నైతిక విలువల ప్రభుత్వ సలహాదారుగా చాగంటి కోటేశ్వరరావు, మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వసలహాదారుగా ఎంఏ షరీఫ్‌ను నియమిస్తూ సాధారణ పరిపాలనా శాఖ ఉత్తర్వులిచ్చింది. వీరిద్దరికి కేబినెట్ హోదా కల్పించింది. వీరు రెండేళ్లపాటు ఈ పదవుల్లో కొనసాగుతారు.


సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని రంజోల్ సమీపంలో జాతీయ రహదారిపై కాలిపోతున్న కంటైనర్, దట్టంగా కమ్ముకొన్న పొగ

కంటైనర్‌లో చెలరేగిన మంటలు

- వాహనంతో పాటు 8 కార్లు దగ్ధం.. రూ.2 కోట్ల నష్టం

జహీరాబాద్, నవంబరు 10: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని రంజోల్ సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గుజరాత్ నుంచి జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు కంటైనర్‌లో 8 టాటా నెక్సాన్ కార్లను తరలిస్తుండగా షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ మేవరాం మీన వాహనాన్ని పక్కకు ఆపి మంటల్ని అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. కాసేపటికి మరింత పెద్దఎత్తున చెలరేగాయి. స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే పట్టణ సీఐ శివలింగం, రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా అప్పటికే కంటైనర్, కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దగ్ధమైన కార్లు, కంటైనర్ విలువ సుమారు రూ. 2 కోట్ల పైచిలుకు ఉంటుందని డ్రైవర్ తెలిపాడు. జాతీయ రహదారిపై దట్టమైన పొగ అలుముకోవడంతో పాటు మంటలు ఎగసిపడడంతో వాహనాల రాకపోకలకు అంత రాయం ఏర్పడింది. జహీరాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సొంతవారిపైనే కేసులు పెరుగుతున్నాయి

- మానవ సంబంధాలు తగ్గిపోతున్నాయి: జస్టిస్ నగేశ్

తాండూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో మానవ సంబంధాలు తగ్గిపోతున్నాయని, సొంతవారిపైనే కేసులు పెడుతున్న ఘటనలు ఇటీవలి కాలంలో పెరిగిపోతున్నాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక అన్నారు. ఈ కేసుల పరిష్కారానికి ఏళ్లు గడుస్తున్నాయని చెప్పారు. ఫలితంగా న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయని తెలిపారు. తాండూరు మున్సిఫ్ కోర్టు ఆవరణలో కొత్తగా నిర్మించిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జస్టిస్ నగేశ్ మాట్లాడుతూ.. తాండూరు అడిషనల్ కోర్టు, సబ్ కోర్టుల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి వినతులు అందిస్తే పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు.

ప్రియురాలి తండ్రిపై ఎయిర్‌గన్‌తో కాల్పులు

- తప్పిన ప్రాణాపాయం... నిందితుడి అరెస్టు

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రేయసిని తనకు దూరం చేశాడనే కోపంతో ఆమె తండ్రిపై ఓ యువకుడు ఎయిర్‌గన్‌తో కాల్పులకు తెగబడ్డాడు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం తీవ్ర కలకలం రేపింది. అంబర్‌పేటకు చెందిన బల్వీందర్ సింగ్(25) ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. 2015 నుంచి వెంకటేశ్వరకాలనీకి చెందిన తోటి విద్యార్థిని ఉన్నతిని ప్రేమించాలని వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఉన్నతి తండ్రి ఆనంద్(57) ఎవ్వరికీ తెలియకుండా తన కూతురిని ఏడాది క్రితం ఉన్నత విద్య కోసం అమెరికా పంపించాడు. దీంతో బల్వీందర్ సింగ్.. ఆనంద్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం ఎయిర్‌గన్, ఎయిర్ రైఫిల్ కొనుగోలు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం సుమారు 12.30 గంటల ప్రాంతంలో ఆనంద్ నివాసముంటున్న అపార్ట్‌మెంట్ వద్దకు వెళ్లి.. కాల్పులు జరిపాడు. ఆనంద్ కుడి కన్ను కింద పెల్లెట్ తగలగా అతడు భయంతో అక్కడి నుంచి బయటికి పరుగు తీశాడు. దీంతో ఆనంద్ కారును బల్వీందర్ ధ్వంసం చేశాడు. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుతుండడంతో బల్వీందర్ పరారయ్యాడు. అనంతరం పోలీసులు బల్వీందర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న ఆయుధాలు, పెల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

కేసీఆర్‌ను భరించే ఓపిక ప్రజలకు లేదు: అద్దంకి

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌ను భరించే ఓపిక తెలంగాణ ప్రజలకు ఉందనుకోవడం భ్రమేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. నాలుగు నెలల తర్వాత బయటికొచ్చిన కేసీఆర్.. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనంటూ ప్రగల్భాలు పలుకుతున్నార ని ఓ ప్రకటనలో విమర్శించారు. అన్ని వ్యవస్థలను విధ్వంసం చేసి.. తెలంగాణను ఏదో తానే నిర్మించినట్లుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

డ్రగ్స్ ముఠాలపై సర్జికల్ స్ట్రైక్స్!

కీలక సూత్రధారులపై పోలీసుల నజర్.. ఇతర రాష్ట్రాల్లో దాడులకు కార్యాచరణ

ఇప్పటికే పట్టుబడ్డ నిందితులు ఇచ్చిన సమాచారాన్ని విశ్లేషిస్తున్న టీజీ న్యాబ్

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ ముఠాల్లో కీలక సూత్రధారుల ఆట కట్టించేందుకు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్), పోలీసులు వ్యూహరచన చేస్తున్నారు. అవసరమైతే ఇతర రాష్ట్రాలకు వెళ్లి దాడులు నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. చాప కింద నీరులా డ్రగ్స్, గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల వాడకం విస్తరిస్తూనే ఉంది. ఎప్పటికప్పుడు సరఫరాదారులు పట్టుబడుతున్నా.. ఇతర రాష్ట్రాల్లో ఉన్న కింగ్ పిన్స్(ప్రధాన నిందితులు) మాత్రం చిక్కడం లేదు. పలు మార్లు ఆయా రాష్ట్ర పోలీసుల సహకారంతో కింగ్‌పిన్‌లను పట్టుకునే ప్రయత్నం చేసినా.. సాధ్యం కాలేదు. కొన్ని ప్రాంతాల్లో అక్కడి పోలీసులు మన వారికి సహకరించకపోగా.. డ్రగ్స్ ముఠాలకు సమాచారం అందించిన ఘటనలూ ఉన్నాయి. దీంతో డ్రగ్స్ సరఫరా నిరాటంకంగా కొనసాగుతోంది. ఇకపై అలా కాకుండా నేరుగా తెలంగాణ పోలీసులు రంగంలోకి దిగనున్నారు. ఈ నేపథ్యంలో సరఫరాదారులు, విక్రయదారులతో సరిపెట్టకుండా ఇతర రాష్ట్రాల్లో నక్కిన కీలక నిందితులను గుర్తించి పట్టుకునేందుకు సర్జికల్ స్ట్రైక్స్(నిందితుల సొంత గడ్డపైనే దాడులు) నిర్వహించనున్నారు. ఇందుకోసం తెలంగాణ పోలీసులు, టీజీ న్యాబ్, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు సంయుక్తంగా పని చేయనున్నారు. మరోవైపు.. రాష్ట్ర వ్యాప్తంగా టీజీ న్యాబ్, పోలీసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు, ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థలు నమోదు చేసిన కేసులను టీజీ న్యాబ్ విశ్లేషిస్తోంది. ఆయా కేసుల్లో పట్టుబడ్డ నిందితులు, విచారణలో వారు వెల్లడించిన సమాచారాన్ని క్రోడీకరిస్తోంది. ఎక్కువ కేసుల్లో బయట పడ్డ సమాచారం ఆధారంగా ఇతర రాష్ట్రాల్లో ఉన్న స్థావరాలపై దాడులు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఇకపై డ్రగ్స్, గంజాయి కేసుల్లో పట్టుబడే వారికి సంబంధించి నేరాంగీకార పత్రంలో వివరాలను ఒకే ఫార్మాట్‌లో సేకరించేలా అధికారులు చర్యలు చేపట్టారు. అంతేకాదు.. డ్రగ్స్, గంజాయి, ఇతర నిషేధిత మత్తుపదార్థాలను గుర్తించేందుకు వందకుపైగా జాగిలాలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గంజాయి, డ్రగ్స్ వాడిన తర్వాత చేతికి ఉండే వాసనను సైతం ఈ జాగిలాలు గుర్తించగలవు. వీటితో ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.



చుట్టూ సైబర్ దొంగలు.. ఆదమరిస్తే అంతే!

పార్ట్ టైం ఉద్యోగాల నుంచి హనీ ట్రాప్ దాకా..

- ఎన్నెన్నో మార్గాల్లో వల వేస్తున్న నేరస్థులు
- పలు సూచనలతో యూజీసీ హ్యాండ్ బుక్
- విద్యార్థుల్లో అవగాహన కోసం విడుదల

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు లాంటి వ్యక్తిగత వివరాలు సోషల్ మీడియాలో పంచుకుంటున్నారా? భారీ డిస్కౌంట్ల పేరుతో ఊరించే ప్రకటనల లింక్‌లు క్లిక్ చేస్తున్నారా? అయితే మీరు సైబర్ మోసగాళ్ల వలలో చిక్కే ప్రమాదం ఉన్నట్టే. దేశంలో సైబర్ మోసాలు పెద్దఎత్తున పెరుగుతున్నాయి. ఎంతోమంది వీటి బారిన పడి లక్షలు, కోట్లు పోగొట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, విద్యార్థుల్లో అవగాహన కలిగించటం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) 'ఏ హ్యాండ్ బుక్ ఆన్ బేసిక్స్ ఆఫ్ సైబర్ హైజీన్' పేరుతో ఇటీవల ఒక ఈ-బుక్ విడుదల చేసింది. సైబర్ నేరగాళ్లు ఏ విధంగా మోసాలకు పాల్పడుతున్నారు, వారి బారిన పడకుండా అప్రమత్తంగా ఎలా వ్యవహరించాలన్న అంశాల్ని దీంట్లో తెలియజేశారు. ఆ వివరాలు..

పార్ట్ టైం ఉద్యోగాలు, వర్క్‌ఫ్రం హోం, లైక్‌లు, షేర్లు, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, ఫెడెక్స్ పార్సిల్, డ్రగ్స్ కేసు, డిజిటల్ అరెస్ట్.. ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. హనీ ట్రాప్, సెక్స్‌టార్షన్, ట్రోలింగ్, పోర్నోగ్రాఫ్, కెరీర్ తదితర మార్గాల్లోనూ వారు కన్నేస్తున్నారు. ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న వారినీ టార్గెట్ చేసుకొని మెసేజీలు, కాల్స్ చేస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

పుట్టిన తేదీ, గ్రాడ్యుయేషన్ పూర్తయిన ఏడాది, తల్లిదండ్రుల పేర్లు.. వంటి వ్యక్తిగత వివరాలు సోషల్ మీడియాలో పెట్టొద్దు. ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతా, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు.

స్పామ్ ఈ-మెయిల్స్, సోషల్ మీడియాలో అనుమానాస్పద ఫ్రెండ్ రిక్వెస్టులపై స్పందించవద్దు. తెలియని వెబ్‌సైట్ లింకులను తెరవొద్దు. అనవసరమైన యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవద్దు. ఉచితం, భారీ డిస్కౌంట్లు అంటూ వచ్చే ప్రకటనలకు అనాలోచితంగా స్పందించవద్దు.

అనేక యాప్‌లు.. డౌన్‌లోడ్ చేసుకునే ముందు కాంటాక్ట్స్, కెమెరా, క్యాలెండరు యాక్సెస్(అనుమతి) అడుగుతాయి. యాప్‌ల గురించి క్షుణ్ణంగా తెలిస్తేనేఅనుమతించాలి. అనవసరంగా యాక్సెస్ అడిగే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దు.

ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ప్రతిసారీ పాస్‌వర్డ్ నమోదు చేయకుండా'రిమెంబర్ మీ', 'రిమెంబర్ పాస్‌వర్డ్' వంటి ఆప్షన్లు ఉంటాయి. వాటిని సేవ్ చేస్తే.. మోసాలకు అవకాశం ఇచ్చినట్టే.

ఇంట్లో ఉన్న ఉపకరణం పాడైతే సదరు కంపెనీకి ఫిర్యాదు చేసేందుకు కస్టమర్ కేర్ నెంబర్ కోసం చాలామంది గూగుల్‌లో వెదుకుతారు. కానీ, ఇటీవలి కాలంలో ఆయా కంపెనీల కస్టమర్ కేర్ నెంబర్ల పేరుతోనూ సైబర్ మోసగాళ్లు వల పన్ని ఉంటున్నారు. కాబట్టి, కంపెనీ నెంబర్ కోసం కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌నే సందర్శించాలి.

పబ్లిక్ వై-ఫై, ఫ్రీ వై-ఫై జోన్లలో అందించే ఇంటర్నెట్‌తో ఆర్థిక లావాదేవీలు, చెల్లింపులు జరపొద్దు. వ్యక్తిగత ఇంటర్‌నెట్‌నే వినియోగించాలి.

వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సన్నిహితులతో కూడిన ఫొటోలు, వీడియోలు, ఆధార్, పాన్ కార్డు, ఓటర్ ఐడీ, క్రెడిట్, డెబిట్ కార్డుల లాంటి డాక్యుమెంట్లు, వైద్యానికి సంబంధించిన సమాచారం.. సెల్‌ఫోన్లలో పెట్టుకోకపోవడమే మేలు.

ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్లతో జాగ్రత్తగా ఉండాలి. డాక్యుమెంట్ నుంచి పీడీఎఫ్ ఉచిత కన్వర్టర్, ఇమేజ్ రీసైజ్.. లాంటి సాఫ్ట్‌వేర్‌లు ఉచితంగా అందిస్తూ సమాచారాన్ని తస్కరిస్తాయి.

ఉచిత సాఫ్ట్‌వేర్లను అందిస్తూ అవసరానికి ఆదుకుంటూనే.. సమయం దొరకగానే అందినంత దండుకునే యాప్‌లు పెద్దసంఖ్యలో ఉన్నాయి. వీటితో జాగ్రత్తగా ఉండాలి. ఇలాంటి వాటిని డౌన్‌లోడ్ చేసుకోవద్దు.

6 నెలల్లో 165 మంది అరెస్టు

- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత ఆరు నెలల్లో తమ పరిధిలోని 7 సైబర్ క్రైం పోలీస్ స్టేషన్లలో నమోదైన 76 కేసుల్లో 165 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) వెల్లడించింది. తదుపరి విచారణ కోసం దేశవ్యాప్తంగా సంబంధిత పోలీసు స్టేషన్లకు ఈ అరెస్టుల సమాచారం చేరవేసినట్లు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయెల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. టీజీసీఎస్‌బీ సమాచారం ప్రకారం నిందితుల్లో 49 శాతం మంది 21-30 మధ్య వయస్కులు, 31-40 మధ్య వయస్కులు 28 శాతం మంది ఉన్నారు. వీరిలో గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు 45 శాతం మంది ఉన్నారు. గత 6 నెలల్లో దేశవ్యాప్తంగా 3,357, తెలంగాణలో 795 సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయని తెలిపారు.


కార్నల్‌పల్లిలో క్యూఆర్ కోడ్‌తో డబ్బులు అడుక్కుంటున్న కాటి కాపరి

కాటి కాపరి జేబుకు క్యూఆర్ కోడ్

- శ్మశాన వాటికలో వినూత్నంగా భిక్షాటన

చేగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూపీఐ అందుబాటులోకి వచ్చాక నగదు చెల్లించే విధానం చాలా వరకు తగ్గిపోయింది. ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌లకు అలవాటు పడిన చాలా మంది జేబులో డబ్బులు ఉంచుకోవడం లేదు. పరిస్థితులు మారడంతో చివరకు బిచ్చగాళ్లు కూడా క్యూఆర్ కోడ్‌లు పట్టుకుని తిరుగుతున్నారు. గాడిద పాలు అమ్మేవారు, గంగిరెద్దులు తిప్పేవారు కూడా ఆ జీవాలకు క్యూఆర్ కోడ్‌లు కట్టడం చూస్తున్నాం. అయితే, శ్మశాన వాటికలో కాటి కాపరులు సైతం క్యూఆర్ కోడ్‌ను జేబుకు పెట్టుకోవడం ఓ చోట ఆశ్చర్యాన్ని కలిగించింది. మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్‌పల్లికి చెందిన గణపురం బాలమణి అనారోగ్యంతో శనివారం మృతి చెందగా, ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో శ్మశానానికి వచ్చిన ఓ కాటికాపరి డబ్బులు ఇవ్వాలంటూ అక్కడికి వచ్చిన వారిని అడిగాడు. దీంతో కొంత మంది తోచినంత ఇచ్చారు. మరికొందరు డబ్బులు లేవని చెప్పడంతో.. తన అంగీ జేబుకు ఉన్న క్యూఆర్ కోడ్‌ను చూపించాడు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు చెల్లించవచ్చని ఆ కాటికాపరి చెప్పడంతో అక్కడున్న వారు ఆశ్చర్యపోయారు.

డిప్యూటీ కలెక్టర్ ఆస్తులు రూ.150 కోట్లు!

- మదనపల్లె డిప్యూటీ కలెక్టర్ మురళి అరెస్టు

తిరుపతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డిప్యూటీ కలెక్టర్ ఎంఎస్. మురళి మహా అవినీతి బట్టబయలైంది. అక్రమ మార్గాల్లో ఆయన కూటబెట్టిన ఆస్తులపై శనివారం మొదలైన ఏసీబీ తనిఖీలు ఆదివారం వరకు సాగాయి. మురళి నివాసంలో కిలో బంగారం, 800 గ్రాముల వెండి, ఆస్తులకు సంబంధించిన 33 డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. అదేవిధంగా 20 బ్యాంకుల్లో ఖాతాలతోపాటు ఏడు ఇళ్లు, ఒక హోటల్, 12 స్థలాలను గుర్తించినట్లు తెలిసింది. మార్కెట్ ధరల ప్రకారం ఈ ఆస్తుల విలువ సుమారు రూ.150 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. తనిఖీలు ముగియడంతో ఆదివారం డిప్యూటీ కలెక్టర్ మురళిని అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు నెల్లూరులో ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచేందుకు తరలించారు. మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో కొన్నాళ్ల కిందట అగ్నిప్రమాదం సంభవించి ఫైళ్లు దగ్ధమైన ఘటనలో మురళి సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. ఈ కేసును సీఐడీ అధికారులు విచారిస్తున్నారు. మరోవైపు మురళికి ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో అవినీతి నిరోధక విభాగం(ఏసీబీ) రంగంలోకి దిగింది. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి శని, ఆదివారాల్లో తిరుపతి, చిత్తూరు, వి.కోట, పలమనేరు, మదనపల్లె, కడప, నెల్లూరు తదితర చోట్ల తనిఖీలు చేపట్టారు. తిరుపతి, వి.కోటల్లోని మురళి నివాసాలతో పాటు ఆయన బంధువులు, మిత్రులు, బినామీలుగా అనుమానిస్తున్న వ్యక్తుల నివాసాల్లోనూ సోదాలు చేశారు. మురళి కూడబెట్టిన అక్రమాస్తులలో 80 శాతం వరకు బినామీల పేరిట పెట్టినట్లు ఏసీబీ గుర్తించింది.

అధ్యాపకులు లేరు.. సౌకర్యాలూ లేవు

ఆ మెడికల్ కాలేజీలకు ఈసీ ఇవ్వొద్దు.. సర్కారుకు హై పవర్ కమిటీ నివేదిక

- పీజీ సీట్ల కోసం ఎన్ఎంసీకి పలు ప్రైవేటు మెడికల్ కాలేజీల దరఖాస్తులు
- ఆకస్మిక తనిఖీలు జరిపిన కమిటీ
- విస్తుపోయేలా అక్కడి పరిస్థితులు

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అదనపు పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న పలు ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో తగినన్ని సౌకర్యాలు లేవని, తగినంత మంది అధ్యాపక సిబ్బంది లేరని హైపవర్ కమిటీ తనిఖీల్లో వెల్లడైంది. దీంతో, ఆయా కాలేజీలకు ఎసెన్షాలిటీ సర్టిఫికేట్ (ఈసీ)ను జారీ చేయవద్దని ప్రభుత్వానికి సదరు కమిటీ నివేదిక ఇచ్చింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కొత్త పీజీ మెడికల్ కోర్సులను ప్రారంభించేందుకు, ఉన్న సీట్లను పెంచుకునేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ)లో భాగమైన 'మెడికల్ ఎసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్' ఇటీవల అనుమతించింది. ఈ మేరకు ఈ ఏడాది సెప్టెంబరు 18న దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రకటన జారీ చేసింది. నిబంధనల మేరకు అర్హత కలిగిన ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలు పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. దీంతో రాష్ట్రం నుంచి ప్రభుత్వ కళాశాలలతోపాటు పలు ప్రైవేటు మెడికల్ కాలేజీలు పీజీ సీట్ల పెంపు కోసం దరఖాస్తు చేసుకున్నాయి.

ఈసీ తప్పనిసరి

ప్రైవేటు మెడికల్ కాలేజీలు కొత్త కోర్సులు ప్రారంభించాలన్నా, ఉన్న పీజీ సీట్లను పెంచుకోవాలన్నా ముందుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈసీ తీసుకోవాలి. దీనికోసం ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఒక విశ్రాంత జడ్జితో హైపవర్ కమిటీని నియమిస్తుంది. ఆ కమిటీ.. కాలేజీలను ప్రత్యక్షంగా తనిఖీ చేసి నిబంధనల మేరకు సదుపాయాలు, సిబ్బంది ఉంటే సీట్ల పెంపునకు ఈసీ ఇవ్వవచ్చని ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈసీ జారీ చేస్తుంది. అనంతరం ఆ సర్టిఫికేట్ ఆధారంగా ప్రైవేటు కాలేజీలు రాష్ట్రంలోని ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అనుబంధ కాలేజీగా గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. హెల్త్ యూనివర్సిటీ అఫిలియేషన్ ఇచ్చిన తర్వాత... అప్పుడు ఎన్ఎంసీకు దరఖాస్తు చేసుకోవాలి. ఎన్ఎంసీ కూడా తనిఖీలు చేసిన తర్వాత సంతృప్తి చెందితే.. కొత్త పీజీ సీట్లకు, ఉన్న సీట్ల పెంపుదలకు అనుమతిస్తుంది. ఈ నేపథ్యంలో, ఇటీవల హైపవర్ కమిటీ రాష్ట్రంలోని ఐదారు ప్రైవేటు మెడికల్ కాలేజీలను ఆకస్మికంగా సందర్శించింది. ఆ సమయంలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా ఆ మెడికల్ కాలేజీల్లో పీజీ సీట్లు పెంచుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవని హైపవర్ కమిటీ సభ్యులు గుర్తించారు. అధ్యాపకుల సంగతి అయితే మరీ ఘోరంగా ఉన్నట్లు తేలింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఓ మూడు ప్రైవేటు కాలేజీల్లోని అధ్యాపకులంతా నగరంలో బాగా ప్రాక్టీస్ ఉన్న డాక్టర్లని, పేరుకే వారంతా ఆ కాలేజీ రికార్డుల్లో ఉన్నారని సభ్యులు గుర్తించారు. సదరు అధ్యాపకులు ఎన్నడూ కాలేజీలకు వచ్చే పరిస్థితి లేదని హైపవర్ కమిటీలోని ఓ సభ్యుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అయితే, వారి పేరిట మరొకరు హాజరు వేస్తున్నట్లు తెలిసిందన్నారు. అలాగే కరీంనగర్ సమీపంలోని మరో ప్రైవేటు మెడికల్ కాలేజీ అధ్యాపకులంతా కరీంనగర్ పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో పని చేస్తున్న వైద్యులేనని హైపవర్ కమిటీ తనిఖీల్లో వెల్లడైంది. వరంగల్‌కు సమీపంలోని మరో కాలేజీది అదే పరిస్థితి. ఈ నేపథ్యంలోనే, ఆయా కాలేజీలకు ఈసీ ఇవ్వొద్దని హైపవర్ కమిటీ ప్రభుత్వానికి ఇటీవలే నివేదిక ఇచ్చినట్లు సమాచారం.

రాజకీయ అండతో బేఖాతరు

బీఆర్ఎస్ హయాంలో కూడా.. పలు ప్రైవేటు మెడికల్ కాలేజీలకు యూజీ కోర్సుల సందర్భంగా ఈసీ ఇవ్వకూడదని హై పవర్ కమిటీలు నివేదికలిచ్చాయి. కానీ, వాటిని నాటి సర్కారు పరిగణలోకి తీసుకోలేదు. కమిటీ కాదన్నప్పటికీ... ప్రైవేటు మెడికల్ కాలేజీలకు ఉదారంగా ఈసీలను ఇచ్చేసింది. రాజకీయ ఒత్తిళ్లతోనే ఇలా జరిగినట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి. రాష్ట్రంలో మొత్తం 28 ప్రైవేటు మెడికల్ కాలేజీలున్నాయి. వాటిలో మెజార్టీ కాలేజీలు రాజకీయ నాయకులవే. దీంతో వాటిపై చర్యలు తీసుకునే సాహసం వైద్య ఆరోగ్య శాఖ చేయలేకపోయింది. హెల్త్ వర్సిటీ కూడా వాటి జోలికి వెళ్లే సాహసం చేయలేదు. ఇప్పుడు కూడా ఐదారు ప్రైవేటు మెడికల్ కాలేజీలకు ఈసీ ఇవ్వొద్దని హైపవర్ కమిటీ నివేదిక ఇచ్చినప్పటికీ.. ఆయా యాజమాన్యాలు ఈసీ తెచ్చుకునే దిశగా పావులు కదుపుతున్నట్లు సమాచారం.

కమ్ముకొచ్చిన మృత్యువు

- శ్రీశైలం డ్యామ్ సందర్శనకు బయల్దేరిన ఏడు గురు స్నేహితులు
- డ్రైవర్ నిద్రమత్తు.. చెట్టును ఢీకొన్న కారు
- ఇద్దరి మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు


చెట్టును ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన కారు

యాచారం/కందుకూరు/పహాడిషరీఫ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వారంతా స్నేహితులు.. ఆదివారం కావడంతో సరదాగా గడిపేందుకు కారు అద్దెకు తీసుకుని శ్రీశైలం డ్యామ్ సందర్శనకు బయలుదేరారు. అయితే కారు నడుపుతున్న వ్యక్తికి నిద్రమత్తు కమ్ముకురావడంతో వారి యాత్ర విషాదంగా మారింది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల గేటు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పహాడీషరీఫ్ ప్రాంతానికి చెందిన ఏడుగురు స్నేహితులు ఇంతియాజ్‌ఖాన్, జుబెర్ నాయాబ్‌ఖాన్, అబ్దుల్ సమీర్, అబ్దుల్ సిరాజ్ ఖాన్, అబ్దుల్ అజీజ్ ఖాన్, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ ఫయాజ్.. శనివారం రాత్రి మెహదీపట్నంలోని ఓ ట్రావెల్స్‌లో కారు అద్దెకు తీసుకుని శ్రీశైలం డ్యామ్ సందర్శనకు బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో హైవే నుంచి ముచ్చర్ల గేట్ సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జుబెర్ నాయాబ్‌ఖాన్ (18) అక్కడికక్కడే మృతిచెందగా, కొన ఊపిరితో ఉన్న ఇంతియాజ్‌ఖాన్ (18)ను పోలీసులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. కారు నడుపుతున్న అబ్దుల్ సమీర్ నిద్రమత్తులో ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. గాయపడిన ఐదుగురిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన పహాడీషరీఫ్ ప్రాంతంలో విషాదాన్ని నింపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.